www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 208 | శుక్రవారం | 18 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

పనితీరే మీ విజయ రహస్యం

- నాలుగేళ్ళ పనితీరే మళ్ళీ గెలిపించింది
- పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం
- సిఎం కెసిఆర్‌పై సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ప్రశంసలు



మన తెలంగాణ/ హైదరాబాద్

ముఖ్యమంత్రి కెసిఆర్ పనితీరును, నాలుగేళ్ళ పాలనలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు 17.17 శాతానికి చేరుకోవడం పట్ల సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ప్రశంసలు కురిపించారు. నాలుగేళ్ళ పాలనా తీరుకు ప్రజలు మరోమారు అధికారాన్ని కట్టబెట్టారని, ఈ విజయం రాష్ట్ర అభివృద్ధికి కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణమని ఆ దేశ మంత్రి రాసిన లేఖలో పేర్కొన్నారు. సింగపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి తెలంగాణ తరువాయి 6లో

కెసిఆర్ కంటి వెలుగు పథకం ఆదర్శంగా ఒరిస్సాలో సునేత్ర

3



ఎన్నికలప్పుడే రాజకీయాలు, మిగతా రోజులన్నీ ప్రగతి కోసమే : సభ్యులతో విందులో సిఎం కెసిఆర్



కొలువు దీరారు

సిఎం కెసిఆర్ సహా 114 మంది కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారంతో కొలువుదీరిన నూతన శాసనసభ

3





పోటీ లేని పోచారం

- బరిలో ఒకే ఒక్క నామినేషన్
- ప్రతిపాదించిన సిఎం ఎఐఎం, కాంగ్రెస్‌లకు చెందిన ఐదుగురి మద్దతు సంతకాలు
- నేడు స్పీకర్‌గా బాధ్యతలు

2



డేరా బాబాకు జీవిత ఖైదు

- శిక్ష ఖరారు చేసిన సిబిఐ స్పెషల్ కోర్టు
- జర్నలిస్టు హత్యకేసులో తీర్పు

చండీగఢ్: డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాం రహీం సింగ్‌కు (డేరా బాబా), మరో ముగ్గురికి పంచకుల లోని ప్రత్యేక సిబిఐ కోర్టు గురువారం జీవిత ఖైదు విధించింది. 16 ఏళ్ల కిందట హర్యానాలో జర్నలిస్ట్ రామచంద్ర ఛత్రపతి హత్య కేసులో దోషిగా నిర్ణయించి డేరా బాబాకు తరువాయి 6లో

కేంద్రంలో ఎవరొచ్చినా రాష్ట్రానికి

నిధుల వరద

ప్రభావం చూపనున్న కెసిఆర్ రైతుబంధు



మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వానికి ఈసారి బడ్జెట్‌లో కేంద్రం నుంచి గ్రాంట్లు, నిధుల రూపంలో ఊరట లభించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలోని పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటున్నజాతీయ పార్టీలైన కాం గ్రెస్, బిజెపిలు రైతులకు పలురకాల హామీలను ఇస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు రుణమాఫీ లాంటివి ప్రకటించగా, ప్రస్తుతంకేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం త్వరలో తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు తరహా పథకాలను ప్రకటించే ఆలోచనలో ఉంది. కేంద్రంలో ఎన్‌డిఎ, యూపిఎ, ఏ కూటమి అధికారంలోకి వచ్చినా ముఖ్యమైన ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నందున దానికి తగిన నిధులను కూడా రాష్ట్రాలకు కేటాయించాల్సి ఉంటుంది. గణనీయ స్థాయిలోనే నిధులు లభించనున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలకు వెచ్చిస్తున్న నిధులకు ఒక మేరకు ఉపశమనం లభించే అవకాశం ఉంది. కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం రైతుబంధు పథకం ప్రకటనపై కసరత్తు చేయడం ఇందులో భాగమేనని టిఆర్ఎస్ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. కాంగ్రెస్ సైతం దేశవ్యాప్తంగా రుణమాఫీ పథకాన్ని తన మేనిఫెస్టోలో ప్రకటించనున్నట్లు సమాచారం. ఇలా ఏ జాతీయ పార్టీ అధికారంలోకి వచ్చినా అటు రుణమాఫీగానీ, ఇటు రైతుబంధుగానీ మేనిఫెస్టోలో పెట్టడం అనివార్యమని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లయితే వాటి అమలులో భాగంగా తరువాయి 6లో



విద్యాలయాల్లో సీట్ల సంఖ్య 10% పెంచుతాం

- ఈ విద్యా సంవత్సరం నుంచే అగ్రవర్ణ రిజర్వేషన్లు అమలు
- బిసి కోటాకు హాని కలగనివ్వం : మోడీ

14

మల్లన్నసాగర్ పనులు త్వరలో

మిగిలిన 100 ఎకరాల సేకరణ తొందరగా పూర్తి చేయాలని నిర్ణయం



మన తెలంగాణ/హైదరాబాద్

మల్లన్నసాగర్ పనులు త్వరలోనే మొదలుకానున్నాయి. భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరడంతో ఇక పనులు మొదలుపెట్టడంపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టింది. మొత్తం కాళేశ్వరం రీఇంజనీరింగ్‌లో మల్లన్నసాగర్ ప్రాజెక్టు చాలా కీలకం. ఇక్కడి నుంచి హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నల్లగొండ జిల్లాలకు తాగు, సాగు నీటి మళ్లింపు సాధ్యమవుతుంది. మల్లన్నసాగర్ దాటిన తర్వాత సుమారుగా 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, మార్గమధ్యంలో గ్రామాలు, హైదరాబాద్‌కు తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఫలితంగా మల్లన్నసాగర్‌పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తరువాయి 6లో

కుంచెపోటు





లోక్‌పాల్‌పై తేల్చండి

గడువు ఫిబ్రవరి నెలాఖరు

కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం

16

జైట్లీ రాకపోతే

బడ్జెట్ పెట్టేదెవరు?

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టే చాన్స్ పీయూష్ గోయల్‌కే!



న్యూఢిల్లీ: క్యాన్సర్‌తో బాధపడుతున్న కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అమెరికా వెళ్లడంతో ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టేదెవరనే సందేహాలు నెలకొన్నాయి. ఈ సమయంలోగా జైట్లీ అమెరికా నుంచి తిరిగి రాకపోయినట్లయితే రైల్వే మంత్రి పియుష్ గోయల్ తరువాయి 6లో



వచ్చే రెండు రోజులు కళ్లు కానని పొగ మంచు

- వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి
- వాతావరణ శాఖ హెచ్చరిక

మనతెలంగాణ/హైదరాబాద్

రానున్న రెండురోజుల్లో ఉదయం సమయంలో పొగమంచు దట్టంగా ఏర్పడే అవకాశం ఉందని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలో చలి తీవ్రత కొంతమేర తగ్గిందని, ఉత్తర దిశ, ఈశాన్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయని అధికారులు తెలిపారు. రాగల మూడు రోజుల్లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఆదిలాబాద్, కొమురంభీం, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మెదక్ మరియు సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు తరువాయి 6లో

ఆర్‌టిసి బలోపేతానికి చర్యలు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని రకాల ఆదాయ మార్గాలపై అధికార యంత్రాంగ ం దృష్టి సారించింది. ఆదాయ మార్గాల పెంపునకు సంబంధించి ఇప్పటికే సంస్థ ఉన్నతాధికారులు అవసరమైన కసరత్తును ప్రారంభించారు. ఇందులో భాగంగా గురు వారం బస్‌భవన్‌లో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్థిక), సంస్థ కార్యదర్శి పురుషోత్తం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సంస్థకు చెందిన ఇతర అధికారులతో పాటు హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్ అధికారులతో సుధీర్ఘంగా చర్చించారు. సంస్థ ఖాళీ స్థలాల వినియోగంపై చర్చించారు. ఇందులో ప్రధానంగా ఖాళీ స్థలాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటు, వాటి నిర్వహణతో పాటు ఆదాయం పెంపుదలకు సంబంధించిన అంశాలపై కూడా ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో పాటు ఆయా సంస్థల ప్రతినిధులతో చర్చించారు. అయిల్ అవుట్‌లెట్ ప్రదేశాల్లో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. ఇందులో ప్రధానంగా సేల్స్ రూమ్‌లు, టాయ్‌లెట్లు, పెద్లు వంటి వాటిని సమకూర్చాలని ఇడి సూచించారు. ఇంధన అవుట్‌లెట్స్ నిర్వహణ వల్ల ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వాటిని సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

పోటీలేని పోచారం

- తెలంగాణ రాష్ట్ర రెండవ సభాపతిగా పోచారం శ్రీనివాసరెడ్డి
- ఆరు సెట్ల నామినేషన్ పత్రాల దాఖలు
- పోచారం పేరు ప్రతిపాదిస్తూ తొలి సంతకం చేసిన సిఎం కెసిఆర్
- కాంగ్రెస్, ఎంఐఎం మద్దతు
- నేడు పోచారంను స్పీకర్‌గా ప్రకటించనున్న ప్రోటెం స్పీకర్





మన తెలంగాణ/హైదరాబాద్ : రాజకీయాల్లో సుదీర్ఘమైన అనుభవం, తెలంగాణ ఉద్యమంలో చురుకైన భూమిక పోషించిన సీనియర్ శాసనసభ్యుడు పోచారం శ్రీనివాసరెడ్డి రెండవ శాసనసభ స్పీకర్‌గా నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. గత ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా పనిచేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ముఖ్యమంత్రి కెసిఆర్ పలు సందర్భాల్లో బహిరంగంగానే 'లక్ష్మీ పుత్రుడు' అంటూ వ్యాఖ్యానించారు. ఆయన హయాంలోనే రైతుబంధు, రైతుబీమా, రైతు సమన్వయ సమితి లాంటి నూతన విధానాలు అమలులోకి వచ్చాయి. బాన్సువాడ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి పేరును అనేక తీరుల్లో ఆలోచించిన ముఖ్యమంత్రి కెసిఆర్ స్పీకర్ పదవికి ఎంపిక చేశారు. రాష్ట్రశాసన సభ స్పీకర్‌గా గురుతర బాధ్యతలను నిర్వహించాల్సిన అవసరాన్ని ఆయనతో చర్చించి అర్థం చేయించారు. ఆ మేరకు ఆయనను స్పీకర్ పదవికి ప్రతిపాదిస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ తొలి సంతకం చేయగా కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలకు చెందిన సభ్యులతో పాటు మొత్తం ఆరుగురు బలపర్చడంతో పోచారం ఎన్నిక దాదాపు లాంఛనప్రాయమే అయింది. స్పీకర్ పదవికి పోచారం శ్రీనివాసరెడ్డి పేరును ముఖ్యమంత్రి ప్రతిపాదించిన తర్వాత కాంగ్రెస్ తరఫున మల్లు భట్టి విక్రమార్క, ఎంఐఎం తరఫున మహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, టిఆర్ఎస్ తరఫున అజ్మీరా రేఖా నాయక్, తలసాని శ్రీనివాసయాదవ్, వి.అబ్రహం తదితరులు బలపరిచారు. దీంతో మొత్తం ఆరు సెట్ల నామినేషన్ పత్రాలను పోచారం శ్రీనివాసరెడ్డి దాఖలు చేశారు. శుక్రవారం జరగనున్న శాసనసభ సమావేశాల్లో ప్రోటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ పోచారంను స్పీకర్‌గా ప్రకటించనున్నారు.

నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో పోచారం శ్రీనివాస్ రెడ్డి సీనియర్ నాయకుడు. 1976లో రాజకీయ రంగ ప్రవేశం చేసి 1977లో దేశాయిపేట సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత సహకార బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేశారు. 1980లో బాన్సువాడ సమితి ప్రెసిడెంట్ గా పోటీచేసినా ఫలితం దక్కలేదు. అయితే 1981లో ఎల్‌ఎంబి డైరెక్టర్ గా బాధ్యతలు నిర్వహించి బాన్సువాడ ప్రజల్లో తన స్థానాన్ని పదిలపరుచుకున్నారు. ఎన్‌టిఆర్‌పై అభిమానంతో 1984లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని తీసుకుని బాన్సువాడ టిడిపి ఇన్‌చార్జ్‌గా అనేకమందిని పార్టీలోకి తీసుకొచ్చారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేశారు. నిజామాబాద్ జిల్లా సహకారబ్యాంక్ అధ్యక్షపదవిలో దీర్ఘకాలం పాటు కొనసాగారు. అయితే ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనే తపనతో టిడిపి పార్లమెంట్ అభ్యర్థిగా 1989లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా పార్టీకి సేవలు అందించారు. తొలిసారిగా 1994లో బాన్సువాడ శాసనసభ్యుడిగా ఎన్నికై గృహనిర్మాణం, గనులు, భూగర్భ శాఖమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1999లో రెండవ పర్యాయం శాసనసభ్యుడిగా ఎంపికై చంద్రబాబు మంత్రివర్గంలో పంచాయితీ శాఖ మంత్రిగా అనేక సంస్కరణలను అమలు చేశారు. ప్రధానంగా పంచాయితీ శాఖలో ఫైళ్ల క్లియరెన్స్, జన్మభూమి, పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి రాష్ట్ర ప్రజలకు మరింత చేరువయ్యారు. అయితే 2004 నాటి రాజకీయ పరిస్థితుల్లో టిడిపి అధికారం కోల్పోవడంతో పాటు పోచారం శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ జిల్లా టిడిపి అధ్యక్షుడిగా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టారు. టిడిపి నిర్వహించిన బాబ్లీ ప్రాజెక్టు పోరాటాల్లో పాల్గొని అరెస్టు అయ్యారు. తిరిగి 2009లో బాన్సువాడ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. అయితే టిడిపి ప్రతిపక్షస్థానంలో ఉండటంతో ఎలాంటి పదవులనూ నిర్వహించే అవకాశం ఆయనకు రాలేదు.

రాజకీయాల్లో పోచారం

తెలంగాణలో రాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున ఉద్యమం ఎగిసిపడుతూ విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకుంటున్న సమయంలో తెలుగుదేశం పార్టీలో కొనసాగడంపై మానసికంగా ఆవేదనకు గురైన పోచారం శ్రీనివాసరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి 2011లో టిఆర్ఎస్‌లో చేరి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. అదే సంవత్సరం జరిగిన ఎన్నికల్లో బాన్సువాడ నుంచి టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. పార్టీ మారినందున శాసనసభ సభ్యత్వానికి సైతం రాజీనామా చేయడంలో వచ్చిన ఉప ఎన్నికలో మళ్ళీ పోటీచేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. తెలంగాణ ఉద్యమం ముగింపు దశలో 2014లో బాన్సువాడ నుంచి పోటీచేసి విజయం సాధించడంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో తొలి వ్యవసాయమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. వ్యవసాయరంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశాలమేరకు అనేక పథకాలు ప్రవేశపెట్టి వాటిని పట్టుదలతో అమలు చేయడంలో కీలక భూమిక పోషించారు. 2017లో జరిగిన సాధారణ ఎన్నికల్లో బాన్సువాడ నుంచి మరోసారి గెలుపొందారు. స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించాలంటూ విపక్ష నేతలకు ముఖ్యమంత్రి కెసిఆర్ విజ్ఞప్తి చేయడంతో ఏ పార్టీ కూడా అభ్యర్థిని నిలబెట్టలేదు. దీంతో ఆయన ఎన్నిక దాదాపు ఏకగ్రీవమే అవుతోంది. ప్రకటన కేవలం లాంఛనప్రాయంగా మారింది. ప్రోటెం స్పీకర్ అధికారికంగా శుక్రవారం ప్రకటన చేయనున్నారు.






అసెంబ్లీకి వెళ్లడానికి ముందు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కెటిఆర్, హరీశ్, తలసాని, ఈటల, పద్మారావు సహా పలువురు టిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు

సుజనా అవినీతిపై ఫోరెన్సిక్ ఆడిట్

న్యాయవాది రామారావు డిమాండ్



మనతెలంగాణ/హైదరాబాద్ : కేంద్ర మాజీ మంత్రి సుజనచౌదరి అవినీతి, అక్రమాలపై ఎస్ఎఫ్ఐఒ అధికారులు ఫోరెన్సిక్ ఆడిట్(శాస్త్రీయ పరమైన దర్యాప్తు) చేపట్టాలని న్యాయవాది రామారావు డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సృజనాచౌదరి అవినీతి, అక్రమాస్తులను వివరించారు. సుజనాచౌదరి అవినీతి, అక్రమాలు దేశ విదేశాల్లోనూ ఉన్నాయని తెలిపారు. అనధికారికంగా నెలకొల్పిన 22 కంపెనీలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సృజనా చౌదరి అక్రమాలు దాదాపు 6 వేల కోట్ల నుంచి 7 వేల కోట్ల రూపాయల వరకు ఉంటాయన్నారు. మోసాలలో భాగంగా తన తండ్రిపేరు సైతం మార్చాడని తెలిపారు. ఒక సంస్థలో జనార్థన్ చౌదరి అని, మరో సంస్థలో జనార్ధన్‌రెడ్డి అని పేర్కొనడం హేయమన్నారు. వివిధ బ్యాంకుల ఫిర్యాదు మేరకు ఇతర దేశాలలో సైతం 11 కేసులు నమోదయ్యాయని, 2014 ఆల్ ఇండియా బ్యాంక్ అసోషియేషన్ 400 సంస్థలు వివిధ మోసాలకు పాల్పడినట్లు ప్రకటించగా అందులో సృజనా చౌదరికి చెందినవి కూడా ఉన్నాయన్నారు. ముఖ్యంగా సృజన మెటల్ ఫ్యాక్టరీలో ఇన్వెస్టర్లను దారుణంగా మోసగించారని తెలిపారు.ఆ కంపెనీకి చెందిన షేర్లు సైతం 97, 93శాతం పడిపోయాయని తెలిపారు. ఇప్పటికే అతని ఆస్తులు హైదరాబాద్‌లో కొన్నింటిని సీజ్ చేశారని, సృజనచౌదరి అక్రమాలపై ఎస్ఎఫ్ఐఒ అధికారులు ఫోరెన్సిక్ ఆడిట్(శాస్త్రీయ పరమైన దర్యాప్తు) చేపట్టాలని న్యాయవాది రామారావు డిమాండ్ చేశారు.

ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.20 వేల కోట్ల మేర ఖర్చు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రభుత్వం రూ.20 వేల కోట్లకు పైగా వెచ్చించింది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.20,907 కోట్ల మేర ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఖర్చు చేశారు. బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లు కేటాయించగా, బడ్జెట్ కేటాయింపులు, కాళేశ్వరం కార్పొరేషన్, జలవనరుల మౌలిక వసతుల కార్పొరేషన్ నిధులతో కలిపి రూ.20 వేల కోట్లకు పైగా ఖర్చు చేయడం గమనార్హం. ఇందులో ప్రధానంగా కాళేశ్వరంపైనే సగానికిపైగా వెచ్చించారు. రూ.12,100 కోట్లకు పైగా కాళేశ్వరంకు వెచ్చించారు. సమైక్య రాష్ట్రంలో పట్టని ఇరిగేషన్ రంగాన్ని సోయితో రీడిజైనింగ్, రీ ఇంజనీరింగ్ చేసి పట్టాలెక్కించిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుంది. నీరు లేక వట్టిపోతున్న శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టుల ఆయకట్టును సైతం రక్షించేలా ప్రాజెక్టుల రీడిజైన్ చేసిన సంగతి తెలిసిందే. గత మూడున్నరేళ్ల నుంచి ఏటా ఇరిగేషన్‌కు రూ.25 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. రూ.20,907 కోట్లు ఖర్చు చేయగా, ఇంకా రూ.10,200 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకే రూ.20 వేల కోట్లు ఖర్చు చేయగా, మిగతా మొత్తాన్ని మీడియం, మైనర్ ఇరిగేషన్ రంగాలకు కేటాయించారు. మైనర్ ఇరిగేషన్‌లో రూ.752 కోట్లు, మీడియం ఇరిగేషన్‌లో రూ.151 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఖర్చు చేసింది.

ప్రాజెక్టులపై ప్రభుత్వం చేసిన ఖర్చు వివరాలిలా ఉన్నాయి. (2018–19 ఆర్థిక సంవత్సరంలో)

1. కాళేశ్వరం	రూ.12,100 కోట్లు
2. పాలమూరు రంగారెడ్డి	రూ.1,631 కోట్లు
3. శ్రీరాంసాగర్	రూ.281 కోట్లు
4. ఎఎంఆర్‌పి ఎస్ఎల్‌బిసి	రూ.365.3 కోట్లు
5. నాగార్జునసాగర్ ప్రాజెక్టు	రూ.234 కోట్లు
6. కల్వకుర్తి ఎత్తిపోతల	రూ.260 కోట్లు
7. వరద కాలువ	రూ.1226 కోట్లు
8. దేవాదుల ఎత్తిపోతల	రూ.972 కోట్లు
9. సీతారామ	రూ.1490 కోట్లు
10. డిండి ఎత్తిపోతల	రూ.423.8 కోట్లు
11. మైనర్ ఇరిగేషన్	రూ.752 కోట్లు

కొలువుదీరిన అసెంబ్లీ

శాసనసభ్యుల ప్రమాణం

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర శాసనసభకు నూతనంగా ఎన్నికైన సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 119 మంది సభ్యులకు గాను 114 మంది సభ్యులు సభకు హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. వేర్వేరు కారణాలతో ఐదుగురు సభ్యులు సభకు హాజరుకాలేకపోవడంతో ప్రమాణ స్వీకారం జరగలేదు. ఎక్కువమంది సభ్యులు దైవసాక్షిగా ప్రమాణం చేయగా కొద్దిమంది పవిత్ర హృదయం పేరుతో ప్రమాణ స్వీకారం చేశారు. ఎక్కువ మంది తెలుగులో ప్రమాణం చేయగా కొద్ది మంది ఆంగ్లంలో ప్రమాణం చేశారు. సభా నాయకుడిగా ముఖ్యమంత్రి కెసిఆర్‌చేత తొలి ప్రమాణ స్వీకారం చేయించిన ప్రోటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఆ తర్వాత మహిళలతో అక్షరమాల క్రమంలో చేయించారు. ఆ తర్వాత మిగిలిన సభ్యులతో చేయించారు. ఉదయం 11.24 నిమిషాలకు సభలోకి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాగానే ప్రొటెం స్పీకర్‌కు నమస్కరించి, సభ మొత్తం కలియతిరిగి సభ్యులందరికీ నమస్కరించారు. కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్కలతో కరచాలనం చేశారు. అనంతరం జనగణమనతో సభ ప్రారంభమైంది. ప్రమాణ స్వీకారంపై ప్రొటెం స్పీకర్ సూచనలు చేశారు. తరువాత సభానాయకుడిగా ముందుగా సిఎం కెసిఆర్ తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. ప్రతిపక్ష నాయకుడు, మంత్రులు లేకపోవడంతో ఇంగ్లీష్ అక్షర క్రమంలో ముందుగా మహిళ సభ్యుల చేత ప్రమాణం స్వీకారం చేయించారు. ఇందులో అజ్మీరా రేఖా నాయక్, బానోతు హరిప్రియ, దనసూరి అనసూయ, గొంగిడి సునీత, పద్మా దేవేందర్ రెడ్డి, పి. సబితా ఇంద్రారెడ్డి ఉన్నారు. ఆ తరువాత ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అందరికంటే చివరగా వేముల ప్రశాంత్ రెడ్డి సభలో ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం తొమ్మిది మంది సభ్యులు ఇంగ్లీష్‌లో ప్రమాణస్వీకారం చేయగా, ఇద్దరు ఎంఐఎం సభ్యులు ఉర్దూలో చేశారు. అత్యధికంగా 100 మంది సభ్యులు దైవసాక్షిగా ప్రమాణం చేయగా, 14 మంది సభ్యులు 'పవిత్ర హృదయం' సాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో ఒక సభ్యుడు కాలె యాదయ్య పవిత్ర హృదయం, దైవసాక్షి అనే రెండు తీరుల్లో చేశారు. ఆత్రం సక్కు వారి తెగ నాయకుడైన బిర్సా ముండా సాక్షిగా ప్రమాణం చేయడంతో అసెంబ్లీ కార్యదర్శి అంగీకరించలేదు. దీంతో ఆయన మళ్లీ దైవసాక్షిగా ప్రమాణం చేశారు. మొత్తం 2 గంటల 11 నిమిషాల పాటు సభ కొనసాగింది. ఆ తరువాత సభను శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ప్రొటెం స్పీకర్ ప్రకటించారు.









హాజరుకాని ఐదుగురు సభ్యులు

గోషామహల్ బిజెపి ఎంఎల్‌ఎ రాజాసింగ్ ప్రోటెం స్పీకర్‌గా ఎంఐఎంకు చెందిన శాసనసభ్యుడు ఉన్నందున తాను ప్రమాణం చేయనంటూ ముందుగానే చెప్పి సభకు గైర్హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల ప్రచారం కారణంగా సత్తుపల్లి శాసనసభ్యుడు సండ్ర వెంకట వీరయ్య హాజరు కాలేదు. టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ మాధవరం కృష్ణారావు, ఎంఐఎం ఎంఎల్‌ఎలు అక్బరుద్దీన్ ఒవైసి, జాఫర్ హుస్సేన్‌లు కూడా ప్రమాణ స్వీకారానికి హాజరుకాలేదు.

ఇంగ్లీష్‌లో చేసిన సభ్యులు వీరే

ముందుగా అజ్మీరా రేఖానాయక్ ఇంగ్లీష్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తరువాత కాలేరు వెంకటేష్, షకీల్ అహ్మద్, మైనంపల్లి హనుమంతరావు, ఆంగ్లో ఇండియన్ సభ్యులు స్టీఫెన్ సన్, కాంగ్రెస్ సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, బానోతు హరిప్రియ, ఎంఐఎం సభ్యులు అహ్మద్ బలాల, మహ్మద్ మోజమ్ ఖాన్ ఉన్నారు.

...అను నేను పవిత్ర హృదయంతో

శాసనసభ్యులు కె.తారకరామారావు, ఈటల రాజేందర్, జి.జగదీశ్వర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, సోలిపేట రామలింగారెడ్డి, పోడెం వీరయ్య, నోముల నర్సింహయ్య, నన్నపనేని నరేందర్, క్రాంతికిరణ్ చంటి, కందుల ఉపేందర్ రెడ్డి, ఎలగమోని అంజయ్య యాదవ్, గుర్క జైపాల్ యాదవ్, సభ్యురాలు దనసూరి అనసూయ 'పవిత్ర హృదయం' సాక్షిగా అంటూ ప్రమాణం చేశారు. చేవెళ్ళ శాసనసభ్యుడు కాలె యాదయ్య మాత్రం పవిత్ర హృదయం సాక్షిగా, దైవసాక్షిగా అంటూ రెండింటిమీద ప్రమాణం చేశారు.















వీల్‌ఛైర్‌లో సాయన్న

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి ఎన్నికైన సభ్యులు జి.సాయన్న కాలికి గాయం కావడంతో వీల్‌ఛైర్‌లో వచ్చి ప్రమాణస్వీకారం చేశారు. ఇందుకు ప్రొటెం స్పీకర్ అనుమతించారు. ఇక దానం నాగేందర్ కూడా గాయంతో ఇబ్బందిపడుతూనే నిల్చుని ప్రమాణం చేశారు.

కాంగ్రెస్ సభ్యులను పలకరించిన సిఎం



మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర శాసనసభా సమావేశాలు అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శాసనసభ ప్రారంభానికి కొద్దిగా ముందు వచ్చిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మొదట కాంగ్రెస్ సభ్యులదగ్గరకు వెళ్లి పలకరించారు. టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌ఎ ఉత్తమ్‌కుమార్ రెడ్డి సీటు దక్కరకు వెళ్లి పలకరించడంతోపాటు మల్లు భట్టి విక్రమార్క తదితర సభ్యులతో కరచాలనం చేశారు. అనంతరం ఎంఐఎం సభ్యులను పలకరించారు. ముఖ్యమంత్రితో కలిసి జగదీష్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి విపక్ష సభ్యుల దగ్గరకు వెళ్లారు.ఆనంతరం సభలోని సీనియర్ సభ్యులను పలకరించారు. శాసనసభలో పార్టీలకు అనుగుణంగా కాంగ్రెస్ సభ్యులు మూడురంగుల కండువాలతో రాగా టిఆర్‌ఎస్ గులాభి కండువాలతో సభలోకి వచ్చారు. ఎంఐఎం సభ్యులు సంప్రదాయ దుస్తులతో సభకి రాగాటిడిపి సభ్యుడు పచ్చకండువాతో వచ్చారు. ఇదిలా ఉండగా ఉదయం 11.10 నిమిషాలకు గంగుల కమలాకర్ అందరికంటే ముందుగా సభలో అడుగు పెట్టారు. ఆతర్వాత జువ్వాడ రత్నాకర్, జె.దివాకర్ రావు వచ్చారు. ఈటెల రాజేందర్, హరీష్‌రావు, పద్మాదేవేందర్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జోగురామన్న, కెటిఆర్ ఒకరితర్వాత ఒకరు వచ్చారు. 11.20 నిమిషాలవరకు దాదాపుగా సభ్యులందరూ శాసనసభ లోకి చేరుకున్నారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు రాకకు ముందు హోంశాఖ మంత్రి మహ్మద్ అలీ సభకు వచ్చారు. పార్టీలను మరిచి సభ్యులు కొద్దిసేపు ఒరినొకరు పలకరించుకుంటూ స్నేహపూరిత వాతావరణాన్ని కల్పించారు.

శాసన సభలో కొత్త సభ్యులు 27 మంది

పిన్న వయస్కురాలు హరిప్రియా నాయక్



మనతెలంగాణ/ హైదరాబాద్: ప్రస్తుత శాసనసభలో అందరికంటే ఎక్కువ రాజకీయ అనుభవం ఉన్న నేత ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రమే. కెసిఆర్‌తో పోలిస్తే వయసురీత్యా కొద్దిమంది సీనియర్ సభ్యులు ఉన్నప్పటికీ శాసనసభలో సీనియర్‌లు మాత్రం లేరు. గురువారం ప్రారంభమైన శాసనసభ పాత,కొత్త సభ్యుల మేలికలయికతో సభ గుభాళించింది.కొత్తగా సభలోకి వచ్చిన సభ్యులు సీనియర్ సభ్యులను పరిచయం చేసుకోవడం, సీనియర్ సభ్యులు వారితో సరదాగా గడపడం సభలో సందడిగా మారింది. తెలంగాణ రెండవ శాసన సభలో 88 మంది టిఆర్‌ఎస్ సభ్యులు, 19 మంది కాంగ్రెస్ సభ్యులు, ఎంఐఎం నుంచి 7 సభ్యులు స్వతంత్ర్య అభ్యర్థులు ఇద్దరు,బిజెపి ఒకరు,టిడిపి నుంచి ఇద్దరున్నారు. అయితే టిఆర్‌ఎస్, కాంగ్రెస్, స్వతంత్ర్య అభ్యర్థుల్లో కొత్తగా శాసన సభలో అడుగుపెట్టిన వారు 27 మంది సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్ నుంచిఆరుగురు ఉండగా అతితక్కువ వయస్సులో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇల్లందునుంచి గెలిచిన హరిప్రియ నాయక్ ఉన్నారు. అలాగే ఇండిపెండెంట్ అభ్యర్థులు రాములు నాయక్, కొరికంటి చందర్ ఉన్నారు. రామగుండం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా గెలిచిన చందర్ ఇప్పటికే టిఆర్‌ఎస్ లో చేరారు. మిగతా సభ్యులందరూ అధికారటిఆర్‌ఎస్ నుంచి గెలిచిన సభ్యులు శాసనసభలో కొలువుతీరారు. ఇదిలాఉండగా పార్లమెంట్ సభ్యులు బాల్కసుమన్, మల్లారెడ్డి శాసనసభ్యులుగా గెలిచారు. అలాగే ముగ్గురు శాసనమండలిసభ్యులు శాసనసభకు పోటీచేసి గెలిచారు. వీరిలో టిఆర్‌ఎస్ నుంచి పట్నం నరేందర్, మైనం పల్లి హన్మంతారావు ఉండగా కాంగ్రెస్ నుంచి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నారు.

చంద్రబాబును ఆ రాష్ట్ర బిసిలే ఓడిస్తారు

ఆయన చరిత్ర ప్రజలకు తెలుసు : తలసాని



మన తెలంగాణ/ హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి, సనత్ నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ నిప్పులు చెరిగారు. ఫెడరల్ ఫ్రంట్ పేరు వింటేనే చంద్రబాబుకు వణుకు పుడుతోందని, ఇటీవల తాను ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా విజయవాడలోని కనకదుర్గ గుడి దగ్గర చేసిన వ్యాఖ్యలు ఆయనకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. శాసనసభా ప్రాంగణంలో మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేవాలయం దగ్గర రాజకీయ వ్యాఖ్యాలు సమంజసం కాదంటూ తనను ఉద్దేశించి చంద్రబాబు ఇటీవల వ్యాఖ్యలు చేశారని, కానీ పాత్రికేయులు తనను మాట్లాడాల్సిందిగా కోరినందువల్లనే తాను పెదవి విప్పాల్సి వచ్చిందని స్పష్టత ఇచ్చారు. చంద్రబాబు తరహాలో తనకు దేవాలయాల దగ్గర రాజకీయాలు చేసే అలవాటు లేదని, ఏ పరిస్థితుల్లో తాను ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందో తెలుసుకోవాలని హితవు పలికారు. తాను ఆంధ్రాలో బిసి నాయకులను కలిస్తే చంద్రబాబు ఎందుకు భయపడాలని ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలే రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. తనకు విజయవాడతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని చాలా చోట్ల బంధువులు ఉన్నారని, బంధుత్వాలు, బంధాల విలువ తనకు తెలుసు కాబట్టే విజయవాడకు వచ్చానని తెలిపారు. చంద్రబాబుకు అలాంటి విలువ తెలియదు కాబట్టే హరికృష్ణ చనిపోయినప్పుడు అక్కడ కూడా శవ రాజకీయాలు చేశారని, అలాంటి నీచమైన సంస్కృతి ఆయన నైజం అని తలసాని వ్యాఖ్యానించారు. ఇటీవల తాను ఆంధ్రప్రదేశ్‌లో తిరగడంతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, దాన్ని జీర్ణించుకోలేకనే తనపై విమర్శలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు తన ధోరణి మార్చుకోకుండా ఇలాగే వ్యవహరిస్తే త్వరలో బి.సి.లెవరూ ఆ పార్టీలో ఉండరని అన్నారు. ఈ దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో ఫెడరల్ ఫ్రంట్ వేదికగా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను, నాయకులను కెసిఆర్ కలుస్తున్నారని, దీన్ని చూసి చంద్రబాబు వణికిపోతున్నారని అన్నారు. చంద్రబాబు చిల్లర రాజకీయాలు చేస్తే సమాధానం తీవ్రంగా ఉంటుందని, కులాల మధ్య చిచ్చు పెట్టిన చంద్రబాబు చరిత్ర ఏంటో రెండు రాష్ట్రాల్లోని ప్రజలకు తెలుసునని అన్నారు. మాల, మాదిగలకు, బీసీలకు, కాపులకు గొడవ పెట్టింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించిన తలసాని టిఆర్‌ఎస్ గురించి మాట్లాడడం దారుణమన్నారు. 'ఈ బాబు మాకొద్దు' అనే నినాదంతో త్వరలో తమ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తుందని, చంద్రబాబు నాటకాలన్నింటినీ ప్రజల్లో బహిర్గతం చేస్తామని తలసాని హెచ్చరించారు. చంద్రబాబును చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని, ఆయన గత చరిత్రను తడిమిచూస్తే ఎన్నిసార్లు ఏయే అంశాలపై ఎలా మాట తప్పారో, మాట మార్చాలో ప్రజలకు అర్థమవుతుందని అన్నారు. తాను ఏపీలో పర్యటించినప్పుడు ఆ రాష్ట్ర ప్రజల నుంచి ఈ తరహా స్పందన లభిస్తే ఇక తమ పార్టీ అధినేత కెసిఆర్ వెళ్తే ఏ రేంజ్‌లో ఉంటుందో ఊహించుకోవచ్చునని తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు.

ఒంటేరు చేరిక వట్టిదే : ఎంపి ప్రభాకర్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : వంటేరు ప్రతాప్‌రెడ్డి టిఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్న వార్తలను ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఖండించారు. ఇదంతా వట్టిదేనని కొట్టిపారేశారు. ఈ మేరకు గురువారం సాయం త్రం ఆయన ప్రత్యేకంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి స్పష్టంగా చెప్పారు. వంటేరు టిఆర్‌ఎస్‌లోకి రావడం లేదన్నారు. వస్తానని ప్రార్థించినా... పార్టీలో చేర్చుకునేది లేదని వ్యాఖ్యానించారు. ఇటీవల అసెంబ్లీ వంటేరు ఘోరంగా ఓడిపోయారని అన్నారు. ఈ ఓటమితో ఆయన రాజకీయ సమాధి అయ్యారన్నారు. పంచాయతీ ఎన్నికల్లో తన అనుచరులను గెలిపించుకోవాలన్న ఉద్దేశంతోనే ప్రజలకు తప్పుదారి పట్టించేందుకు వంటేరు కొత్త రాజకీయ డ్రామాకు తెరతీశారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తికి టిఆర్‌ఎస్‌లో చోటుండదని ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యానించడం విశేషం.

ఎన్నికలప్పుడే రాజకీయాలు... మిగతా రోజులన్నీ అభివృద్ధికే

అధికార, విపక్ష నేతలతో సిఎం కెసిఆర్ సహ పంక్తి భోజనం

శాసనమండలి భవనాల సముదాయం పరిశీలన



మనతెలంగాణ/హైదరాబాద్: వివిధ సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో నూతన విధానానికి తెరతీసింది. శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం అధికార, విపక్షాల సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి కెసిఆర్ సహపంక్తి భోజనం చేసి అందరితో కలుపుకోలుగా ముచ్చటించడం విశేషం. ఎన్నికలప్పుడే రాజకీయాలు, మిగతా రోజులన్నీ అభివృద్ధి కోసమేననే సిఎం కెసిఆర్ శాసనసభ్యులందరితో కలిసి భోజనంచేయడంతోపాటు రాష్ట్రాభివృద్ధి కోసం అందరం శ్రమిద్దామంటూ వారిలో ఉత్తేజం నింపారు. బుధవారం శాసనసభలో సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం సిఎం. కెసిఆర్ శాసనసభ్యులు, ఎంఎల్‌సిలకు జూబ్లీహాల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఎంఎల్‌ఏలతో పాటు శాసన మండలి సభ్యులను భోజనానికి సిఎం కెసిఆర్ ఆహ్వానించారు. శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్‌తో పాటు మండలి సభ్యులు, ఎంఎల్‌ఏలు పాల్గొన్నారు. గతంలో సమైక్య రాష్ట్రం పాలనలో బడ్జెట్ సమావేశాల అనంతరం స్పీకర్ శాసన సభ్యులకు విందు ఇచ్చే సాంప్రదాయం అమల్లో ఉండేది. అయితే శాసన సభ్యులు ప్రమాణం చేసిన అనంతరం అధికార, విపక్షాలతో కలిసి భోజనం చేసే ప్రక్రియకు సిఎం కెసిఆర్ శ్రీకారం చుట్టడంతో పలువురు సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం శాసన మండలి భవనాల సముదాయాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ పరిశీలించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసన మండలి భవనాలను తెలంగాణకు అప్పగించడంతో సిఎం కెసిఆర్ భవనాలను పరిశీలించారు. పరిపాలనా సౌలభ్యం కోసం నిజాంరాజులు నిర్మించిన జూబ్లీ హాల్ ఇక నుంచి అధికారుల సమావేశాలకే వినియోగించాలని సిఎం ఆదేశించారు. సమావేశాలకు అనువుగా సౌకర్యాలను మరింత మెరుగు పర్చాలని సూచించారు.



ఒరిస్సాలోనూ కంటివెలుగు

'సునేత్ర'గా నామకరణం • అందరికీ ఉచిత కంటి వైద్యం



మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రజా అవసరాలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పుడు అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయి. రాష్ట్రంలో పకడ్బందీగా అమలవుతున్న 'కంటివెలుగు' పథకాన్ని ఒడిశా రాష్ట్రం 'సునేత్ర' పేరుతో ప్రారంభిస్తోంది. ఇందుకోసం రానున్న ఐదేళ్ళ కాలానికి రూ.680 కోట్లను ఖర్చు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వెల్లడించారు. దృష్టి దోష సమస్యలు ఉన్న రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగానే కంటి వైద్య పరీక్షలు, చికిత్సలు రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని తెలిపారు. సామాన్య ప్రజలకు మాత్రమే కాక ప్రభుత్వ వైద్య బృందాలే అన్ని పాఠశాలలకూ వెళ్ళి విద్యర్థులకు కూడా కంటి పరీక్షలు నిర్వహిస్తుందని, దృష్టిదోష సమస్యలు ఉన్నవారందరికీ ఉచితంగా కళ్ళద్దాలను అందజేస్తుందని, అవసరమైతే ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు కూడా చేయిస్తుందని ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి పి.కె. మెహెర్డా వ్యాఖ్యానించారు. పథకం కింద కంటి వైద్య పరీక్షలు చేయించుకోడానికి ఎలాంటి ఆర్థిక ఆంక్షలు లేవని, ఏ ఆర్థిక స్థాయిలో ఉన్నవారైనా చేయించుకోవచ్చునని తెలిపారు. ఐదేళ్ళ కాలంలో దృష్టి సంబంధ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వివరించారు. 2023వ సంవత్సరం కల్లా 'యూనివర్శల్ ఐ హెల్త్‌కేర్' లక్ష్యానికి అనుగుణంగా ఇప్పుడు 'సునేత్ర' అనే పేరుతో ఈ పథకానికి రూపకల్పన చేసినట్లు ఆయన వివరించారు. వయసుతో సంబంధం లేకుండా అమలయ్యే ఈ పథకంలో కాటరాక్ట్ సమస్యలకు సైతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించుకునే వీలు ఉంటుందని ఆరోగ్యశాఖ కార్యదర్శి మెహెర్డా పేర్కొన్నారు. ఇకపైన ప్రతీ ఏటా అన్ని పాఠశాలల్లో ఉచిత కంటివైద్య శిబిరాలను నిర్వహించి విద్యార్థుల్లో దృష్టి దోష సమస్యలపై ప్రభుత్వం తదనుగుణమైన కార్యాచరణ చేపడుతుందని వివరించారు. ఐదేళ్ళ కాలంలో రూ. 680 కోట్లను ఈ పథకం కింద ప్రభుత్వం ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.


కొలీజియం వివాదాస్పద నిర్ణయం!

సంపాదకీయం

దేశ అత్యున్నత న్యాయ వ్యవస్థ మరొక్కసారి వివాదంలో చిక్కుకున్నది. సుప్రీంకోర్టు ముందుకు వచ్చే ప్రధానమైన కేసులను తమను విస్మరించి జూనియర్ జడ్జీలతో కూడిన ధర్మాసనాలకు కేటాయించడాన్ని నిరసిస్తూ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తుల బృందం బహిరంగంగా గళం విప్పిన వివాదం గతంలో సంచలనం రేపింది. ఇప్పుడు హైకోర్టుల చీఫ్ జస్టిస్‌లు, జడ్జీల నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించే క్రమంలో సీనియారిటీని ఉల్లంఘిస్తున్నారనే వివాదం తల ఎత్తింది. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దినేశ్ మహేశ్వరిని ఢిల్లీ హైకోర్టు జడ్జి సంజీవ్ ఖన్నాను సుప్రీంకోర్టు జస్టిస్‌లుగా నియామకానికి సిఫారసు చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ సారథ్యంలోని కొలీజియం తీసుకున్న తాజా నిర్ణయాన్ని కొందరు ప్రస్తుత, విశ్రాంత జడ్జీలు తప్పుపట్టారు. రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రదీప్ నందరాజోగ్‌ను, ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్ రాజేంద్ర మీనన్‌ను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియామకానికి సిఫారసు చేయాలని గత నెల 12 తేదీన తాను తీసుకున్న తొలి నిర్ణయాన్ని తానే రద్దు చేస్తూ కొలీజియం తాజా నిర్ధారణకు వచ్చింది. ఇలా రావడంలో ముఖ్యంగా సంజీవ్ ఖన్నా విషయంలో 32 మంది న్యాయమూర్తుల సీనియారిటీని కొలీజియం పక్కన పెట్టడం ఆశ్చర్యానికి గురి చేసింది. అభ్యంతరాలకు తావు కల్పించింది. సుప్రీంకోర్టు జడ్జీలుగా నియామకానికి అర్హులను కొలీజియం సిఫారసు చేయడం కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం సాధారణంగా జరుగుతున్నది. ఇందులో సీనియారిటీకే అగ్ర తాంబూలం దక్కుతున్నది. సంజీవ్ ఖన్నా విషయంలో కొలీజియం ఈ సంప్రదాయానికి స్వస్తి చెప్పింది. అంతేగాక సంజీవ్ ఖన్నా, దినేశ్ మహేశ్వరి లిద్దరూ ఇతరులెవ్వరికంటే అర్హులని, యోగ్యులని నిర్ధారణకు వచ్చినందునే తన తొలి నిర్ణయాన్ని మార్చుకోకతప్పలేదని కొలీజియం సంబంధిత రికార్డులలో పేర్కొన్నట్టు వార్తలు చెబుతున్నాయి. కొలీజియం ఇలా నిర్ణయం మార్చుకోవడం, సీనియారిటీ క్రమాన్ని తప్పించి సిఫారసు చేయడం హైకోర్టుల్లోని జస్టిస్‌లు, చీఫ్ జస్టిస్‌లందరి మనోభావాల మీద వ్యతిరేక ప్రభావం చూపుతుందని ఆ మేరకు వారి పని నాణ్యతను అది దెబ్బతీసే ప్రమాదం కూడా ఉంటుందని ప్రత్యేకించి చెప్పుకోనక్కర లేదు. యోగ్యతాయోగ్యతలు, అర్హతానర్హతలను నిర్ణయించడానికి ప్రత్యేకించి కొలబద్దలంటూ ఉండవు. నిర్ణయించే వారి వ్యక్తిగత ఇష్టానిష్టాలు ప్రభావం చూపే ప్రమాదమున్నది. లేదా అధికారం గుప్పెట్లో ఉన్నవారి ఒత్తిడుల మేరకు నిర్ణయాలు తీసుకునే తప్పుడు పద్ధతికి అవకాశం ఏర్పడే వీలున్నది. అందుకే సీనియారిటీ జాబితాను బట్టి నడుచుకునే ప్రక్రియను ఆశ్రయించడమే ఉన్నంతలో మేలైన పద్ధతి. సీనియారిటీ జాబితాలో 32 వస్థానంలో ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నాను ఉన్నపళంగా ఇంత లాంగ్ జంప్ చేయించి సుప్రీంకోర్టు జడ్జిగా నియామకానికి సిఫారసు చేసి ఉండవలసింది కాదనే అభిప్రాయానికి విలువ ఏర్పడుతున్నది. జస్టిస్ సంజీవ్ ఖన్నా తాత సుప్రసిద్ధ న్యాయమూర్తి హెచ్‌ఆర్ ఖన్నా సీనియారిటీని ఎమెర్జెన్సీ హయాంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం తృణీకరించి ఎఎన్ రేని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా చేసిన ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది.

సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కృష్ణ కౌల్, ఢిల్లీ హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ కైలాస్ గంభీర్‌లు కొలీజియంను బహిరంగంగానే తప్పుపట్టారు. సీనియారిటీ సూత్రానికి విరుద్ధంగా జూనియర్‌కు సుప్రీంకోర్టు జడ్జి పదవి కట్టబెట్టడం దేశంలోని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, జడ్జీల మేధస్సు, యోగ్యత, శీల సమగ్రతల మీద అనుమానాలను రేకెత్తించడమేనని జస్టిస్ గంభీర్ రాష్ట్రపతికి రాసిన లేఖలో పేర్కొన్నారు. కొలీజియం చేసిన గత సిఫార్సులతో విభేదించి జస్టిస్ కెఎం జోసెఫ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి కాకుండా ఏడాది పాటు అడ్డుకున్న కేంద్ర ప్రభుత్వం ఈసారి హుటాహుటిన ఆమోద ముద్ర వేయడం కూడా ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేసిన జోసెఫ్ మీద కేంద్రం కక్ష గట్టిందనే అభిప్రాయం కూడా అప్పట్లో వెలువడింది. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకం జరిగేటప్పుడు సంబంధితులందరితోను రాష్ట్రపతి సంప్రదింపులు జరపాలని రాజ్యాంగం సూచిస్తున్నది. అలాగే కొలీజియం పెద్దగా దేశ ప్రధాన న్యాయమూర్తి ఈ సంప్రదింపుల సూత్రాన్ని గౌరవించి నడుచుకోవాలి. న్యాయమూర్తుల నియామకంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఇష్టా విలాసం చెల్లకూడదనే దృష్టితోనే కొలీజియం వ్యవస్థకు ప్రాణం పోశారు. దాని నిర్ణయాలు కూడా విమర్శలకు అతీతం కాకపోవడం ఎంతైనా బాధపడవలసిన పరిణామం.

ఈనాటి అంబేడ్కర్, లోహియా!



లక్నోలో అఖిలేష్ యాదవ్, మాయావతి కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతున్నప్పుడు, సమాజవాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ పొత్తు గురించి చెబుతున్నప్పుడు వారి వెనుక ఉన్న బ్యానర్‌పై ఉన్న చిత్రాలు అంతకన్నా ఎక్కువ చెప్పాయి. భారతదేశంలో దళితుల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన అంబేద్కర్, సోషలిస్టు, కుల వ్యవస్థ వ్యతిరేకి రామ్ మనోహర్ లోహియాలు అసంపూర్ణంగా విడిచిపెట్టిన ఎజెండా ఇప్పుడు అఖిలేష్, మాయావతి స్నేహం వల్ల పూర్తవుతుందా, సమాజవాదీ పార్టీ, బహుజనసమాజ్ పార్టీ కలిసి ఆ ఎజెండాను పూర్తి చేస్తాయా?

కుల వ్యతిరేక, సోషలిస్టు కూటమి దేశంలో బలమైన ప్రత్యామ్నాయంగా ఉనికిలోకి వచ్చే అవకాశాలు ఇప్పుడు ఉన్నాయా? సమాజవాదీ పార్టీ, బహుజనసమాజ్ పార్టీ అధినేతల మీడియా సమావేశంతో కొత్త ఆశలకు ప్రాణం పోసినట్లయ్యింది. 2019 సార్వత్రిక ఎన్నికలకు రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తున్నట్లు ఇద్దరు నాయకులు ప్రకటించారు. సీట్ల సర్దుబాటు విషయంలో ఎలాంటి విభేదాలు, వివాదాలు లేవు. వారిద్దరు మీడియా సమావేశంలో రిపోర్టర్ల ప్రశ్నలకు జవాబిస్తున్నప్పుడు వారి వెనుక బ్యానర్‌పై ఒకవైపు బహుజనసమాజ్ పార్టీ ఎన్నికల చిహ్నం పక్కన అంబేద్కర్ చిత్రం ఉంది, మరో వైపు సమాజవాదీ పార్టీ ఎన్నికల చిహ్నం పక్కన లోహియా చిత్రం ఉంది. జై భీమ్, జై సమాజ్ వాదీ అనే నినాదాలు దానిపై ఉన్నాయి. అంబేద్కర్ వారసత్వాన్ని ప్రకటించుకున్న పార్టీ బహుజనసమాజ్ పార్టీ. లోహియా వారసత్వాన్ని ప్రకటించుకున్న పార్టీ సమాజవాదీ పార్టీ. గత పాతిక సంవత్సరాలుగా ఈ రెండు పార్టీల మధ్య వైరమే తప్ప స్నేహం లేదు. ఇప్పుడు పాత వైరాన్ని పక్కన పెట్టి రెండు పార్టీలు ఒక్కటయ్యాయి.



భారత రాజకీయాల్లో అంబేద్కర్, లోహియా ఇద్దరు రాజకీయ నేతలు మాత్రమే కాదు, మేధావులు. విచిత్రమేమంటే వారిద్దరూ ఎన్నడూ కలుసుకోలేదు. అంబేద్కర్ గురించి లోహియాకు తెలుసు, లోహియా గురించి అంబేద్కర్‌కు తెలుసు. అంబేద్కర్ ఉద్యమం గురించి లోహియాకు తెలుసు. లోహియా కార్యక్రమాల గురించి అంబేద్కర్‌కు తెలుసు. ఒకరిపై మరొకరికి చాలా గౌరవం ఉండేది. ఒకరి సిద్ధాంతాలను మరొకరు గౌరవించేవారు. కాని వారిద్దరు కలుసుకున్న సందర్భం ఏదీ రాలేదు. ఈ ఇద్దరు ప్రముఖ నేతల సిద్ధాంతాలు, భావాల మధ్య ఐక్యతకు ప్రయత్నాలు 1955లో ప్రారంభమయ్యాయి. వారిద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. వారిద్దరు కలవాలనుకున్నారు. కాని దురదృష్టవశాత్తు అంతకన్నా ముందే అంబేద్కర్ మరణించారు.

వారిద్దరు కలిసి పనిచేస్తే రాజకీయాలపై ఎలాంటి ప్రభావం ఉండేదో ఇప్పుడు చెప్పలేం. కాని ఈ ఇద్దరు నాయకుల మధ్య చాలా పోలికలున్నాయి. వారిద్దరు పాశ్చాత్య విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నారు. లోహియా ఆర్థిక శాస్త్రంలో పిహెచ్‌డి చేయడానికి జర్మనీలోని హంబోల్ యూనివర్శిటీకి వెళ్ళారు. అంబేద్కర్ ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ.లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో చేశారు. ఆర్థికశాస్త్రంలో పిహెచ్‌డి కొలంబియా విశ్వవిద్యాలయంలో చేశారు. ఉదారవాద ప్రజాస్వామిక సంప్రదాయాల్లో ఇద్దరూ శిక్షణ పొందారు. స్వేచ్ఛ, సమానత్వాల పట్ల ఇద్దరికీ గొప్ప అంకిత భావం ఉండేది. లోహియా, అంబేద్కర్ ఇద్దరు ఆధునిక భావాలు కలిగిన వారు. సాంప్రదాయిక భారతీయ సమాజ వ్యవస్థను, వర్ణ వ్యవస్థను, కుల వ్యవస్థను తీవ్రంగా విమర్శించేవారు. ఈ విషయంలో ఈ ఇద్దరు నాయకులకు గాంధీజీకి మధ్య చాలా తేడా ఉంది. గాంధీజీ ఊహల్లోని ఆదర్శం రామ రాజ్యం, గ్రామ స్వరాజ్యం. కాని ఈ ఇద్దరు నేతలు ఆధునిక ఆలోచనాపరులు. ప్రాచీన కాలంలో ఉండేదని చెప్పబడే స్వర్ణ యుగంలోకి వెనక్కి పోవడాన్ని వీళ్ళు ఇష్టపడలేదు. దేశంలో ఆధునిక ప్రజాస్వామ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నించారు.

లోహియా కేవలం ఒకే ఒక్కసారి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. అంబేద్కర్ పార్లమెంటు ఎన్నికల్లో గెలవలేదు. వారిద్దరి రాజకీయ పార్టీల విజయాలు కూడా ఈ పరిమితిలోనే ఉన్నాయి. ఈ ఇద్దరు నాయకులు అధికారాన్ని అందుకోలేకపోయారు. అంబేద్కర్, లోహియా ఇద్దరు కూడా పెద్ద జన సముదాయాలను ప్రభావితం చేశారు. వారి రాజకీయ బలం కన్నా సైద్ధాంతికంగా, తాత్వికంగా వారి ప్రభావం చాలా ఎక్కువ. వారి మరణానంతరం వారి ప్రభావం మరింత పెరిగింది. వారి రచనల్లో ఎంత ఎక్కువగా తమ సిద్ధాంతాల గురించి రాశారో చూస్తే ఆశ్చర్యమనిపిస్తుంది. ఇద్దరు నేతలు కూడా గొప్ప వక్తలు.

అంబేద్కర్, లోహియా ఇద్దరు కూడా జాతి నిర్మాతలు. కులాన్ని ఒక సమస్యగా గుర్తించారు. ఈ సమస్యను పరిష్కరించడం అవసరమని చాటి చెప్పారు. కులానికి వ్యతిరేకంగా పోరాడారు. సామాజికంగాను, ఆర్థికంగాను కుల నిర్మూలన గురించి నొక్కి చెప్పారు. అంబేద్కర్ వర్గం గురించి ఆర్థిక అసమానతల గురించి కొంత మాట్లాడినప్పటికీ ముఖ్యంగా ఆయన కుల వ్యవస్థపైనే పోరాడారు. రాజ్యాంగ సభలో ముగింపు ప్రసంగం చేస్తూ, సామాజికంగా, ఆర్థికంగా సమానత్వం లేనట్లయితే దేశంలో ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవడం కష్టమని అన్నారు. ఈ విషయంలో లోహియా, అంబేద్కర్ ఇద్దరి ఆలోచనలు ఒక్కటే. అలాగే పురుషాధిక్యత విషయంలోను వారి ఆలోచనలు ఒక్కటే. మతానికి, కులానికి మధ్య సంబంధం విషయంలో వీరిద్దరి ఆలోచనల్లో కొంత తేడా కనిపిస్తుంది. ఇద్దరు నేతలు వేర్వేరు కుల సముదాయాలకు చెందినవారు కావడం దానికి కారణం కావచ్చు.

అంబేద్కర్ నిమ్న కులానికి చెందినవారు. అందువల్ల కుల వ్యవస్థ దారుణాల చేదు అనుభవాలు ఆయనకు చాలా ఉన్నాయి. ఆయన దృష్టిలో హిందూ మత గ్రంథాలే కులానికి పునాదులు. అందుకే ఆయన బహిరంగంగా మనుస్మృతిని తగలబెట్టారు. లోహియా కూడా కుల నిర్మూలన గురించే చెప్పారు. కాని ఆయన దృష్టిలో కులానికి మతం కారణం కాదు. ఆయన ఎన్నడూ హిందూ మతానికి వ్యతిరేకంగా మాట్లాడలేదు. కాని అంబేద్కర్ 1936లోనే తాను హిందువుగా మరణించేది లేదని అన్నారు. 1956లో ఆయన హిందూ మతం వదిలి బౌద్ధం స్వీకరించారు. లోహియా సంఘ సంస్కర్తగా పని చేశారు. ప్రజల్లో చైతన్యం కలుగజేయడానికి రామాయణ మేళాలు కూడా నిర్వహించేవారు. 1956లో లోహియా, అంబేద్కర్ ఇద్దరు కలిసి పని చేస్తారనిపించింది. అంబేద్కర్ కన్నా లోహియా దాదాపు ఇరవై సంవత్సరాలు చిన్నవారు. ఏడాది క్రితం వరకు రాజకీయ శత్రువులుగా ఉన్న అఖిలేష్ యాదవ్, మాయావతి ఇప్పుడు చేతులు కలిపారు. ఉమ్మడి శత్రువును ఓడించడానికి ఒక్కటయ్యారు. ఈ ఇద్దరు నాయకులు కలిసి లోహియా, అంబేద్కర్‌లు అసంపూర్ణంగా వదిలేసిన ఎజెండా పూర్తి చేసే అవకాశం చరిత్ర వారికిచ్చింది.

* దిలీప్ మండల్ (ది ప్రింట్)

చిరు ధాన్యాలు తిరిగి తెరపైకి



డా॥ సిహెచ్ బాబావలిరావు
9989792247

చరిత్ర పునరావృతం అవుతుంది. జరిగిందే జరుగుతుంది. కొద్ది మార్పు లుండవచ్చు. పూర్తిగా కొత్తది ఎక్కడా ఉండదు. పాత కొత్త అవుతుంది. అదే కొత్త పాత అవుతుంది. మెట్ట పల్లం, పల్లం మెట్ట, ఓడలు బండ్లు, బండ్లు ఓడలు, ప్రాముఖ్యం అప్రాముఖ్యం, అప్రాముఖ్యం ప్రాము ఖ్యం అవుతుండాయి. మార్పు కాలధర్మం, ప్రకృతి ధర్మం, క్రింది మీదు మీదు క్రిందౌచు భ్రమియించు.

''బండి కమ్మెబోలె పరగు జగతి'' అన్నాడో కవి పుంగవుడు. ఈ అనంతకాల గమనంలో ఈ చర్విత చర్వణం ఎన్ని సార్లు జరిగిందో ఎవ్వరికెరుక! మానవుల ఆహార విహారాలు ఇందుకు వెలిగావు. పూర్వం నదుల మీద ఆనకట్టలు లేవు. పెద్దపెద్ద డ్యాంలు లేవు. నీరంతా యధేచ్ఛగా సముద్రంలోకి వెళ్లేది. పంటలు వర్షాధారంగానే పండేవి. కాలుష్యంలేని కాలం కాబట్టి వర్షాలు బాగానే కురిసేవి. దాంతో సాగు అంతా మెట్ట భూమిలోనే. ఎక్కడన్నా చెరువుల కింద పల్లం భూముల్లో మాగాణిలో వరి లాంటి పంటలు పండేవి. ఇవన్నీ దేవమాతృకలు. వర్షాధారంగా పండే నేలలని అర్థం. మెట్టలో కొర్రలు, రాగులు, మొక్క జొన్నలు, పచ్చ జొన్నలు, ఒరిగలు, సామలు, ఊదలు మొదలైన చిరు ధాన్యాలు పండేవి. జనం అవే తినేవాళ్లు. ఎప్పుడన్నా పండగల సందర్భంలో వరి అన్నం తినేవారు. దాన్నే 'స్వామి అన్నం', 'సామి బువ్వ' అనే వాళ్లు. అపురూపంగా భావించేవాళ్లు.

నెమ్మదిగా నదుల మీద ఆనకట్టలు ఏర్పడ్డాయి. నీరు నిల్వ చేసి కాలువల ద్వారా పొలాలకు మళ్లించి పంటలు పండించడం మొదలైంది. మెట్టల మాగాణిగా మారాయి. దాంతో భూములు నదీ మాతృకలయ్యాయి. నదీ జలాలు ఆధారంగా పండే భూములని అర్థం. దీంతో అధిక జలం అవసరమయ్యే పంటల సాగు పెరిగింది. వరి పంట అధికమయ్యింది. వరిలో ఎన్నో రకాలు అభివృద్ధి చెందాయి. ఆరు నెలలు కాల వ్యవధి నుంచి మూడు నెలలలోనే కోతకు వచ్చే వంగడాలు వచ్చాయి. పొడుగ్గా ఎదగకుండా పొట్టిగానే ఉండే పైర్లు వచ్చాయి. దిగుబడి ఎంతగానో పెరిగింది. ఇందుకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు దోహదపడ్డాయి. సాగు భూమి కూడా ఎంతగానో పెరుగుతూ వచ్చింది. జనాభా పెరుగుదలతో సమానంగా ఉత్పత్తి పెరిగింది.

నెమ్మదిగా మెట్ట పంటలైన చిరు ధాన్యాలు తినడం వెనుక బడింది. పంటలూ వేయడం తగ్గింది. వరి ధాన్యం తినడం గౌరవం అయ్యింది. స్థాయిగా నిలిచింది. నాగరికమైంది. ఎవరో బడుగు బలహీన వర్గాలు మాత్రమే చిరు ధాన్యాలు తింటారనే భావన పెరిగింది. దాంతో వాళ్లూ తినడం మానారు. జొన్న కూటి వారు తక్కువ, వరి కూటి వారు ఎక్కువ అనే అభిప్రాయం బలపడింది. దాంతో అందరూ వరికే ఎగబడ్డారు. మాది (ఈ వ్యాస కర్తది) గుంటూరు జిల్లా రేపల్లె పట్టణం. మా నాన్న గారు, తాత గారు కూడా జొన్నన్నం తినలేదు.

మా తాతగారి కాలానికే మాకు కృష్ణానది నీరు వచ్చి మా భూములు మాగాణిగా మారాయి. నాకిప్పుడు 65 సంవత్సరాలు. మా నాన్నగారికి నేను ఆలస్యంగా పుట్టాను. 50–55 సంవత్సరాల మధ్య వయసులో. లెక్క ప్రకారం మా నాన్న గారికి ఇప్పుడు 120 సంవత్సరాల వయసు ఉంటుంది. వారి నాన్న గారికి 150 సంవత్సరాలకు తక్కువ కాదు. కాగా నూట ఏభై సంవత్సరాల నాడే మా ప్రాంతంలో పుష్కలంగా వరి పండింది. ఇట్లే గుంటూరు, కృష్ణా జిల్లాలు, ఉభయ గోదావరులలోని సాగర తీరం, డెల్టా ప్రాంతమంతా మాగాణిగా ఆనాడే మారిపోయింది. ధవళేశ్వరం ఆనకట్ట, బెజవాడ ఆనకట్టల పుణ్యం అది. అయితే రాయల సీమలోను, ఉత్తరాంధ్రలోనూ, తెలంగాణలోనూ స్వాతంత్ర్యానికి ముందు వరకు చిరు ధాన్యాల్ని ఎక్కువగానే వాడారు. నెమ్మదిగా అక్కడా వరి పండడంతో, అది గొప్పగా భావించడంతో ఇరవై ముప్ఫై ఏళ్ల నుంచి అక్కడా చాలా వరకు తగ్గింది. ఇటీవల అయితే పూర్తిగా లేదనే చెప్పాలి.

నాకు తెలిసి మేము 1964 సం॥ వరకు దంపుడు బియ్యం తిన్నాం. అప్పటి వరకు గ్రామంలో ఉన్నాం. అప్పటికి మా ఊళ్లో పది కుటుంబాల వాళ్లు మాత్రమే దంపుడు బియ్యం తింటున్నారు. మిగిలిన వాళ్లంతా మర ఆడించిన బియ్యమే తినేవాళ్లు. మాది చాదస్తంగా కన్పించేది వాళ్లకు. క్రమంగా అందరూ మర బియ్యానికే అలవాటు పడ్డారు. అదీ విపరీతంగా పాలీషు చేసిన బియ్యాన్నే తింటున్నారు. మూడు సార్లు మరబట్టితేగాని అంత తెలుపు రాదు. పాలు కూడా సిగ్గుపడుతున్నాయి ఆ బియ్యాన్ని చూచి. దాంతో తవుడు మొత్తం పోయి, 'బి' విటమిన్, పీచు పదార్థం నశించి పిండి పదార్థం మిగిలి ఆరోగ్యానికి హాని కలుగుతున్నది. అందులోనూ కొంచెం మొద్దుగా ఉన్నవి పనికి రావు. సన్నగా, జీరకర్రలా ఉండాలి. బలమైన నేలలో పండేవి కొద్దిగా లావుగా ఉంటాయి. బలహీనమైన చవిటి నేలల్లో పండేవి సన్నగా ఉంటాయి. అందులో బలం ఏ మాత్రం ఉండదు. త్వరగా అరిగిపోయి అపకార్యం చేస్తున్నాయి.

విపరీతంగా పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడడం వల్ల వరి ధాన్యం విషతుల్యంగా మారింది. నారు పోసే ముందు నుంచి చేసే విత్తన శుద్ధి దగ్గర నుంచి ఈనే దాకా కొట్టే పురుగు మందులు, నారుమడి నుంచి ఈనే వరకూ వేసే రసాయనిక ఎరువులు ఎంతో చెరుపు చేస్తున్నాయి. అంతా కృత్రిమమే. సేంద్రియ ఎరువుల వాడకం తగ్గిపోయింది. పశువుల పెంపకమే లేదు. పేడ, నీరుడుతో కలిసిన ఎరువు ఎక్కడ నుంచి వస్తుంది? వేసవిలో పశువుల్ని పొలాల్లో కట్టివేసే వాళ్లు. పేడతో పాటు మూత్రం కూడా భూమిని సారవంతం చేస్తుంది. గొర్రెల, మేకల మంద కట్టించే వాళ్లు. పంది ఎరువు వాడేవాళ్లు. ఆముదపు పిండి, వేప పిండి, వేరు సెనగ పిండి వేసేవాళ్లు. ఇవన్నీ కరుమరుగై యూరియా, సూపర్ మొదలైన రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడుతున్నారు. ధాన్యమే కాదు. కూరగాయలు అంతే. పండ్లూ అంతే. పెరగడానికీ మందే. పండడానికీ మందే. రేపు తినడానికీ మందే వాడవలసి వస్తుంది. వరితోపాటు గోధుమలు కూడా ప్రమాదకరమేనని శాస్త్రవేత్తలు, డాక్టర్లు చెబుతున్నారు.

> నారు పోసే ముందు నుంచి చేసే విత్తన శుద్ధి దగ్గర నుంచి ఈనే దాకా కొట్టే పురుగు మందులు, నారుమడి నుంచి ఈనే వరకూ వేసే రసాయనిక ఎరువులు ఎంతో చెరుపు చేస్తున్నాయి. అంతా కృత్రిమమే. సేంద్రియ ఎరువుల వాడకం తగ్గిపోయింది. పశువుల పెంపకమే లేదు. పేడ, నీరుడుతో కలిసిన ఎరువు ఎక్కడ నుంచి వస్తుంది? వేసవిలో పశువుల్ని పొలాల్లో కట్టివేసే వాళ్లు. పేడతో పాటు మూత్రం కూడా భూమిని సారవంతం చేస్తుంది. గొర్రెల, మేకల మంద కట్టించే వాళ్లు. పంది ఎరువు వాడేవాళ్లు. ఆముదపు పిండి, వేప పిండి, వేరు సెనగ పిండి వేసేవాళ్లు. ఇవన్నీ కరుమరుగై యూరియా, సూపర్ మొదలైన రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడుతున్నారు. ధాన్యమే కాదు. కూరగాయలు అంతే. .



ముంచుకు వస్తున్న విపత్తును ఎట్టకేలకు ప్రజలు, ప్రభుత్వాలు గుర్తించడం అదృష్టం. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఎరువుల కంపెనీలు సేంద్రియ ఎరువుల్ని మాత్రమే తయారు చేసి విక్రయించేంతగా సేంద్రియ వ్యవసాయం అభివృద్ధి చెందాలి. కొంతకు కొంత దిగుబడి తగ్గుతుంది. దాంతో ధర పెరుగుతుంది. మామూలు బియ్యం కన్నా ఆర్గానిక్ బియ్యం ధర ఎక్కువే. కూరలు అంతే. అయినా ఆరోగ్యమే కదా! అనారోగ్యంపాలై మందులకు ధనం పోసే కన్నా, ఆరోగ్యం కుదుటబడక చనిపోయే కన్నా ప్రియమైన ఆరోగ్యకరమైన ఆహారం తినడం మంచిది కదా! ఆ ఉద్దేశంతోనే కరుమరుగైన చిరు ధాన్యాలు మరల తెర మీదకు వస్తున్నాయి. వాటిల్లో పోషకాలు ఎక్కువట. ప్రోటీన్లు, ఐరన్ ఎక్కువట. పీచు పదార్థం అధికమట! దాంతో చెక్కర వంటి వ్యాధులకు విరుగుడైన మంచి ఆహారమట దాంతో ముందుగా ఉన్నత వర్గాలే చిరుధాన్యాల్ని తింటున్నారు. మధ్య తరగతి వారు అలవాటు పడుతున్నారు. నెమ్మదిగా వీటికి పూర్వ వైభవం వస్తుంది. జనానికి ఆరోగ్యం సిద్ధిస్తుంది. వీటి సాగుకు అంతగా నీరు అవసరముండదు. వర్షాధారంగా మెట్టలో పండుతాయి. నెమ్మదిగా మాగాణిలోనూ పండిస్తారు. నాలుగైదు ఏళ్ల నుంచి వర్షాలు తగ్గి సాగర్ కుడి కాల్వ క్రింద పల్నాడులోనూ, సత్తెనపల్లి ప్రాంతంలోనూ వరి నాట్లే పడడం లేదు. అలాంటి మాగాణి ఇందుకు బాగా ఉపయోగం. ఎరువులు కూడా అంతగా అవసరం లేదు. నీటి వాడకం తక్కువ కాబట్టి రసాయనిక ఎరువుల వాడకం కుదరదు. పూర్తిగా సేంద్రీయమైన సాగు చేయడమే మంచిది. చీడపీడల బాధ కూడా తక్కువే.

నీటికై రాష్ట్రాలు, ప్రభుత్వాలు తగాదాలు పడుతున్నాయి. యుద్ధాలే జరగవచ్చని పెద్దల మాట. ఎక్కడ బడితే అక్కడ ప్రాజెక్టులు కట్టుతున్నారు. వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. నిజంగా పూర్వం మాదిరిగా చిరు ధాన్యాల వాడకం పూర్తిగా పెరిగి వాటి సాగు విపరీతంగా సాగితే ఇప్పుడు వేల కోట్లతో నిర్మించే ప్రాజెక్ట్‌ల అవసరం ఉండదు. అటువంటి కాలం త్వరగా వచ్చేలాగా కన్పిస్తున్నది. కొద్ది నెలలలోనే నీటి వాడకం పెరిగి ధరలు కూడా ఇరవై శాతం అధికమయ్యాయట! అంతేకాదు పర్యావరణ కాలుష్యం తగ్గక, వర్షాలు భారీగా కురవకున్నా ఈ కొత్త ప్రాజెక్టులు వృధాయే. కాలుష్య నియంత్రణ విషయంలో ప్రజలు, ప్రభుత్వం కన్నుగలిగి ఉండాలి.

పూర్వం రాజులు కాలంలో కూడా చెరువులు క్రింద, బావులు క్రింద పల్లపు భూముల్లో వరి పండేది. శాల్యోదనం అదే. ధనవంతులు మాత్రమే ఉపయోగించే వాళ్లు. శ్రీనాథ మహాకవి రాజనాల వరి అన్నం తినేవాడు. పలనాడు వెళ్లి జొన్నన్నం తినలేక బాధపడ్డాడు. ''జొన్న కలి, జొన్న అంబలి, జొన్నన్నము, జొనన పిసరు, జొన్నలు తప్పన్ సన్నన్నము సున్న సుమీ...'' అని పల్నాటి పల్లె సీమల పరిస్థితిని బొమ్మ కట్టించి తాను ఆ ఆహారం తినలేక పోయానని చెప్పాడు. శివుణ్ణి కూడా వదలలేదు. ''గరళ కంఠుణ్ణని గర్వపడుతున్నావు. ఈ జొన్న మెతుకులు తిను తెలుస్తుంది'' అన్నాడు. వర్షాభావంతో నీళ్లులేక పలనాడు కొట్టుమిట్టాడుతుంటే ''పార్వతి చాలు గంగను విడవమన్నాడు భిక్షగాడికి ఇద్దరు భార్యలెందుకని ఎగతాళి చేశాడు. ''నాగు లేటి నీళ్లు నాపరాళ్లేనట.'' ఇప్పుడైతే జొన్నన్నమే మేలని చెప్పేవాడే. వరి అన్నం విషంగా మారని రోజులవి. 15వ శతాబ్దం పూర్వ భాగం కదా!

ఇప్పుడు నాయకులు, ఇతర సంపన్నులు, ఉద్యోగులు ముందుగా తింటూ ముందుగా నడిస్తే మిగిలిన సామాన్య ప్రజ కూడా వారి వెంటే నడుస్తుంది. సాగు పెరిగితే ధరలు కూడా తగ్గుతాయి. అందరికీ అందుబాటులోకి వస్తాయి. రేషన్ షాపుల్లో కూడా అమ్మకానికి పెట్టే యోజనలో ప్రభుత్వాలున్నాయి. వరి బియ్యాన్ని తగ్గించి రేషన్లో ఈ చిరు ధాన్యాల్ని ప్రజలకు ఇవ్వాలి. పెద్దపెద్ద హోటళ్లలో కూడా ఈ వంటకాలు దొరుకుతున్నాయి. ఇక నుంచి జొన్న కూటి వారే ఎక్కువ. వరి కూటి వారే ఎక్కువ. ఇదే చర్విత చర్వణం.

ఈ పేజీకి రచనలు పంపవలసిన మెయిల్ :
editor@manatelangana.org

మన తెలంగాణ
5
హైదరాబాద్
శుక్రవారం
18 జనవరి, 2019
www.manatelangana.news

సకుటుంబం



నవ్వు...నవ్వించు



"నవ్వు...నవ్వించు..ఆనందంగా జీవించు" అనేది నేటి వైద్యులు చెబుతున్నమాట. నవ్వు ఒక టానిక్. చిరునవ్వుతో ప్రపంచాన్నే జయించవచ్చని మానసిక వేత్తలు అంటారు. మనిషి మోముపై నవ్వు ఒక ఆభరణంగా భావిస్తారు. ఎప్పుడూ నవ్వుతూ ఉన్న మనిషి అందరినీ ఆకర్షిస్తాడు.

నవ్వు ఒక వరం. ఇది ప్రకృతిలో మనిషి ఒక్కడికే లభించింది. దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నేటితరం అసలు నవ్వడం మర్చిపోతున్నారు. పనుల ఒత్తిడి, బిజీ లైఫ్ పేరుతో తీరికగా నవ్వే అవకాశం ఎక్కడుందని అంటున్నారు. అసలు నవ్వి ఎంతకాలం అయిందని ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకోవాలి. అప్పుడు స్ఫురిస్తుంది. తాము నవ్వి చాలాకాలం అయిందని.

తన విషయంలో నవ్వలేకపోయినా ఇతరుల విషయాలు స్ఫురణకు తెచ్చుకుని నవ్వవచ్చు. గాంభీర్యం ఇటీవల ప్రతిఒక్కరూ ప్రదర్శిస్తున్నారు. సీరియస్‌నెస్ ఎందుకు వస్తోందని ప్రశ్నించుకుంటే జీవనశైలి, పోటీతత్వం, సమస్యలు, లక్ష్యాల పరుగులో కొట్టుకుపోతున్న నేటి యువత అసలు నవ్వు అనేది మర్చిపోతున్నారు. సమస్యలు సహజం. వాటిని అధిగమించడం కష్టంతో కూడుకున్న విషయమే. కాని తమకున్న సహజలక్షణమైన నవ్వును మర్చిపోవడం వల్ల మరింత ఒత్తిడికి గురవుతున్నారు.

నవ్వులేకపోవడం కూడా అనారోగ్యమేనని మానసికవేత్తలు చెబుతున్నారు. నవ్వడం ఆరోగ్యానికి ఒక టానిక్‌లాగా పనిచేసింది. జీవితంలో ఆనందాన్ని పంచుతుంది. బాల్యంలో ఆటపాటలతో నవ్వుతూ తుళ్లుతూ గడుపుతారు. యవ్వనం వచ్చేసరికి ఆ నవ్వును మర్చిపోతారు. కౌమారంలో బాధ్యతలు, బంధాలతో నవ్వు తమ సహజ లక్షణమనేది గుర్తుండదు. అప్పుడు ఆరోగ్యంపై దీని ప్రభావం చూపుతుంది. నవ్వు మర్చిపోయిన వ్యక్తుల, జీవితాల్లో...ముఖ్యంగా నడివయసులో అనారోగ్యం వచ్చే అవకాశాలు హెచ్చని ఒక అంచనా.

స్కూలులో చదివే సమయంలో కేరింతలతో ఉన్న విద్యార్థులు కాలేజీ విద్యకు వచ్చేసరికి గాంభీర్యం నేర్చుకుంటున్నారు. నేటి కార్పొరేట్ యుగంలో ఆటపాటలు లేవు. కేవలం చదువు చదువు. ఒక విధంగా చెప్పాలంటే బాల్యంలో అనుభవించిన నవ్వు పోవడానికి కారణం తల్లిదండ్రులు, విద్యాసంస్థలు కారణమని కొంతమంది అభిప్రాయం. కార్యాలయాల్లోకి వెళ్లి చూస్తే ఎవరికి వారు సీరియస్‌గా పనిచేసుకోవడం కన్పిస్తుంది. పనిచేసుకోవడం తప్పు కాదు. కానీ యాంత్రికంగా చేస్తూండడమే తప్పు. ఏదో కోల్పోయినట్లు ఉండటమే. నవ్వుతూ, పక్కవారిని పలకరిస్తూ, పనిలో ఆనందాన్ని చూడడం మరిచిపోతున్నారు.

పనిలో నవ్వుకోల్పోవడం ముఖ్యంగా కార్పొరేట్ సంస్కృతే కారణం. పోటీతత్వం పెరిగి..మనం మాట్లాడితే అవతలి వ్యక్తి మన శక్తియుక్తులను గ్రహిస్తాడనే భయం వల్ల పలకరింపు, నవ్వులు మాయమవుతున్నాయి. మిత్రులే కరువయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. పోటీతత్వం తీవ్రంగా ఉన్నచోట నవ్వు అసలు కనిపించదు. అందుకు ఉదాహరణ..జపాన్ పౌరులు నవ్వడం చాలా తక్కువ. అలాంటి సంఘటన ఎదురైనా చిరునవ్వు నవ్వడమే గగనం.



నవ్వు ఒక భోగం

నవ్వించడం ఒక యోగం


నవ్వకపోవడం ఒక రోగం

మానవ వనరుల వినియోగంలో నవ్వుకు ఉన్న ప్రాధాన్యతను పలు కార్పొరేట్ కంపెనీలు గుర్తించాయి. పనిలో నాణ్యత, శ్రద్ధ, హాజరు వంటి వాటిపై నవ్వు ప్రభావాన్ని తెలుసుకున్నారు. అందుకు శిక్షణ పేరుతో క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. ఇది వారి లాభాపేక్షతో చేసే చర్య అయినా పని ప్రదేశంలో నవ్వుల వాతావరణం మంచిదే. మానవ సంబంధాలు సరిగా లేని కంపెనీలు దెబ్బతినడం సహజమేనని ఒక సర్వేలో తేలింది.

నవ్వు శిక్షకులకు నేటి జీవన మార్గంలో డిమాండ్ పెరిగింది. వారికి ఆశించినంత ఆదాయం కూడా లభిస్తోంది. నవ్వుకు...ఆరోగ్యానికి ఉన్న సంబంధాన్ని శిక్షకులు తమ ప్రాథమిక పాఠంగా చెబుతారు. ఉద్వేగాలను అణుచుకోకూడదని నవ్వు వస్తే నవ్వాలని ఒక సర్వే చెబుతోంది. దీనివల్ల ప్రతి సీరియస్ విషయాన్ని లైట్‌గా తీసుకునే మనస్తత్వం పెంచుతుందనేది వీరివాదన.

హాస్యం అనేది నేటి జీవనశైలిలో భాగమైంది. హాస్యం క్లబ్బులు ఊరూరా వెలుస్తున్నాయి. వాకింగ్‌లో భాగంగా కొంతమంది క్లబ్‌గా ఏర్పడి మనసారా నవ్వుతున్నారు. పలు హాస్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగరాల్లో వీటి ప్రాముఖ్యత పెరిగింది. హాస్యం వల్ల మనసు తేలిక పడుతుంది. బాధలు, భయాలు మర్చిపోతారు. హాస్యానికి ఉన్న ప్రాముఖ్యతను మన సినిమా రంగం ఏనాడో గుర్తించింది.

చూపు బావుండాలంటే...చూసి తినాలి!



కళ్ళు మూసేదాకా ఆ కళ్ళు చక్కగా పని చేయాలి. నిరంతరం చూస్తూ ఉండాలి. చక్కగా చదువుతూ మెదడుకి చైతన్యం అందించాలి అలా చక్కని కళ్ళు ఆరోగ్యంగా ఉండాలంటే విటమిన్లు ఖనిజాలు కావాలి . లుటెన్ ,జయోగ్జాంథన్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆకు కూరలు, కోడిగుడ్లు ,బ్రకోలి స్వీట్ కార్న్ తీసుకోవాలి. విటమిన్ సి ఎక్కువగా ఉండే తాజా పండ్లు, కాప్సికం,పాలకూర వంటివి తరుచూ తినాలి. ముడి ధాన్యాలు ,బాదం అక్రోట్,చేపలు,గుడ్లు,మాంసాహారం,అవిసె గింజలు, పాలు,బీన్స్,ఇవన్నీ కంటిచూపును కాపాడే ఆహారపదార్థాలు క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకోవాలి. వీటిని ఏ కాంబినేషన్స్‌లో తీసుకోవాలో డైటిషియన్‌ని అడిగి వారి సలహాలను పాటించడం మంచిది.

ఇంట్లోనే ఫేషియల్..!



కొన్ని ఫేస్ పాక్ లు శ్రద్ధగా ఇంట్లో చేసుకొంటేనే ఫలితం వెంటనే కనిపిస్తుంది. అన్ని రకాల చర్మానికి మేలు చేసేవిగా ఉండే పదార్థాలను తీసుకొంటే ముఖం మెరిసి పోతుంది. కొబ్బరి పాలు ,కలబంద గుజ్జు ,బియ్యం పిండి,కీరా దోసగుజ్జు ,కొబ్బరి నూనె ,పెరుగు ,ముల్తానీ మట్టి,అరటి పండు గుజ్జు,దానిమ్మ రసం ఇవన్ని గనక సిద్ధం చేసుకొంటే చక్కని ఫేస్ పాక్ తయారై పోతుంది. వీటిలో కొబ్బరి పాలు,కలబంద గుజ్జు మొహానికి పట్టించి ఐదు నిమిషాల తర్వాత తుడిచేస్తే ఈ మిశ్రమం మంచి క్లీనింగ్ లోషన్ లాగా పని చేస్తుంది. బియ్యం పిండి ,కీరదోస గుజ్జులు ,కొబ్బరి నూనెతో మొహం స్క్రబ్ చేసుకోవాలి.ఇప్పుడు ముఖం శుభ్రం చేసుకొని కాస్త ఆవిరిపట్టి పెరుగు,ముల్తానీ మట్టి ,అరటి పండు గుజ్జు ,దానిమ్మ రసంతో ఫేస్ ప్యాక్ వేసుకొని అరగంట తర్వాత కడిగేస్తే ఇది ఫేషియల్ చేయించుకొన్న ఫలితం చూపెడుతోంది



చదివే అలవాటు పెంచండి!

మన దేశంలో పుస్తకాలు చదివేవాళ్ళ సంఖ్య చాలా తక్కువ అనుకుంటాం, కానీ ఈ మధ్య వచ్చిన ఒక సర్వేలో ప్రపంచంలో కెల్లా పుస్తకాలు చదివే వాళ్ళల్లో భారతదేశం ప్రథమ 'స్థానంలో వుంది. కానీ చిన్నపిల్లల విషయానికి వచ్చే సరికి వారు పుస్తకాలను చదవడానికి ఎక్కువగా ఇష్టపడటం లేదు. ఎప్పుడూ కార్టూన్స్,వివిధ రకాల బొమ్మలను, హ్యారీ పోటర్ సిరీస్‌లను చూస్తూ కాలాన్ని గడిపేస్తారు. వీటివల్ల పుస్తక పఠనం పూర్తిగా తగ్గిపోతుంది. చదవడం వల్ల పిల్లల్లో మానసిక వికాసం పెరిగి వారు ఉత్సాహంగా ఉంటారు. అందువల్ల రోజులో కొంచెం సేపు అయినా వారికి పుస్తకాలు చదవడం అలవాటు చేయాలంటున్నారు నిపుణులు. మారుతున్న జీవన శైలిలో అరచేతిలో స్మార్ట్ ఫోన్‌తో ఎన్ని అద్భుతాలు చూసిన మనల్ని ప్రపంచానికి పరిచయం చేసి సమాజంలో గుర్తింపు నిచ్చేది చదువే. అందువల్ల ఫోన్‌కి వారిని కాస్త దూరంగా వుంచి పుస్తకాల వైపు వారి ధ్యాసను మళ్ళించాలంటున్నారు.అందుకోసం వారికి ఆకర్షణీయంగా వున్న బొమ్మల, కథల పుస్తకాలను చూపించి వారికి పుస్తకాలను అలవాటు చేయాలి. పిల్లలు బొమ్మలు ద్వారా ఏం చూపించినా త్వరగా ఆకర్షితులవుతారు అందువల్ల బొమ్మలతో వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేయాలి.

చిట్కాలు



* బట్టలపై నూనె ఒలికిందా ఉప్పు అద్దిన నిమ్మకాయ ముక్కతో రుద్దండి.
'* కొబ్బరి ముక్కను పెరుగులో వేస్తే తొందరగా పెరుగు పాడవదు.
* బిస్కెట్ ప్యాకెట్ బియ్యం డబ్బాలో ఉంచడం వల్ల తొందరగా మెత్తబడవు.



ఆభరణాలను శుభ్రపరచండిలా..

పండుగలు, పెళ్లిళ్లు, ఫంక్షన్ల సమయంలో బంగారం, వెండి ఆభరణాలను ధరించి ఆ తర్వాత జాగ్రత్తపరుస్తుంటారు. అయితే ఆభరణాల్ని శుభ్రపరచకుండా అలాగే బాక్సుల్లో పెడితే అవి మెరుపు కోల్పోతాయి. అలా కాకుండా ఉండాలంటే నగల్ని శుభ్రంచేసేప్పుడు కొన్ని చిట్కాలు పాటించాలి.

విలువైన బంగారు, వెండి ఆభరణాలను మెత్తటి బట్ట, రసాయనాలు లేని సబ్బుతో శుభ్రపరచాలి.

కొందరు బంగారం, వెండి, ప్లాటినం లాంటి ఆభరణాల్ని ఒకే పెట్టెలో ఉంచుతారు. ఇలా చేస్తే ఒక్కోటి ఒక్కో రకం లోహం కావటం వల్ల వాటి మెరుపు తగ్గిపోతుంది.

రంగులు, కెమికల్స్, పెర్ఫ్యూమ్స్, సెంట్స్ దగ్గరగా నగలను ఉంచరాదు.

నీళ్లలోకి వెళ్తుంటే బంగారం గొలుసు, ఉంగరాల్ని తీసేయాలి. నీటిలో ఆభరణాల్ని ఎక్కువగా తడిపితే మెరుపు త్వరగా తగ్గుతుంది.

వెండితో చేసిన ఆభరణాలను వాషింగ్ పౌడర్‌తో శుభ్రపరచాలి. లేదా గోరువెచ్చని నీళ్లలో వంటసోడా కలిపి కడిగేయాలి. శుభ్రపరచటానికి మెత్తటి టూత్ బ్రష్ వాడాలి.



'ప్రతిభ'కు పనితీరే కొలమానం

- ఇకపై అన్ని ఠాణాలలో ఆకస్మిక తనిఖీలు
- పెండింగ్ కేసులపై ప్రత్యేక డ్రైవ్
- క్రైం మీటింగ్‌లలో ఫలితాలు చూపాలి
- నేర పరిశోధనలో నిర్లక్ష్యంపై చర్యలు
- పోలీసుశాఖలో వినూత్న ప్రయోగం

మన తెలంగాణ/హైదరాబాద్ : దేశ వ్యాప్తంగా ఖ్యాతి గడించిన రాష్ట్ర పోలీసుల పనితీరును మరింత మెరుగు పెట్టేందుకు రాష్ట్ర డిజిపి ఎం.మహేందర్‌రెడ్డి సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. పోలీసులలో ఉన్న నైపుణ్యాలకు సానపట్టి తెలంగాణ పోలీసులపై ఉన్న నమ్మకాన్ని రెట్టింపు చేసేందుకు సమాలోచనలు సాగిస్తున్నారు. రాష్ట్ర పోలీసు శాఖలో కొన్ని విభాగాలు మాత్రమే ప్రతిభ కనబరుస్తుండటంతో ఇంత పేరు వచ్చింది. రాష్ట్ర పోలీసు శాఖలోని అన్ని విభాగాలలోని పోలీసులు తమదైన శైలిలో ప్రతిభ చూపితే ప్రపంచవ్యాప్తంగా ఒక గుర్తింపు వచ్చే అవకాశాలున్నాయని పోలీసు బాసులు భావిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క పోలీసు తన ప్రతిభను చూపితే నేర రహిత సమాజం అనతికాలంలోనే సాధ్యమౌతుందన్న పోలీసు బాసులు ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విభాగాలు, ఠాణాలలో పనిచేస్తున్న అన్ని హోదాల పోలీసుల పనితీరుపై నిఘా సారించనున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన పోలీసులకు ప్రోత్సాహకాలు, ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన పోలీసులకు ఆకస్మిక పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటి వరకు పోలీసు శాఖలో సీనియారిటిపై పదోన్నతులు పొందుతున్న విషయం విదితమే. ఇకపై విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది, అధికారులు తమ ప్రతిభ చూపిస్తే ప్రోత్సాహకాలు, అవార్డులు, రివార్డులతో పాటు పదోన్నతులు సైతం కల్పించే విధంగా పోలీసు శాఖ అడుగులు వేస్తోంది. ఇందులో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, నేర పరిశోధన, ఫ్రెండ్లీ పోలీసింగ్, బాధితులకు భరోసా, ప్రజా సమస్యలపై సకాలంలో స్పందించడం, పెండింగ్ కేసుల పరిష్కారం, నేరస్తులకు జైలు శిక్షలు, అదాలత్‌లలో కేసుల పరిష్కారం, క్రైం మీటింగ్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారి ప్రతిభ అనతికాలంలో గుర్తించేందుకు పోలీసులు కొత్త ఒరవడికి తెరతీస్తున్నారు. పోలీసు శాఖలో వివిధ విభాగాల్లోని పలు హోదాలలో పోలీసుల పనితీరును పసిగట్టేందుకు రాష్ట్ర స్థాయిలో మానిటరింగ్ కమిటి ఏర్పాటుకు సైతం రంగం సిద్ధమైంది. గతంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలతో సన్నిహితంగా ఉంటూ వారి సహకారంతో నేరాలను సులువుగా నియంత్రించవచ్చన్న పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆలోచనలు సత్ఫలితాలనిచ్చాయి. సమాజంలో పోలీసులతో పాటు ప్రజలను భాగస్వామ్యం చేసి శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాలు, ఘోరాల ఘటనలను నియంత్రించడం సులభతరమౌతుందన్నది ఉన్నతాధికారులు భావన. నేరాల



పట్ల సకాలంలో సమాచారం అందితే ఆయా నేరాలను నియంత్రించడం, నేర ప్రభావాన్ని అరికట్టడంతో పాటు నేరాలను తగ్గుముఖం పట్టించేందుకు ప్రజల సహకారం పోలీసులకు తప్పని సరి అని సదరు పోలీసు బాసులు భావిస్తున్నారు. ఇప్పటికే పోలీసు శాఖ స్టేషన్లకు వచ్చే వారిపట్ల ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ మొదలు పెట్టిన నాటి నుంచి నేరాల శాతం కొంతమేర తగ్గినట్లు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్న విషయం విదితమే. రాష్ట్రంలోని పోలీసు స్టేషన్ల వారీగా కీలక కేసుల ఛేదన, నేరాల దర్యాప్తు, నేరాల నియంత్రణలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించేందుకు మానిటరింగ్ కమిటి నిత్యం రాష్ట్ర పోలీసుల పనితీరుపై నిఘా సారిస్తూనే ఉంటుంది. పోలీసుల శాఖలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న పోలీసులలో ఉన్న నైపుణ్యాన్ని పదునుపెట్టేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు, శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను మరింత మెరుగుపర్చే విషయంలో పోలీసు శాఖ దృష్టిసారిస్తోంది. రాష్ట్రంలోని అన్ని ఠాణాలలో సంస్థాగత సమర్థత పెంపొందింపు విషయంలో ప్రత్యేక శిక్షణను ఇవ్వనున్నారు. పోలీసు శాఖలో కీలకమైన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, పోలీసింగ్ సైబర్ టెక్నో కమాండ్ సెంటర్, స్మార్ట్ పోలీసింగ్, ఎఫ్ఎస్ఎల్ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి నేరాలకు, నేరస్తులకు ముకుతాడు వేయనున్నారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం పాటుపడుతున్న పోలీసులను గుర్తించడంలో ఇకపై నివేదికలు, జాబితాలు అవసరం లేకుండా క్షేత్రస్థాయిలో వారి పనితీరును గుర్తించనున్నారు. పోలీసుల పనితీరు, ప్రతిభను పసిగట్టే విభాగంలో ప్రజలకు కీలక స్థానం కల్పించేందుకు పోలీసు బాసులు నిర్ణయం తీసుకున్నారు. కన్నీళ్లతో పోలీసు స్టేషన్లకు వచ్చిన బాధితులు ఆనంద బాష్పాలతో తిరిగి వెళ్లేలా అక్కడి పోలీసులు భరోసా కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో పోలీసులు, ప్రజలతో సమాజ శ్రేయస్సుకు సంబంధించిన కార్యాక్రమాలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా డివిజన్‌ల వారీగా పోలీసులు నిర్వహిస్తున్న క్రైం మీటింగ్‌లు మొక్కుబడిగా కాకుండా ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా జరగాలని పోలీసు బాసులు సంకల్పించారు. ఇందులో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన కేసులను త్వరితగతిన ఛేదించిన పోలీసులకు, నేర పరిశోధనలో మెళకువలతో ధైర్యసాహసాలు ప్రదర్శించిన అధికారులకు, సున్నితమైన అంశాలు, సమస్యల పట్ల తమదైన శైలితో పరిష్కారం చూపే పోలీసులకు సీనియార్టీ ప్రకారం కాకుండా ఆకస్మిక పదోన్నతులు కల్పించేందుకు పోలీసు బాసులు సమాలోచనలు సాగిస్తున్నారు. వెరసి విధి నిర్వహణలో ప్రతిభ చూపించే ప్రతి పోలీసును గుర్తించి తగిన విధంగా సత్కరించేందుకు పోలీసు బాసులు సిద్ధంగా ఉన్నారు.



ఏ రైతు.. ఎంత పంట!

- క్రాప్ కాలనీల్ని సమగ్ర సర్వే చేయనున్న ఎఇఒలు
- 26 అంశాలను రూపొందించిన వ్యవసాయ శాఖ

మన తెలంగాణ/హైదరాబాద్ : పంట కాలనీల ఏర్పాటుపై స్పష్టత కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ సర్వేను చేపట్టనుంది. ఇందుకోసం పంటల వివరాలతో పాటు రైతుల వివరాలను సేకరించనుంది. అందుకు అవసరమైన 26 అంశాలతో కూడిన ఒక నమూనాను రాష్ట్ర వ్యవసాయ శాఖ తయారు చేసింది. క్షేత్రస్థాయిలో పనిచేసే వ్యవసాయ విస్తరణ అధికారులు(ఎఇఒ)లు రైతుల వద్దకు వెళ్లి ఈ సమాచారాన్ని సేకరించనున్నారు. ఇటీవల క్రాప్ కాలనీలపై సమీక్ష సందర్భంగా మండల వారీగా వ్యవసాయ, ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని వారం రోజుల్లో సేకరించి జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్‌కు పంపించాలని ముఖ్యకార్యదర్శి పార్థసారధి ఆదేశించారు. కార్యాచరణ ప్రణాళికను జనవరి 25 వ తేదీలోపు పూర్తి చేసి, ఈ వానాకాలంలోనే పైలట్ ప్రాజెక్టు కింద పంట కాలనీలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు సేకరించే సమాచారంతో పట్టాదారు నెంబర్, రైతు పేరు, తండ్రిపేరు, ఆధార్ నెంబర్, పుట్టిన తేదీ, ఫోన్ నెంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, సోషల్ స్టేటస్, మొత్తం ఎన్ని ఎకరాల్లో విస్తీర్ణం ఉంది సర్వే నెంబర్ వారీగా నమోదు చేసుకుంటారు. అందులో ఎంత విస్తీర్ణం సాగుకు పనికొస్తుందనే వివరాలు కూడా తీసుకోనున్నారు. నీటి సదుపాయం బోర్‌వెల్స్ ద్వారా ఉంది, కాలువల ద్వారా ఉందో కూడా వివరాలు నమోదు చేసుకోనున్నారు. వర్షాధార సాగు విస్తీర్ణం, భూసార పరీక్ష కార్డులు అందాయా లేదా అనేటువంటివి సేకరించనున్నారు. అలాగే ఇక సాగయ్యే పంటలు ఏమిటి అందులో ఏ రకం, ఏ సర్వే నెంబర్‌తో ఎంత విస్తీర్ణంతో సాగు చేస్తున్నారో ప్రత్యేక టేపత్యేక నమోదు చేయనున్నారు. ఎంత దిగుబడి వస్తుందో కూడా తెలుసుకోనున్నారు. ఇలా ఖరీఫ్, రబీలకు వేరు వేరుగా వివరాలు నమోదు చేయనున్నారు. అలాగే పూలు, వ్యవసాయ యాంత్రీకరణ అందుబాటులో ఉన్నది లేనిది, సూక్ష్మ నీటి సేద్యం ఎంత అందుబాటులో ఉన్నదనే వివరాలు ఎఇఒలు రైతుల వద్ద నుంచి సేకరించనున్నారు. పంట రుణాలు కూడా ఎంత మొత్తంలో తీసుకున్నారు... ఎంత విస్తీర్ణంలో పంటకు బీమా చేయించారనే సమగ్ర వివరాలు నమోదు చేయనున్నారు. పండించిన పంటలో మార్కెట్‌లో ఎంత అమ్మారు అనే వివరాలు కూడా అందులో ఉన్నాయి. చివరగా దానిపై రైతు సంతకంతో పాటు ఎఇఒ సంతకం కూడా పెట్టనున్నారు. అధిక ఉత్పత్తి ఉన్నటువంటి పంటలకు ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపన ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను స్థానిక స్వయం సహాయక బృందాల ద్వారా ప్రోత్సహించటానికి ఈ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు.

'కోడికత్తి' కేసులో ఎన్ఐఎ వర్సెస్ ఎపి పోలీస్

విజయవాడ ఎన్ఐఎ కోర్టులో పిటిషన్ దాఖలు

మన తెలంగాణ/హైదరాబాద్ : కోడికత్తి కేసు విషయంలో ఎన్ఐఎకు ఎపి పోలీసుల మధ్య అంతర్యుద్ధం మొదలైంది. ఎపి పోలీసులు ఈ కేసు వివరాలను ఎన్ఐఎ అధికారులకు అందించేందుకు ఏమాత్రం సుముఖత చూపడం లేదు. అదేవిధంగా నిందితుడు శ్రీనివాస రావు గతంలో వెల్లడించిన వివరాలను ఎన్ఐఎ అధికారులు ఎపి పోలీసులను కోరినప్పటికీ ఏమాత్రం సహాయ సహకారాలు అందించడం లేదు. దీంతో ఎపి పోలీసుల తీరుపై ఎన్ఐఎ అధికారులు విజయవాడ ఎన్ఐఎ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. కోడికత్తి కేసులో ఎన్ఐఎ విచారణ ఆరవ రోజు ముగిసింది. ఈక్రమంలో శుక్రవారం ఉదయం ఎన్ఐఎ అధికారులు ఈ కేసులో నిందితుడు శ్రీనివాసరావును విజయవాడ కోర్టులో హాజరుపర్చనున్నారు. సంచలనం కోసమే జగన్‌పై దాడి చేసినట్లు విచారణలో నిందితుడు వెల్లడించినట్లు నిందితుని తరపు న్యాయవాది సలీం మీడియాతో పేర్కొన్నారు. ఈనెల 12, 13వ తేదీల్లో వైజాగ్‌లో విచారించారు. అనంతరం నిందితున్ని హైదరాబాద్‌లోని ఎన్ఐఎ కార్యాలయంలో 14,15,16 తేదీలలో విచారణ చేపట్టారు. డిఐజి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. శ్రీనివాసరావు తరపు న్యాయవాదులు సమక్షంలో విచారణ జరిగింది. ఎన్ఐఎ విచారణలో నిందితుడు చెప్పిన కీలక విషయం కేవలం సంచలనం కోసమే దాడి చేశానని తన వెనుక ఎవరూ లేరని, ఎవరి దగ్గర ఒక్క రూపాయికూడా తీసుకోలేదని చెప్పడంతో గురు వారం రాత్రితో విచారణ ముగించారు. అయితే కోడికత్తి కేసులో ఎన్ఐఎ అధికారులకు, ఎపి పోలీసు అధికారుల మధ్య చిచ్చుపెడుతోంది. ఎపి పోలీసులపై నమ్మకం లేదా? తాము దర్యాప్తు చేస్తుండగా ఎన్ఐఎకు ఎలా ? అప్పగిస్తారని ఎపి ప్రభుత్వం శుక్రవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం. కోడికత్తి కేసు దర్యాప్తు దశలోనే కోర్టుల చుట్టు తిరుగుతుండటం గమనార్హం.

సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ అద్భుతం



మన తెలంగాణ/హైదరాబాద్ : అమెరికాలోని ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలో భూసార, నీటి విభాగం శాస్త్రవేత్త కె.రమేష్ రెడ్డి గురువారం జీడిమెట్లలోని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కూరగాయాలు, పూలసాగుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఒక అద్భుతమని, అధికారులు ఎంతో శ్రద్ధతో పనిచేస్తున్నారని కితాబిచ్చారు. భూసారం పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. నీటి వినియోగంలోనూ సాంకేతికతను వినియోగించుకోవాలని రమేష్ రెడ్డి తెలిపారు. ఉద్యాన శాఖ సంచాలకులు అలుపెరగకుండా పర్యటనలు చేస్తూ, రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నారని ప్రశంసలు కురిపించారు. రమేష్ రెడ్డి మన రాష్ట్రానికి చెందిన వ్యక్తి. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు మధు, ఇతరులు పాల్గొన్నారు.

వందల సంఖ్యలో పంచాయతీల ఏకగ్రీవం

మన తెలంగాణ/హైదరాబాద్ : రెండో విడతలోనూ పంచాయతీల ఏకగ్రీవం కొనసాగింది. వందల సంఖ్యలో పంచాయతీల సర్పంచ్‌లు ఏకగ్రీవమైనట్లు తెలిసింది. అయితే జిల్లాల వారీగా పూర్తిస్థాయిలో రిపోర్ట్ రాకపోవడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించలేదు. దీనిపై శుక్రవారం స్పష్టత రానుంది. రెండో విడతలో 4132 పంచాయతీలకు 20,575 నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే 36,362 వార్డులకు 86,855 సరైన నామినేషన్లు వచ్చాయి. గురువారం ఉపసంహరణకు తుది గడువు కావడంతో చాలా చోట్ల ఒకే నామినేషన్‌తో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఏకగ్రీవమైనట్లు తెలిసింది. ఈ నెల 21వ తేదీన, 25వ తేదీన మొదటి, రెండో విడతకు ఎన్నికలు జరగనున్నాయి.

మూడో విడతకు నేడు లాస్ట్ : మూడో విడత పంచాయతీలకు నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి తేదీగా ఉంది. ఈ నెల 19వ తేదీన స్క్రూటిని చేయనున్నారు. ఈనెల 21వ తేదీన ఉపసంహరణకు గడువు ఉంది,. మూడో విడతకు ఈనెల 30వ తేదీన ఎన్నిక జరగనుంది.

నేటి నుంచి తెలంగాణ జాగృతి

అంతర్జాతీయ సదస్సు

హాజరుకానున్న అన్నా హజారే





మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మూడు రోజుల అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు నగరంలో శుక్రవారం ప్రారంభమవుతోంది. హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలోని నోవాటెల్ హోటల్‌లో జరిగే ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పద్మభూషణ్ అన్నా హజారే ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. 'సార్క్' మాజీ సెక్రటరీ జనరల్ అర్జున్ బహదూర్ థాపా ప్రత్యేక అతిథిగా హాజరవుతున్నారు. ఈనెల 20న సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు అనే అంశంపై సదస్సు కేంద్రీకరిస్తుంది. సుమారు 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. పదహారు దేశాల నుంచి 70 మంది వక్తలు, 40 మంది ప్రత్యేక ఆహ్వానితులు కూడా హాజరవుతున్నారు. చర్చా గోష్టులకోసం ప్రత్యేక హాళ్లను తెలంగాణ జాగృతి సంస్థ సిద్ధం చేసింది. ఈ సదస్సు ఏర్పాట్లను జాగృతి అధ్యక్షురాలైన నిజామాబాద్ ఎంపి కవిత గురువారం పరిశీలించారు.

ప్రముఖులతో చర్చా గోష్టులకు ప్యానెళ్ళు

యువత అభివృద్ధి అనే అంశంపై తొలి రోజున జరిగే చర్చా గోష్టిని ప్రముఖ సీనియర్ పాత్రికేయులు శేఖర్ గుప్తా నిర్వహిస్తారు. అసోం ఎంపి గౌరవ్ గగోయ్, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసితో పాటు నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత ప్యానలిస్టులుగా వేర్వేరు చర్చల్లో పాల్గొంటారు. 'గాంధీ, యూత్, సస్టెనబిలిటీ, పర్‌స్పెక్టివ్స్ ఫ్రం ది వరల్డ్' అనే అంశంపై యూకె ఎంపి సీమా మల్హోత్రా, న్యూజిలాండ్ ఎంపి కన్వజిత్ సింగ్ భక్షి, ఐక్య రాజ్య సమితిలో నేపాల్ శాశ్వత ప్రతినిధి మధు రామన్ ఆచార్య, శ్రీలంక పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఉప మంత్రి బుదికా పథిరాణా, మాసిడోనియా రిపబ్లిక్ పెట్టుబడుల శాఖ మాజీ మంత్రి గ్లిగర్ తస్కోవి, ఒకినవా, అఫ్ఘనిస్తాన్‌లలో వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ వ్యవస్థాపకుడు జాన్ డిక్సన్ తదితరులు చర్చల్లో పాల్గొని ప్రసంగిస్తారు. రెండో రోజు నైపుణ్య శిక్షణ, సమతులాభివృద్ధిలో యువత, మహిళల పాత్ర, కార్పొరేటు, ప్రభుత్వాల భాగస్వామ్యంపై చర్చిస్తారు. గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు అంశంపై సదస్సులో చర్చిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. 2030 వరకు భవిష్యత్ మానవాళి మనుగడకు అవసరమైన ప్రాథమిక లక్ష్యాలను సాధించేందుకు ఐక్యరాజ్య సమితి విడుల చేసిన 17 అంశాల లక్ష్యాల సాధనలో భాగంగా తెలంగాణ జాగృతి ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నదని ఆమె తెలిపారు.

ఐక్యరాజ్య సమితి లక్ష్యాలు ఇవే

ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన 17 లక్ష్యాలు, అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో చర్చించే అంశాలు ఈ విధంగా ఉన్నాయని తెలంగాణ జాగృతి సంస్థ తెలియజేసింది. పేదరిక నిర్మూలన, ఆహార సమృద్ధి, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, మంచినీరు పరిశుభ్రత, పర్యావరణ అనుకూల విద్యుత్, గౌరవప్రదమైన పని, ఆర్థికాభివృద్ధి, పరిశ్రమలు, మౌలిక వసతులు, నూతన ఆవిష్కరణలు, అన్ని రంగాల్లో సమానత్వం, పర్యావరణ అనుకూల నగరాలు, గ్రామాలు, బాధ్యతాయుతమైన వనరుల వినియోగం, వాతావరణంలో మార్పులుమానవాళి బాధ్యత, సముద్ర జీవుల సంరక్షణ, భూచరాల జీవనానికి అనుకూల వాతావారణంకు కృషి, శాంతి, న్యాయం దిశగా పటిష్ట వ్యవస్థల ఏర్పాటు, పై లక్ష్యాల కోసం వ్యవస్థలు, దేశాల పరస్పర సహకారం తదితర అంశాలు.

మల్లన్నసాగర్ పనులు త్వరలో

(మొదటిపేజీ తరువాయి)

పెట్టింది. బహుళ అవసరాలు ఉన్నందునే ఏకంగా 50 టిఎంసిల సామర్థ్యంతో మల్లన్నసాగర్‌ను నిర్మిస్తున్నారు. ఇందుకోసం 13,970 ఎకరాల మేర భూసేకరణ చేయాల్సి ఉండగా, ఇంకా కేవలం 100 ఎకరాలు మాత్రమే మిగిలింది. మిగిలిన భూమి మొత్తాన్ని ఇప్పటికే సేకరించారు. వంద ఎకరాల భూసేకరణను కూడ మరో వారం రోజుల్లోపే పూర్తిచేయడమే లక్ష్యంగా అధికారులు రెవెన్యూ శాఖపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. మొత్తానికి గత మూడున్నరేళ్లుగా సాగుతూ వస్తున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం దీంతో ఓ కొలిక్కి వచ్చినట్లు అయింది. నిర్వాసితుల అభ్యంతరాలు, న్యాయస్థానాలను ఆశ్రయించడం, భూసేకరణను వ్యతిరేకించడం, 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని కోరుకోవడం, ఇతరత్రా ఆర్థిక, సాంకేతిక, రాజకీయ పరమైన కారణాలతో మల్లన్నసాగర్ వివాదాస్పద అంశంగా మారింది. వేములఘాట్, తొగుట, ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామాల్లో భూసేకరణ పనుల్లో కేసుల కారణంగా పురోగతి లేదు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం స్థానిక నేతలు, అధికారులు గ్రామ పెద్దలతో మాట్లాడి భూ సేకరణకు ఒప్పించారు. ఫలితంగా 100 ఎకరాలు మినహా, సేకరణ మొత్తం పూర్తయింది. ఇది మరో వారం రోజుల్లో పూర్తి చేయగానే, మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుడతారు.

రాష్ట్రానికి నిధుల వరద

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాలకు కూడా నిధులు ఇవ్వక తప్పదని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కసరత్తు దిశగా చేస్తున్న ఆలోచనల్లో భాగంగా ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకానికి ప్రతీ ఏటా రూ.12 వేల కోట్లను కేటాయిస్తోంది. పార్లమెంటు ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వం రైతుబంధును దేశవ్యాప్తంగా అమలుచేయనున్నట్లయితే ఆ రూపంలో వచ్చే నిధులు రాష్ట్రంలో అమలవుతున్న పథకానికి దోహదపడతాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై భారం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో అధికార టిఆర్ఎస్ పార్టీ లక్ష రూపాయల రుణమాఫీ హామీ ఇచ్చింది. ఇందుకు దాదాపు రూ. 20 వేల కోట్ల మేరకు అవసరమవుతుంది. అయితే పార్లమెంటు ఎన్నికల అనంతరం కేంద్రంలో యూపిఎ లేదా ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఏర్పడినట్లయితే రుణమాఫీ లేదా రైతుబంధు పథకాల అమలు కింద నిధులు రాక తప్పదని, ఆ మేరకు రాష్ట్రానికి భారం తగ్గినట్లేనని, ఏ ప్రభుత్వం వచ్చినా ఇది అనివార్యమని అధికారులు ధీమాతో ఉన్నారు. ఈ రెండు పథకాలకు కలిపి రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఏటా సుమారు రూ.32 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఒకవేళ కేంద్రం యుపిఎ లేదా ఎన్‌డిఎ వచ్చినట్లయితే ఇందులో సగంకంటే ఎక్కువే రాష్ట్ర ఖజానాపై భారం తగ్గుతుందని భావిస్తున్నారు. ఇలా కేంద్రం నుంచి వచ్చే డబ్బును పింఛన్‌లు లేదా సాగునీటి ప్రాజెక్టు అవసరాల కోసం కేటాయించేందుకు ఉపయోగపడుతుందని రాష్ట్ర ఆర్థిక అధికారి ఒకరు 'మన తెలంగాణ'తో వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నందున ప్రస్తుతానికి కేంద్రంలోగానీ, రాష్ట్రంలోగానీ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే ఉంటాయి. పూర్తిస్థాయి బడ్జెట్ లోక్‌సభ ఎన్నికల తర్వాతనే ఉంటుంది కాబట్టి అప్పటివరకు రాష్ట్రంలో రైతుబంధు పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా కొన్ని కేటాయింపులు చేసే అవకాశం ఉంది. అయితే పూర్తిస్థాయి బడ్జెట్ వచ్చిన ఈ పథకాలకు అవసరమైన నిధులను పెట్టాల్సి ఉంటుంది కాబట్టి అప్పటికల్లా కేంద్ర ప్రభుత్వం కూడా ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఈ పథకాలకు ఎలాగూ కేటాయింపులు ఉంటాయని, దాన్నిబట్టి రాష్ట్రానికి ఏ మేరకు ఉపశమనం లభిస్తుందనేదానిపై స్పష్టత వస్తుందని అధికారులు వ్యాఖ్యానించారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. కేంద్రం ఓటాన్ అకౌంట్ కాకుండా మధ్యంతర బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు ఆ అధికారి సూచనప్రాయంగా తెలిపారు. కేంద్ర బడ్జెట్ తరువాత మన రాష్ట్రంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాలని చూస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఎంట్రీకి ప్రభుత్వ శాఖలు సిద్ధం

అన్ని ప్రభుత్వ శాఖలు 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదనల వివరాలను పంపాలని ఈ నెల మొదటి వారంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ఆదేశించింది. అన్ని శాఖలు ఆయా శాఖల్లోని అడ్మినిస్ట్రేటివ్ విభాగాలకు ఈ నెల 11వ తేదీకల్లా పంపాలని, పరిశీలించిన అనంతరం ఈ నెల 18వ తేదీ కల్లా ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్ ద్వారా వివరాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అయితే ఇంకా పూర్తిస్థాయిలో పూర్తి కానందున మరో రెండు రోజుల సమయం తీసుకుని ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌లో ప్రతిపాదనలు నమోదు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆయా శాఖల అధిపతులు తమ విభాగం అధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చలు జరిపారు. ప్రతిపాదనలు విలువ లక్షల రూపాయల్లోనే తెలియజేయనున్నారు.

డేరా బాబాకు జీవిత ఖైదు

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు ఈ శిక్ష విధించింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. దోషులు ఒక్కొక్కరికీ రూ. 50,000 జరిమానా కూడా కోర్టు విధించింది. డేరా బాబా శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిన నేపథ్యంలో హర్యానా, పంజాబ్‌లలో కొన్ని చోట్ల మరింత భద్రత పెంచారు. చండీగఢ్‌ను ఆనుకొని ఉన్న పంచకుల సెక్టార్ 1లో కోర్టు కాంప్లెక్స్‌లో గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. ఇక్కడికి 260 కిలోమీటర్ల దూరంలో హర్యానాలోని సిర్సాలో డేరా బాబా ప్రధాన కార్యాలయం డేరా సచ్చా సౌద ఉండడంతో అక్కడ కూడా భద్రతా చర్యలు తీసుకున్నారు. పోలీస్ డిప్యూటీ కమిషనర్ (డిసిపి) కర్నల్‌దీప్ గోయల్ మాట్లాడుతూ 'పట్టణమంతటా 144వ సెక్షన్ విధించాం. సెక్టార్ 1లో ఉన్న సిబిఐ స్పెషల్ కోర్టు దగ్గర నాలుగు వైపులా రహదారులపై వాహనాల రాకపోకల్ని నియంత్రించాం. కోర్టు లోపల వాహనాల్ని నిలిపేందుకు ఈరోజు ఎవరినీ అనుమతించలేదు. ప్రతి ఒక్కరినీ తనిఖీ చేశాం. సరిహద్దుల్లో వందలాదిమంది భద్రతా సిబ్బందిని నియమించాం. పంచకులలో ప్రవేశించే ప్రతి వాహనాన్నీ పూర్తిగా తనిఖీ చేస్తున్నాం' అని గోయల్ తెలిపారు. 2002లో జరిగిన జర్నలిస్ట్ రామచంద్ర హత్య కేసులో ప్రధాన నిందితుడు రాం రహీం, కుల్దీప్ సింగ్, నిర్మల్ సింగ్, కృష్ణణ్ లాల్ లను గత శుక్రవారం సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం దోషులుగా నిర్ధారించింది. రాం రహీంను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించింది. డేరా బాబా కోర్టుకు వస్తే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుంది కనుక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించేందుకు అనుమతి కోరుతూ హర్యానా ప్రభుత్వం మంగళవారం పిటిషన్ దాఖలు చేసింది. బుధవారం కోర్టు ఆ పిటిషన్‌కు ఆమోదం తెలిపింది.

విజయ రహస్యం

(మొదటిపేజీ తరువాయి)

ఒక అనువైన రాష్ట్రంగా గుర్తించారని, అందువల్లనే సింగపూర్ డెవలప్‌మెంట్ బ్యాంకు (డిబిఎస్) తొలిసారిగా టెక్నాలజీ హబ్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పిందని ఆ లేఖలో ప్రస్తావించారు. ఈ తరహా హబ్‌ను సింగపూర్ వెలుపల నెలకొల్పడం ఇదే మొదటిసారి అని, హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడానికి అనువైన వాతావరణం ఉండడమే కారణమని పేర్కొన్నారు. సింగపూర్‌కు చెందిన యాక్సెండాస్ సంస్థ కూడా హైదరాబాద్‌కు వచ్చిందని గుర్తుచేశారు. రెండోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన కెసిఆర్‌కు సింగపూర్ వాణిజ్య మంత్రి ఈశ్వరన్ అభినందనలు తెలియజేశారు. కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం 17.17% మేర ఆర్థిక వృద్ధి రేటు సాధించడం సంతోషమని, ఇదే వృద్ధి రేటు ఇకపైన కూడా కొనసాగుతుందన్న ఆశాభావాన్ని ఆ లేఖలో వ్యక్తం చేశారు. రానున్న భవిష్యత్తులో సైతం కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ, సింగపూర్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలపడతాయన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. సింగపూర్‌కు చెందిన అనేక కంపెనీలు త్వరలో తెలంగాణను పెట్టుబడులు పెట్టడానికి ఒక కేంద్రంగా ఎంచుకుంటాయని, తెలంగాణ ఆర్థిక వృద్ధిలో ఆ కంపెనీలు కీలక భూమిక పోషిస్తాయని వ్యాఖ్యానించారు. వాణిజ్యపరంగా, ఆర్థికపరంగా మాత్రమే కాక అనేక రీతుల్లో తెలంగాణ, సింగపూర్ మధ్య సంబంధాలు మరింత బలపడతాయన్న నమ్మకాన్ని ఈశ్వరన్ వ్యక్తం చేశారు. సింగపూర్ మంత్రిగా ఈశ్వరన్ రాసిన లేఖతో పాటు ఆ దేశ కాన్సుల్ జనరల్ (చెన్నయ్) కూడా ఒక లేఖను కెసిఆర్‌కు రాశారు. కెసిఆర్‌ను ఈ ఇరువురూ ఆ లేఖలో 'డియర్ ఎక్సలెన్సీ' అని సంబోధించడం విశేషం. తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్ననాలుగేళ్ళలో సింగపూర్ డెవలప్‌మెంట్ బ్యాంకు, యాక్సెండాస్ కంపెనీలతో పాటు అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టాయని, రానున్న కాలంలో ఇది మరింత వృద్ధి చెందుతుందని ఈశ్వరన్, చెన్నయ్‌లోని సింగపూర్ కాన్సుల్ జనరల్ రాయ్ ఖో ఆ లేఖల్లో పేర్కొన్నారు.

బడ్జెట్ పెట్టేదెవరు?

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. జైట్లీ రాని పరిస్థితులు తలెత్తితే ఏం చేయాలనే విషయమై ప్రభుత్వం ముందస్తుగా సిద్ధమవుతోంది. వచ్చే నెల 1న తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు పలు అంశాలపై కసరత్తు చేస్తున్నారు. అరుదైన క్యాన్సర్ మృదు కణాల సార్కోమాతో బాధపడుతున్న జైట్లీ చికిత్స కోసం అమెరికా వెళ్లారు. జైట్లీ అనారోగ్య వార్త విని నిరాశకు లోనయ్యానని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నామని కాంగ్రెస్ అధ్యక్షు రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. అయితే గతేడాదిలో కూడా మూత్రపిండాలకు సంబంధించిన సర్జరీ నిర్వహించడంతో జైట్లీ విశ్రాంతి తీసుకున్నారు. ఈ సమయంలోనూ గోయల్ జైట్లీకి చెందిన ఆర్థిక శాఖ బాధ్యతలను నిర్వర్తించారు. దాదాపు నాలుగు నెలల పాటు గోయల్ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ బాధ్యతలను చూసుకున్నారు. సర్జరీ నుంచి కోలుకుని జైట్లీ తిరిగి తన బాధ్యతలను స్వీకరించారు. జైట్లీ ఎల్లప్పుడు ప్రభుత్వాన్ని రక్షించేందుకు, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు ప్రయత్నిస్తూ కీలకంగా ఉంటారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వంపై వచ్చే విమర్శలను ఆయన తిప్పికొట్టారు. పార్లమెంట్‌లో రాఫెల్ యుద్ధ విమానాల విషయంలో జైట్లీ విమర్శలు ఎదుర్కొన్నారు. ఆయన కూడా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. వచ్చే నెల తాత్కాలిక బడ్జెట్ కేంద్ర ప్రభుత్వానికి ఆఖరి అవకాశం. కొద్ది నెలల్లో సాధారణ ఎన్నికలు రానున్న నేపథ్యంలో పేదలు, మధ్యతరగతి ప్రజలను ఆకర్షించేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటనలు చేసే అవకాశముంది. ఈసారి కేంద్రం అత్యంత ఆకర్షణీమైన పథకాలను ప్రవేశపెట్టనుందని భావిస్తున్నారు.

కళ్లు కానని పొగ మంచు

(మొదటిపేజీ తరువాయి)

వీచే అవకాశముందని అధికారులు తెలిపారు. కోస్తా ఆంధ్రా, రాయలసీమలో ఉదయం సమయంలో పొగమంచు ఏర్పడడంతో పాటు పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.



ఆస్పత్రుల్లో వైద్యం ధరలను స్థిరీకరించాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆస్పత్రుల్లో వైద్యం ధరలను స్థిరీకరించారు రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్. నరసింహన్ పిలుపునిచ్చారు. అందుకోసం ప్రైవేటు వైద్య సంస్థలు సమావేశం ఎందుకు నిర్వహించకూడదని ఆయన ప్రశ్నించించారు. వీనస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 12వ వార్షిక సదస్సును హైదరాబాదులో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వైద్యం ఖర్చు రోజురోజుకు పెరిగిపోతోందని, ఇది పేద మధ్య తరగతి వర్గాలకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తానుకూడా మద్యతరగతికి చెందిన వాడినేనని, ఆభాదేంటో తనకు తెలుసునని అన్నారు. చిన్న చిన్న సమస్యలకు కూడా భారీగా వైద్య పరీక్షలు చేయించే పద్ధతి ని వదిలి వేయాలని ఆయన సూచించారు. వైద్యులకు సమయం చాలా విలువైనదే అయినా రోగుల పట్ల సంయమనంతో వ్యవహరించి వారి సమస్యలను తెలుసుకోవాలని ఆయన కోరారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో సిరలకు సంబందించిన చికిత్సలపై చర్చించనుంది. సదస్సులో అపోలో హాస్పటల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టరు సంగీతా రెడ్డి, అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టరు రఘురామ్ తదితరులు అతిదులుగా హాజరయ్యారు. ఈ సందర్బంగా 'వాయ్' యాప్‌ను గవర్నర్ ఆవిష్కరించారు.

సంత్రగచ్చి — చెన్నై సెంట్రల్‌కు ప్రత్యేక రైలు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే అధికారులు సంత్రగచ్చి నుంచి చెన్నై సెంట్రల్‌కు 12 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. 02841 నెంబర్ కలిగిన ఈ రైలు జనవరి 18, 25, ఫిబ్రవరి 1, 8, 15, 22వ తేదీలలో బయలుదేరుతుంది. సంత్రగచ్చిలో ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 12:40 గంటలకు బయలుదేరి ప్రతి శనివారం సాయంత్రం 4:40 గంటలకు చెన్నయ్ సెంట్రల్‌కు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. తిరుగు ప్రయాణంలో 02842 నెంబర్ రైలు జనవరి 19, 26, ఫిబ్రవరి 2, 9, 16, 23 తేదీలలో రాకపోకలు సాగిస్తోంది. ప్రతి శనివారం సా. 6:20 గంటలకు చెన్నయ్ సెంట్రల్ నుంచి బయలుదేరి ప్రతి ఆదివారం రాత్రి 11:30 గంటలకు సంత్రగచ్చికి చేరుకుంటుంది. ఎసి టు టైర్, త్రి టైర్, స్లిపర్ కోచ్‌లతో రాకపోకలు సాగించే ఈ రైలు ఖరగ్‌పూర్, భద్రుకా, జైపూర్ క్రాస్ రోడ్, భువనేశ్వర్, కుర్ధారోడ్, బ్రహ్మపూర్, విజయనగరం, దువ్వాడ, రాజమండ్రి,విజయవాడ, నెల్లూరు, గూడూరు స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుందని వారు తెలిపారు.

కాళేశ్వరం పనుల్లో వేగం పెంచాలి

సిఎం కార్యదర్శి స్మితా సబర్వాల్



మన తెలంగాణ/కాళేశ్వరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మిత సబర్వాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, కన్నెపల్లి పనులను పరిశీలించారు. ముందుగా మేడిగడ్డ చేరుకొని అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి అనంతరం కన్నెపల్లి బ్యారేజీని చేరుకున్నారు. అక్కడ కొనసాగుతున్న పనులను వీక్షించిన అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో చూసి పనులు జరుగుతున్న తీరుపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గతంలో ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి సందర్శించినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్ణయించిన సమయానికి పనులు పూర్తికావాలంటే పనుల్లో మరింత వేగం అవసరమని, గడువు సమయానికి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తిచేసి రైతులకు నీరందించాలని సూచించారు. ఆమె వెంట జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ నల్ల వెంకటేశం తదితరులు ఉన్నారు.

నేడు మారెడ్డి బాధ్యతలు

మన తెలంగాణ / హైదరాబాద్ : పౌరసరఫరాలశాఖ సంస్థ చైర్మన్‌గా మారెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేసింది. శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు పౌరసరఫరాల భవన్‌లో ఆయన బాధ్యతలను స్వీకరించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం రెండవ సారి ప్రభుత్వాన్ని చేపట్టిన తర్వాత తొలిసారిగా సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన మారెడ్డిని పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా నియమించింది. గత వారంలో దీనికి సంబంధించిన దస్త్రంపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సంతకం చేశారు. దీంతో పదవీ బాధ్యతలను స్వీకరించేందుకు మారెడ్డి సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీతో పాటు టిఆర్ఎస్ కార్యానిర్వహక అధ్యక్షుడు కె.టి.రామారావు, స్థానిక ఎమ్మెల్యే టి.హరీష్‌రావుతో పాటు పలువురు ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, ఇతర కార్పొరేషన్ల ఛైర్మన్లు పాల్గొననున్నారు.

విధుల్లో అలసత్వం, ఎంపిడిఒ సస్పెన్షన్

మన తెలంగాణ/వనపర్తిప్రతినిధి/ఖిల్లాఘణపురం : గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించడంతో పాటు సమయ పాలన పాటించకపోవడంతో ఖిల్లా ఘణపురం ఎంపిడిఒ ఎండి. ఫయాజుద్దీన్‌ను గురువారం కలెక్టర్ శ్వేతామహంతి సస్పెండ్ చేశారు. డిఆర్‌డిఎలో అకౌంట్స్ విభాగంలో ఎపిడిగా పని చేస్తున్న కృష్ణయ్యను ఇంచార్జి ఎంపిడిఒగా నియమించినట్లు డిఆర్‌డిఎ పిడి గణేష్ తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పంచాయతీ ఎన్నికల అధికారులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా వారితో వాదనలకు దిగడంతోపై అధికారులకు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. కిందిస్థాయి అధికారులను సమన్వయం చేయడంలో విఫలమై ఓటరు జాబితా తయారీ లోపభూయిష్టంగా మారిందని ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఇంచార్జి ఎంపిడిఒ కృష్ణయ్య ఎన్నికల ప్రక్రియ పనులను వేగవంతం చేయడంలో నిమగ్నమయ్యారు.



రక్తహీన ఏజెన్సీ

ఏటా పదుల సంఖ్యలో మరణిస్తున్న గిరిజనులు

- గర్భిణిలు, చిన్నారులలో అధికం
- 45,811 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు
- 23,491 మందిలో రక్తహీనత
- పౌష్టికాహార లోపంపై దృష్టి సారించిన సర్కార్

మనతెలంగాణ / ఆదిలాబాద్ ప్రతినిధి : పేదరికం, పౌష్టికాహార లోపం కారణంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా లోని గిరిజన ప్రాంతాల ప్రజలు రక్తహీనతతో తల్లడిల్లిపోతున్నారు. దశాబ్దాలుగా ఈ సమస్యతో సతమతమవుతూ ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రక్తహీనతను నివారించలేక పోతుండడం ఏజెన్సీ ప్రాంత గిరిజనుల పాలిట శాపంగా మారింది. ప్రతి ఏటా ప్రభుత్వ లెక్కల ప్రకారమే పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తుండగా, అధికారుల లెక్కల్లోకి రాకుండా మరిన్ని మరణాలు సంభవిస్తున్నాయి. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలోని అదనపు డీఎంహెచ్‌వో పరిధిలో 31 ట్రైబల్ పీహెచ్‌సీలలో 30 మంది గర్భవతులు, 92 మంది చిన్నారులలో రక్త హీనత ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. 2018 సంవత్సరంలో ఆరుగురు రక్తహీనత కారణంగా మరణించారని ధ్రువీకరించారు. వీటన్నింటికీ పౌష్టికాహార లోపమే ప్రధాన కారణమని వైద్యులు గుర్తించారు. గిరిజనుల ఆహారపు అలవాట్లు, వారు ప్రతి రోజు తీసుకొనే ఆహారంలో అవసరమయ్యే పోషకాలు లేకపోవడంతోనే రక్తహీనత బారిన పడుతున్నట్లు గుర్తించారు. ప్రధానంగా గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోకపోవడంతో వారికి పుట్టిన బిడ్డ వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. మారుమూల ప్రాంతాలలో సరైన పోషకాలు లభించే కూరగాయలు లభించినా కొనలేక, అవసరం మేరకు పప్పు దినుసులు, మాంసాహారాన్ని తీసుకోకపోవడం లాంటివి సైతం ఇందుకు కారణమని చెబుతున్నారు. చిన్న పిల్లలకు తల్లిపాలను పట్టే విషయంలో అనాసక్తి, బిడ్డకు అవసరమైన మేరకు తల్లి వద్ద పాలు రాకపోవడం లాంటివి చిన్నారులలో రక్తహీనతకు కారణమవుతున్నాయి. రక్తహీనతతో బాధపడే వారు ఏ చిన్న జబ్బు చేసినా తీవ్ర అస్వస్థతకు లోనవుతూ ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇలాంటి సమయాల్లో మెరుగైన వైద్యం అందకపోతే ప్రాణాలు పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే రక్తహీనతను నిరోధించేందుకు మాత్రం అవసరమైన చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతూవస్తోంది. గిరిజనులతో పాటు మైదాన ప్రాంతాలవారు రక్తహీనతకు గురి కావడం ఆందోళన కలిగిస్తుంది. జిల్లాలో రక్తహీనతతో బాధపడే వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో సకాలంలో అవసరమైన రక్తం ఎక్కించేందుకు దాతలు ముందుకు రాని పరిస్థితులు నెలకొన్నాయి. పౌష్టికాహార లోపంతో జరుగుతున్న అనర్థాలను ప్రజలకు వివరించడంతో పాటు రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు, వైద్య సిబ్బంది వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని వ్యాధిగ్రస్థులకు ఇక్రిషాట్, ఐటిడిఎ ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. గ్రామాల వారీగా వీటిని పంపిణీ చేస్తూ రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామాలలో రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్యశాలకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు.

జిల్లాలో కొనసాగున్న ప్రత్యేక చర్యలు

ఆదిలాబాద్ జిల్లాలో రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం ఆర్‌బిఎస్‌కే కింద అనిమియా ముక్త్ భారత్ పథకం కింద పైలెట్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులలో రక్త హీనతను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 45811 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 23491 మందిలో రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. నవంబర్ 12 నుంచి చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించగా వేలాది మంది రక్తహీనతతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. ఇందులో 6 గ్రాములు ఉన్నవారు 962, 7 గ్రాములు ఉన్న వారు 1149, 8 గ్రాములున్నవారు 2215, 8 నుంచి 11 గ్రాములు ఉన్న వారు 15205, 11 గ్రాములు ఉన్న వారు 3198, 12 గ్రాములున్న వారు 762 మందితో కలుపుకొని 23491 మందిని ఇప్పటి వరకు గుర్తించారు. ఎనిమిది బృందాలు పని చేస్తున్నాయి. ఆదిలాబాద్, బోథ్, ఉట్నూర్, నార్నూర్ పరిధిలో రెండు బృందాల చొప్పున ప్రతి పాఠశాలలో రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న విద్యార్థులకు మాత్రలను అందిస్తున్నారు. వీరికి రోజుకు రెండు ఐరన్ మాత్రలు మూడు నెలల పాటు అందిస్తున్నారు. అదే విధంగా 8 నుంచి 11 గ్రాముల మధ్య వారికి రోజుకు ఒక ఐరన్ మాత్ర మూడు నెలల పాటు అందిస్తున్నారు. దీంతో పాటు విటమిన్ 'సి', అల్‌బెండజోల్ మాత్రలను అందిస్తున్నట్లు ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి వైసీ శ్రీనివాస్ తెలిపారు.



సిరికొండ మండలంలోని వాయిపేట్ గ్రామం

ఆరోగ్యంపై అవగాహనతోనే నివారణ

ఆరోగ్యంపట్ల శ్రద్ధ పౌష్టికాహారం, రక్తహీనతపై పూర్తి స్థాయి అవగాహన కల్పించడం ద్వారా సమస్య నుంచి బయటపడే అవకాశాలున్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అధికంగా పౌష్టికాహారాన్ని తీసుకోకపోవడంతో జరిగే అనర్థాలను గుర్తించి అందుకు అనుగుణంగా ఆహారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు. రక్తహీనతతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నప్పటికీ పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతోనే మరణాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించుకొని అందుకు అనుగుణంగా వ్యవహరించడం ద్వారా రక్తహీనత నుంచి ఉపశమనం పొందవచ్చని అంటున్నారు.



రక్తహీనతతో బాధపడుతున్న యువతి

డీజిల్ దొంగలు దొరికారు

- రూ. 90 లక్షల నగదు, ట్యాంకర్ స్వాధీనం

మనతెలంగాణ/మన్సూరాబాద్ : ఘట్‌కేసర్ నుంచి చర్లపల్లి తరలించే డీజిల్ పైపు లైను నుంచి డీజిల్ దొంగిలించే నలుగురు అంతర్రాష్ట్ర ముఠాను రాచకొండ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఎనిమిది మంది పరారీలో ఉన్నారు. ఎల్బీనగర్ సిపి క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి మహేష్ భగవత్ వివరాలను వెల్లడించారు. ఐఓసి, బిపిసిఎల్ కంపెనీలు సంయుక్తంగా ఘటకేసర్ నుంచి చర్లపల్లి వరకు డీజిల్ సరఫరాకు పైపు లైను ఏర్పాటు చేశారు. కాగా కొంత కాలం నుంచి డీజిల్ తక్కువగా వస్తుందని రెండు కంపెనీల అధికారులకు అనుమానం కలిగింది. సరఫరా అవుతున్న డీజిల్ మీటర్లు ఏర్పాటు చేసి, డీజిల్ ఎంత వస్తుందని రికార్డు చేసి డీజిల్ తక్కువగా వస్తుందని గుర్తించారు. ఈ విషయమై డిసెంబర్‌లో పోలీసులుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. కాగా నిందితులు మహారాష్ట్ర థానే జిల్లా ముమ్రకు చెందిన హాఫీజ్ అజీజ్ చౌదరి ఎలక్ట్రీషన్‌గా పని చేస్తుంటాడు. గతంలో దొంగ నోట్ల సరఫరాపై ముంబాయి, హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే పశ్చిమ బెంగాల్ ధాన్‌ఘూడ్ జిల్లా క్రిష్ణనగర్‌కు చెందిన జియహుల్ చాంద్ షేక్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. చాంద్ షేక్‌ను గతంలో డీజిల్ చోరీల కేసులో ముంబాయి పోలీసులు అరెస్ట్ చేశారు. బహదూర్‌పురకు చెందిన మహ్మద్ అబ్దుల్ స్థానికంగా ఓ హోటల్ నిర్వహిస్తాడు. అబ్దుల్‌ను గతంలో నకిలీ నోట్ల కేసులో ముంబాయి పోలీసులు అరెస్ట్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా రాంచంద్రపురానికి చెందిన బిన్ని శ్రీనివాసులు స్థానికంగా వ్యవసాయం చేస్తుంటాడు. వీరు అందరూ కలిసి ఒక ముఠా ఏర్పడి డీజిల్ చోరీ చేయాలని పన్నాగం పన్నారు. ఐఓసి ,బిపిసిఎల్ కంపెనీల సరఫరా చేస్తున్న రెండు కిలోమీటర్ల దూరంలో పైపులైను దగ్గరగా ఉన్న మహేందర్‌గౌడ్ స్థలాన్ని లీజ్‌కు తీసుకున్నారు. అనంతరం అక్కడ షెడ్డును ఏర్పాటు చేసుకున్నారు. షెడ్డులో నుంచి పైపు లైను వరకు 3 మీటర్లు పొడవు 2మీటర్లు లోతుతో గుంతను తవ్వి డీజిల్ పైపు లైన్లు క్లాపులు, మోటార్ సాయంతో ట్యాంకరుతో డీజిల్ నింపి బయట అమ్మకాలు జరిపారు. ఈకేసులో పోలీసులు మొత్తం 12 మందిపై కేసు నమోదు చేయగా నలుగురిని అరెస్ట్ చేశారు. చాంద్ షేక్ ,సునీల్ ముదివార్, వాసు, రంగిలాల్, రంబాల్ యాదవ్, సురేష్‌కూమార్, సర్దు, సురేష్‌రెడ్డిలు ఎనిమిది మంది పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి రూ.90 లక్షల 40 వేల నగదు, డీజిల్ టాంకర్, స్కార్పియో కారు, డీజిల్ చోరీ చేసే మోటార్ పైపులైను స్వాధీనం చేసుకున్నారు.



'నారాయణ' ప్రభంజనం

మన తెలంగాణ/హైదరాబాద్ : ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్(imo)లో టాప్ ర్యాంక్‌లను క్లీన్ స్వీప్ చేసి నారాయణ స్కూల్స్ విద్యారంగంలో ప్రభజనం సృష్టించాయి. ఈక్రమంలో 3,4,5,6 తరగతులలో అంతర్జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకులను సాధించింది. అలాగే మొదటి పది ర్యాంకులలో 2633 ర్యాంకులు, 50లోపు అంతర్జాతీయ ర్యాంకుల్లో 5888, వందలోపు స్థాయిలో 7673 ర్యాంకులను నారాయణ స్కూల్ కైవసం చేసుకున్నట్లు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ సింధూర నారాయణ తెలిపారు. 14 దేశాలలో నిర్వహించిన ఈ పరీక్షలో నారాయణ విద్యాసంస్థలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచాయని సింధూర నారాయణ వివరించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో డైరెక్టర్ సింధూర నారాయణ మాట్లాడుతూ విద్యార్థులను విజేతలుగా మలచడానికిసైంటిఫిక్ రిసెర్చ్‌తో నిపుణులు రూపొందించిన నారాయణ సిఒ స్పార్క్, ఒలంపియాడ్, ఇటెక్నో, మెడిస్ పార్క్ వంటి ప్రోగ్రామ్స్ ముఖ్య కారణమన్నారు.

ఎన్ఐఎ కస్టడీకి 'కిడారి' నిందితులు

మనతెలంగాణ/హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌లోని అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్య కేసులోని నిందితులు సుబ్బారావు, ఈశ్వరి, శోభన్‌లను నాలుగు రోజుల పాటు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ) కస్టడీలోకి తీసుకునేందుకు గురువారం న్యాయమూర్తి అంగీకరిస్తూ ఆదేశాలిచ్చారు. ఈ కేసులో మిగిలిన ముగ్గురు నిందితులకు ఈనెల 31 వరకు ఎన్ఐఎ కోర్టు రిమాండ్ విధించింది. ఈ క్రమంలో ఈ కేసును దర్యాప్తు చేపట్టాలంటూ కేంద్ర హోంశాఖ నవంబర్ 30న ఎన్ఐఎను ఆదేశించింది. ఎన్ఐఎ అధికారుల అభ్యర్థన మేరకు నిందితులను ఎన్ఐఎ కస్టడీకి అంగీకరిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలుచేస్తే తప్పేంటి : నారాయణ

మనతెలంగాణ/హైదరాబాద్ : శబరిమల ఆలయంలోకి మహిళలు ప్రవేశించవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేరళ ప్రభుత్వం అమలు చేసిందని, దానిని ప్రధాని మోదీ తప్పుబట్టడం తప్పని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. శబరిమల అయ్యప్పస్వామిని మహిళలు దర్శించుకోవడంపై కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ కేరళ ప్రభుత్వాన్ని తప్పుబట్టారు. ప్రధాని మాటలపై నారాయణ స్పందిస్తూ ప్రధాని మోదీ మాట్లాడిన తీరును తప్పుబట్టారు. కమ్యూనిస్టులకు సంస్కృతీ తెలియదని మోదీ విమర్శించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించడం తప్పు ఎలా అవుతుందని నారాయణ ప్రశ్నించారు. భారతదేశ సంస్కృతిని కేరళ ప్రభుత్వం ఎలా విస్మరించిందో మోదీ తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళలకు సమానత్వం కల్పించడం తప్పా అని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలో కూడా మహిళలకు ఆలయ ప్రవేశం కల్పిస్తున్న అక్కడి ప్రభుత్వాన్ని మోదీ ఎందుకు తప్పుబట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. న్యాయ, పార్లమెంట్, మహిళా వ్యవస్థలకు వ్యతిరేకంగా కేరళ ప్రభుత్వం వ్యవహరించాలన్నది మోదీ విధానమని, అందులో భాగంగానే మోదీ కేరళ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని నారాయణ ఒక ప్రకటనలో ఆరోపించారు.

రాహుల్‌కే సిఎల్‌పి నేత ఎంపిక బాధ్యత

- రాష్ట్రంలో కాంగ్రెస్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలి!
- సమర్థులైన వారికే పదవులను అప్పగించండి
- సిఎల్‌పి నేత ఎంపిక కోసం నిర్వహించిన సమావేశంలో వాడివేడి చర్చ

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేయాలి.. అప్పుడే పార్టీకి భవిష్యత్తు ఉంటుంది. కేవలం పదవులు తీసుకుని ఇళ్ళకే పరిమితమైన నాయకుల్లో చాలా మందికి ముఖ్యమైన పదవులు కూడా ఇస్తున్నారు. వారికే పార్టీలో పెద్దఎత్తున ప్రాధాన్యత కూడా లభిస్తోంది. ఇలాంటి చర్యల వల్ల రాష్ట్రంలో పార్టీ ఉనికికే ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. అధిష్టానం దూతలుగా వచ్చిన వారు ఇక్కడి వాస్తవ పరిస్థితులను క్షుణ్ణంగా తెలుసుకుని కాంగ్రెస్ హై కమాండ్‌కు వాస్తవ నివేదికలను సమర్పించాలి" అంటూ పలువురు కాంగ్రెస్ శాసనసభ్యులు ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్‌ను కోరినట్లు సమాచారం. శాసనసభా పక్షం నేతను ఎంపిక చేసేందుకు పార్టీ దూతగా రెండు రోజుల క్రితం వేణుగోపాల్ హైదరాబాద్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం ఉదయం అసెంబ్లీ ప్రాంగణంలో పార్టీ ఎమ్మెల్యేలతో వేణుగోపాల్ విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎల్పీ నేతగా ఎవరిని ఎంపిక చేస్తే బాగుంటుందో చెప్పాల్సిందిగా ఆయన ఎమ్మెల్యేలను కోరారు. ఒక్కొక్కరితో విడివిడిగా సమావేశం జరపడం వల్ల పలువురు శాసనసభ్యులు స్వేచ్ఛగా తమ మనోభావాలను వ్యక్తం చేశారని సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సిఎల్‌పి నేతను ఎంపిక నుంచి మొదలుకుని పార్టీ పదవుల పంపిణి వరకు వివిధ కోణాల్లో ఆలోచించిన మీదటనే ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని వేణుగోపాల్‌ను వారు కోరినట్లు తెలిసింది. కొందరు ముఖ్యమైన నేతల తీరు ఏ మాత్రం బాగా లేదని....అధికార టిఆర్ఎస్‌తో లాలూచీ పడుతున్నారని కూడా ఫిర్యాదు చేసినట్లుగా అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. మరో రెండు, మూడు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని విజయపథంలో నడిపించే సమర్థులైన నాయకులను గుర్తించి పదవులను అప్పగించాలని వారు సూచించారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టాన వర్గానికి పూర్తి వాస్తవాలు తెలిసే విధంగా మీరు వివరించాలని కొందరు శాసనసభ్యులు వేణుగోపాల్‌కు నిర్మొహమాటంగా చెప్పినట్లు తెలిసింది. కాగా కొందరు శాసనసభ్యులు పార్టీనీ వీడనున్నారన్న ప్రచారం పెద్దఎత్తున సాగుతోందని...అలాంటి వారిని గుర్తించి ముందస్తూ చర్యలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉందని ఏఐసిసి ప్రధాన కార్యదర్శికి స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని సిఎల్పీ నేత ఎంపికతో పాటు టిపిసిసి కమిటికి నూతన జవసత్వాలు అందించే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని కుండబద్దలు కొట్టిన చందంగా చెప్పారు. కాగా రెండు రోజుల క్రితం నగరంలోని గోల్కొండ హోటల్‌లో నిర్వహించిన పిసిసి కోర్ కమిటీ సమావేశాలలో కూడా దాదాపుగా ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కోర్ కమిటీ సభ్యులు చేసిన సూచనలు, సలహాలు, వెల్లడించిన అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకుని సిఎల్పీ నేత ఎంపికను పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి అప్పగిస్తూ సమావేశం ఏకవ్యాఖ్య తీర్మానం చేసింది. ఆయన తీసుకునే నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టిపిసిసి కోర్ కమిటీ సభ్యులు స్పష్టం చేయడంతో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సీఎల్పీ నేత పదవిని ఆశిస్తున్న వారు... వీలైతే తమ పేర్లు కూడా పరిశీలించాలని వేణుగోపాల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వేణుగోపాల్‌తో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ ఆర్.సి. కుంతియా, పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం ముగిసిన తరువాత అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద వేణుగోపాల్ మాట్లాడుతూ, కాంగ్రెస్ శాసనసభా పక్షంతో సమావేశమై వారి అభిప్రాయలను తెలుసుకున్నట్లు చెప్పారు. సిఎల్‌పి నేత ఎంపిక విషయాన్ని రాహుల్‌గాంధీకే అప్పగించాలని పలువురు ఎమ్మెల్యేలు సూచించారన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎల్పీ నేత ఎంపిక నిర్ణయాన్ని ఆయనకే వదలిపెడుతూ పార్టీ శాసనస పక్ష కమిటీ ఏక వ్యాక్య తీర్మానం చేసిందని వేణుగోపాల్ వెల్లడించారు.



వంతెనలతో రాష్ట్రాల అనుసంధానం

- నాలుగు రాష్ట్రాలకు అనుసంధానం
- అటు కాళేశ్వరం, ఇటు ముళ్లకట్టల వద్ద భారీ బ్రిడ్జిలు
- రూ.400కోట్లతో గోదావరిపై వంతెన
- పరిసర గ్రామాల అభివృద్ధి
- దూరం తగ్గించిన జిల్లాలోని వంతెనలు





మనతెలంగాణ/జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతి-నిధి : గోదావరి నదిపై రెండు వైపులా కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన అంతర్రాష్ట్రాల రెండు అతి పెద్ద వంతెనలతో పొరుగు రాష్ట్రాలకు సైతం విద్య, వైద్య, రవాణా సౌకర్యాలు మరింత చేరువయ్యాయి. నాలుగు రాష్ట్రాలకు దీనితో అనుసంధానం కానున్నాయి. సమీప గ్రామాలు అటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు ఆవంతెనల వల్ల సరిహద్దు ప్రాంతాలకు సౌకర్యంగా మారాయి. ఈవంతెనల వల్ల ముఖ్యంగా కాళేశ్వరం వద్ద నిర్మించిన వంతెనతో మహారాష్ట్రలోని సిరొంచ, గడ్చిరోలి, నాగపూర్ వంటి ప్రాంతాలకు ఇటు ముల్లకట్ట బ్రిడ్జి నుంచి చత్తీస్‌గఢ్‌లోని భూపాలపట్నమేకాకుండా పూసూరు, వాజేడు, కన్నాయిగూడెం మండలాల పరిధివారికి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో వారి కష్టాలు తీర్చినట్లయ్యింది. ఈవంతెనల మీదుగా ఆ రాష్ట్రాల నుంచి ముఖ్యపట్టణాలు అయిన వరంగల్, హైదరాబాద్ వంటి దూరప్రాంతాలకు వెళ్లే వారికి ఈవారదులు దూరాన్ని తగ్గించాయి.

వంతెనల నిర్మాణం

మహాదేవపూర్ మండలం కాళేశ్వరం సమీపంలోని గోదావరి నదిపై రూ.292కోట్ల వ్యయంతో నిర్మించిన భారీ వంతెనకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవీస్, ఆరాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావులు 30డిసెంబర్ 2016లో ఆవంతెనను ప్రారంభించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఐఎపి పథకం నుంచి కేటాయించిన నిధులతో 1.6కిలోమీటర్ల పొడవుతో గోదావరినదిపై 36పిల్లర్లతో నిర్మించినందున ఈవంతెన వల్ల గతంలో లేని విధంగా రవాణా సౌకర్యాలు అప్పటి నుంచి మెరుగుపడ్డాయి. ఆ రాష్ట్రాలతో మన రాష్ట్రానికి ఈవంతెన వల్ల విద్య, వైద్య, వ్యాపార, వాణిజ్య రవాణా సౌకర్యాలు మరింత అందుబాటులోకి వచ్చాయి. ఇదే జిల్లా పరిధిలోని కన్నాయిగూడెం, వాజేడు మండలాల సరిహద్దుల్లోని ముల్లకట్ట, పూసూరు గ్రామాల మధ్యగల గోదావరి నదిపై 1.82కిలోమీటర్ల పొడవుతో 44పిల్లర్లతో రూ.200కోట్ల వ్యయంతో నిర్మించిన ఈవంతెనను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి కాజీపేటలో పైలాన్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా 4జనవరి 2016లో అక్కడి నుంచి రిమోట్‌తో బ్రిడ్జిని ప్రారంభించారు. బహుళార్థ సాదక ప్రదాయినిలు అయిన ఈవంతెనల నిర్మాణంతో దశాబ్ధాలుగా పడిన కష్టాలు తీరి మారుమూల ఆదివాసి ప్రాంతీయుల కన్నీరు తుడిచినట్లయ్యింది.

తగ్గిన దూరం.. మెరుగైన లాభం

పూసూరు ముళ్లకట్ట వంతెన మీదుగా నాలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా రహదారి ఏర్పాటైంది. అంతే కాక ఈవంతెన నిర్మాణానికి ముందు వాజేడు, వెంకటాపురం(ఎన్) మండలాల వారు పండించిన వ్యవసాయ, వాణిజ్య పంటలు అయిన పత్తి, మిర్చిని నష్టమైనప్పటికి అప్పట్లో తప్పని స్థితిలో దూరప్రాంతమైన గుంటూరు మార్కెట్‌కు తరలించి అమ్మేందుకు రైతులు అష్టకష్టాలు పడేవారు. అంతేకాక మండలాల వారు బస్సులో హైదరాబాద్ వంటి దూరప్రాంతాలకు వయా భద్రాచలం మీదుగా వెళ్లాలంటే 12గంటల సమయం పట్టేది. ఇప్పుడు వంతెన ఏర్పాటుతో ఆ మండలాల వారు వరంగల్ మీదుగా కేవలం 6గంటల వ్యవధిలోనే రాష్ట్ర రాజధానికి చేరుతున్నారు. ఈవంతెన పుణ్యమా అని వ్యవసాయ ఉత్పత్తులను రైతులు దగ్గరలో ఉన్న వరంగల్ మార్కెట్‌లో విక్రయించే సౌకర్యం ఏర్పడింది. పవిత్ర పుణ్యక్షేత్రాలు అయిన కాళేశ్వరం, భద్రాచలం వెళ్లే వారికి ఈదారితో దూరం తగ్గింది. తూర్పు, పడమర దిక్కులలో రెండు వైపులా అంతర్రాష్ట్రాలను కలిపే కాళేశ్వరం, ముళ్లకట్ట బ్రిడిజ్జిల అనుసంధానంతో అందరికి సౌకర్యంగా ఈవంతెన వల్ల పెరిగిన రవాణా తాకిడితో ఆపరిసర గ్రామాలు కూడా వ్యాపార పరంగా పురోగతికి చేరువలో రూపాంతరం చెందుతున్నాయి.



రామప్పను సందర్శించిన బెటాలియన్ ఐజి



మన తెలంగాణ/వెంకటాపూర్ : సుప్రసిద్ధి గాంచిన శ్రీ రామప్ప రామలింగేశ్వర స్వామిని గురువారం తెలంగాణ బెటాలియన్ ఐజి అభిలాషా బిస్తు కుటుంబ సమేతంగా సందర్శించారు. వారిని అర్చకులు ఘనంగా స్వాగతం పలికి రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుడి గైడ్ విజయ్, వెంకటేష్ లతో గుడి విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐజి తీసుకవచ్చిన కెమెరాలో రామప్ప శిల్పాలను బందించుకున్నారు. వారికి వెంకటాపూర్ ఎస్సై నరహరి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

తాగిన మైకంలో తండ్రిని చంపిన కొడుకు

మనతెలంగాణ/కొడిమ్యాల: మండల కేంద్రంలో బుధవారం రాత్రి తాగిన మైకంలో ఓ కొడుకు కన్న తండ్రినే చంపాడు. వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో ఒడ్డెర కాలనీకి చెందిన బత్తుల లక్ష్మణ్ (60) తన కన్న కొడుకు బత్తుల రవి రాత్రి సమయంలో తప్ప తాగి తండ్రితో గొడవపడ్డాడు. తరుచూ తండ్రిని తాగుడుకు డబ్బుల కోసం వేదించే వాడన్నారు. రోజులాగే తాగేందుకు డబ్బులు అడగగా అది కాస్తా తీవ్ర గొడవకు దారి తీసింది. రవి కోపంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో తండ్రి ముఖంపై దాడి చేశాడు. లక్ష్మణ్ అపస్మారక స్థితిలో పడిపోగా, బండరాయితో కొట్టాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మణ్‌ను పోలీసులు వైద్యం కోసం జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. నిందితుడు రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్య జరిగిన స్థలాన్ని మల్యాల సిఐ నాగేందర్‌గౌడ్ స్థానిక ఎస్‌ఐ సతీష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు.

తప్పిన ఘోర ప్రమాదం



మన తెలంగాణ / మహబూబ్-నగర్ బ్యూరో : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని దివిటిపల్లి వద్ద నాలుగవ నెంబర్ జాతీయ రహదారిపై రెండు లారీలు, ఒక ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయాలు కావడంతో స్థానికులు డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించి ప్రయాణికులను సురక్షితంగా కిందికి దించారు. ఢీకొన్న లారీలో ఖాళీ గ్యాస్ సిలిండర్లు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. పొగ మంచు కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

16 మంది 'సర్పంచ్'లు ఏకగ్రీవం

మన తెలంగాణ/నేరడిగొండ : నేరడిగొండ మండలంలో 16 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని నేరడిగొండ ఎంపిడిఏ ధర్మరాణి తెలిపారు. లఖంపూర్ కుర్రం జంగు,వెంకటాపూర్ రూపావత్ సుజాత,యాపల్‌గూడ మండాడి గోదవరి,బొందిడి ఆడె అనిత,కొర్టికల్ (కే) ఆత్రం పద్మ,బుగ్గారం(కే) జాదవ్ సుభాష్,కుంటాల(బి) అడ సుజాత,కుంటాల(కే) ఎల్లుల అశోక్,లింగాట్ల సాబ్లే స్వర్ణాంజలి,రాజుర జాదవ్ అనూష,రోల్‌మామడ అర్క హంసాబాయి,నాగమల్యాల్ గైండ్ల భీముడు,పీచరమెస్రం సీతారం, వాంకిడి అడిగం రాజు,కొర్టికల్(బి) బర్ధావల్ శ్రీనివాస్,ఆరెపెల్లి గంగాప్రసాద్‌లు ఏకగ్రీవ సర్పంచ్‌లుగా ఎన్నికైనట్లు ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

మన తెలంగాణ/ డిచ్‌పల్లి : డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి నాకా తండా వద్ద తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పలువురికి తీవ్రగాయాలయ్యాయి. డిచ్‌పల్లి ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్‌కు చెందిన గౌరి శెట్టివార్, ప్రకాష్ చంద దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఈ నెల 11న తీర్థయాత్రలకు బయలుదేరి వెళ్లారు. తీర్థయాత్రలు ముగించుకొని విమానాశ్రయంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. విశ్రాంతి తీసుకున్న అనంతరం గురువారం కారులో బయలుదేరి తెల్లవారుజామున డిచ్‌పల్లి మండలంలోని నాకా తండా 44వ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జు అయ్యిందని ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి క్షతగాత్రులను బయటకు తీశారు. ప్రమాదంలో ప్రకాష్ (74), చంద (68)లు మరణించారన్నారు. మృతుల కుమారుడు శ్రీనివాస్, అతని భార్య సుష్మిత, పిల్లలు శ్రీతేజ, జగన్నాథ్, మరో కుమారుడు శివప్రసాద్, అతని భార్య హారిక, పిల్లలు గాయత్రి, శౌర్యలు గాయపడగా అంబులెన్స్‌లో నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మరికొద్ది గంటల్లోనే ఆదిలాబాద్‌కు చేరవాల్సిన కుటుంబం రోడ్డు ప్రమాదంలో ఇరువురిని కబలించడం అక్కడి స్థానికులను కలచివేసింది.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

మనతెలంగాణ/మొగుళ్ళపల్లి : ప్రమాదవశాత్తు విధ్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని మెదరమట్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నా యి. మెదరమట్ల గ్రామానికి చెందిన ఏడాకుల మల్లయ్య (62) అనే రైతు తనకున్న వ్యవసాయ పోలం వద్దకు వెళ్ళీ వైర్లు సరి చేస్తున్నా క్రమంలో ప్రమాదవశాత్తు విధ్యుత్ షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్నా పోలీసులు ఘటన స్థాలానికి చేరుకోని మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి కుమారుడు, కూతురు ఉన్నారు.



పొట్టకూటికోసం.. ఓ మహాత్మ మన్నించూ

మనతెలంగాణ/ఇల్లంతకుంట : ప్రభుత్వాలు మారుతున్నాయి... నాయకులు మారుతున్నారు. కానీ ప్రజల తలరాతలు వారి బతుకు లు మాత్రం మారడం లేదనడానికి ఈ ఒక్క ఫోటోనే నిదర్శనం. ఇ ల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లె లోని శ్రీరామలింగేశ్వరుని జాతరమహోత్సవంలో జగిత్యాల జిల్లాకు చెందిన రాజు అనే యువకుడు ఇలా పొట్టకూటికోసం మ హాత్మ గాంధీ వేశదారణలో భిక్షాటన చేశాడు. దీంతో 'మనతెలంగాణ' ఈ చిత్రాన్ని తన కెమోరాలో బంధించింది. జాతర కో సం వచ్చే జనాలు గాంధీవేశధారణలో ఉన్న వ్యక్తి ముందున్న డబ్బాలో చిల్లర డబ్బులు వేసి వారి జౌనత్యాన్ని చాటుకున్నారు.

జాతీయ రహదారిపై పోలీసుల తనిఖీలు



మనతెలంగాణ/వాజేడు : ఈ నెల 25 న పంచాయితీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏజన్సీ గ్రామల్లో పోలీసులు ముమ్మర తనీఖీలు చేపడుతున్నారు.గురువారం మండలంలోని జగన్నాధపురం వై జంక్షన్ వద్ద 163 జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై గుర్రం క్రిష్ణ ప్రసాద్ నేతృత్వంలో పోలీసులు విస్తృత తనీఖీలు చేపట్టారు.సీఆర్పీఎఫ్ పోలీసు బలగాలను రహదారి పొడవునా మొహరింప చేసి చత్తీస్‌ఘడ్ నుండి హైదారాబాద్,వరంగల్,ఏటురునాగారం తదితర ప్రాంతలకు వెళ్ళే వాహనాలతో పాటు,చత్తీస్‌ఘడ్ వైపూగా వెళ్ళే వాహనాలను కూడా నిలుపుదల చేసి తనీఖీలు చేపట్టారు.వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రయాణికుల వివరాలు తెలుసుకున్నారు.అంతేగాకుండా ప్రయాణికుల వద్ద ఉన్నా బ్యాగులను సైతం నిశితంగా పరిశీలించారు.సరియైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించి,ప్రతి వాహనాదారుడు తప్పనిసరిగా వాహనా పత్రాలు,డ్రైవింగ్ లైసెన్స్ వెంట తెచ్చుకోవలని వాహనాదారులకు సూచించారు.ఈ తనీఖీలలో సిఆర్ఫిఎఫ్ బలగాలు,పోలీసు సిబ్బంది పాల్గోన్నారు.

సహస్ర పూర్ణ చంద్ర తులాభారంపై పోస్టర్ విడుదల



మన తెలంగాణ / హైదరాబాద్ : నగరంలోని మహారాజ్ దత్త శ్రీ ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన మాతృశ్రీ అనసూయ మాతకు సంబంధించిన సహస్ర పూర్ణ చంద్ర తులాభార మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ మహోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దత్తశ్రీ ట్రస్టీ సభ్యులు అల్లాడి వీరేశం, బి.సంగయ్య, ఆర్.సంగయ్యలు ఉన్నారు.

కాకి లక్ష్మారెడ్డి మృతి బాధాకరం

మనతెలంగాణ/హైదరాబాద్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కాకి లక్ష్మారెడ్డి మృతి బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ విచారం వ్యక్తం చేశారు. లక్ష్మారెడ్డి గొప్ప కమ్యూనిస్టు నాయకుడని ఆయన పేర్కొన్నారు. జీవితకాలం కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడిన నాయకుడిగా లక్ష్మారెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు.

సిపిఎం పార్టీలో, తదనంతరం న్యూడెమోక్రసీ పార్టీల్లో లక్ష్మారెడ్డి పనిచేశారని, జీవితాంతం పీడిత, పేదల అభ్యున్నతికి కృషి చేసిన లక్ష్మారెడ్డి పేద ప్రజల్లో చిరస్మరణీయులని ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నారాయణఖేడ్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



మన తెలంగాణ/ నారాయణఖేడ్: పరిపాలన సౌలభ్యం కోసం తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రత్యేక జిల్లాలను ఏర్పాటు చేస్తూ ప్రజలకు పరిపాలన సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి కెసిఆర్ నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ కేంద్రాన్ని జిల్లాగా ఏర్పాటు చేసి మంజీరా జిల్లాగా నామకరణం చేయాలని మంజీరా జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. అంతకు ముందు పట్టణంలోని అంబేద్కర్ భవనంలో రౌండ్ టేబ్ సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా మంజీరా జిల్లా సాధన సమితి అధ్యక్షులు అశోక్ తోర్నాల్‌తో పాటు పలువురు మాట్లాడుతూ నారాయణఖేడ్‌తో కలుపుకొని మనూరు, కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్, నాగల్‌గిద్ద, వట్‌పల్లి, న్యాల్‌కల్, మెదక్ జిల్లాలోని రేగోడ్, కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్, పిట్లం, జూక్కల్, పెద్ద కొడుపుగల్, బిచ్కూంద మండలాలను కలుపుకొని నారాయణఖేడ్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. నారాయణఖేడ్ ప్రాంతం మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉండడంతో అభివృద్ధి పరంగా వెనుకంజలో ఉందని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాకే ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రత్యేక చొరవతో ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి నారాయణఖేడ్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయడంతోపాటు డీఎస్పీ కార్యాలయంతోపాటు నియోజకవర్గంలోని ఏడు మండలాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. గతం కంటే టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి అభివృద్ధి చేయడంతో మరోమారు భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించారని, జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి ఇక్కడి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. మూడు రాష్ట్రాల సరిహద్దులో గల నారాయణఖేడ్ ప్రాంతంలో తెలుగు, హిందీ, కన్నడ, మరాఠిల తోపాటు వివిధ బాషలు మాట్లాడగలరని ఇక్కడి ప్రాంతం త్రిభాష సంఘమంగా పేరుగాంచిందన్నారు. ఇక్కడ పరిశ్రమలు లేకపోవడంతో నిరుద్యోగులు వలసలకు వెళుతున్నారని, ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గంలో 210 తండాలు ఉండగా ప్రతి తండా నుండి ప్రతియేడు వలసలు వెళ్తుంటారన్నారు. అంతేగాక కంగ్టి నుండి జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి వెళ్లాలంటే 110 కిలోమీటర్ల దూరం అవుతుందని, ఖేడ్‌లో జిల్లా కేంద్రం ఏర్పాటు చేస్తే పై మండలాల ప్రజల ఇక్కట్లు తీరుతాయన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణపేట్, ములుగులను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ శ్రీకారం చుట్టారని, హామీ ఇచ్చి తప్పని కెసిఆర్ ఖేడ్‌ను సైతం జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. గత పాలకులు ఖేడ్ అభివృద్ధిని మరిచారని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి కృషితో నారాయణఖేడ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని వారు పేర్కొన్నారు. నారాయణఖేడ్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్‌రాథోడ్, సంజీవ్‌రాథోడ్, మల్లేశం, జయరాములు, భూమయ్య, శివకుమార్‌స్వామి, వెంకట్‌రెడ్డి, రాజు, బబ్లు, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

పోతన నరకయాతన..

- డంపింగ్ యార్డుగా మారిన ఆడిటోరియం..
- ఎగిరిపోయిన పైకప్ప రేకులు
- పట్టించుకోని బల్దియా అధికారులు





మనతెలంగాణ/కార్పొరేషన్: సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాల్సిన ప్రాంగణం నేడు చెత్త డంపింగ్ యార్డుగా మారింది. సాహితీ గోస్టులు, కవి సమ్మేళనాలు జరగాల్సిన ప్రదేశంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పౌరాణిక నటులు గొంతెత్తి పద్యం పాటే వేదిక నేడు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. వరంగల్ పోతన నగర్‌లోని పోతన ఓపెన్ ఎయిర్ థియేటర్ దుస్థితి ఇది. పోతన పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఆడిటోరియంను ఎంతో పవిత్రంగా ఉంచాల్సిన వరంగల్ నగరపాలక సంస్థ అధికారులు డంపింగ్ యార్డుగా మార్చివేశారు. నగరంలోని సేకరించిన చెత్తను అంతా తీసుకువచ్చి ఆడిటోరియం ప్రాంగణంలో గుట్టలుగుట్టలుగా పోస్తున్నారు. గ్రేటర్ అధికారులు పోతన ఆడిటోరియం నిర్వహణను పూర్తిగా విస్మరించడంతో శిధిలావస్థకు చేరింది.

పోతన పంచశతి ఉత్సవాలు..

పోతన తన కావ్యాన్ని రాజులకు అంకితం ఇవ్వనని నాడే ధిక్కార స్వరాన్ని వినిపించిన సహజకవి పోతన మాత్యులు జన్మించిన నేల ఇది.. బమ్మెరలో పుట్టి 500ల సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని పంచశతి ఉత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఉత్సవాల నిర్వహణకు వీలుగా అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు దాతలు సమకూర్చిన నిధులతో వరంగల్‌లోని జెమిని థియేటర్ సమీపంలో సుమారు 30 గుంటలు విస్తీర్ణంలో ఈ ఓపెన్ థియేటర్ నిర్మించారు. 1982 మార్చిలో ఐదురోజుల పాటు నవ్వుతో నాభవిష్యత్తు అన్న రీతిలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. అప్పటి ఉపరాష్ట్రపతి హిదాయితుల్లా ముఖ్యఅతిథిగా హాజరుకాగా కేంద్ర మంత్రిగా ఉన్న పివి నర్సింహరావు ప్రోద్బలంతో నిర్వహించిన ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటైన పోతన విజ్ఞాన పీఠం ట్రస్ట్ ఆధీనంలోనే ఉండేది. నిర్వహణ కూడా ట్రస్టు చూసుకునేది. ఈ పోతన ఆడిటోరియం ఎదురుగా ఉత్సవాల సందర్భంగా కేటాయించిన స్థలాల్లో పోతన విజ్ఞాన పీఠానికి శాశ్వతంగా భవనం నిర్మించారు. ఆడిటోరియం బాగా నడుస్తుందన్న కాలంలో దాని నిర్వహణ విషయంలో వరంగల్ నగర పాలక సంస్థ మెలకపెట్టింది. ఈ స్థలం తమదే కనుక దాని నిర్వహణ తామే చూసుకుంటామని మొండికేసింది. దీంతో ఆడిటోరియం నిర్వహణపై ట్రస్టుకు కార్పొరేషన్ మధ్య వివాదం తలెత్తింది. పోతన విజ్ఞాన పీఠం బాధ్యతలను అప్పగించాలంటే కార్పొరేషన్‌కు రూ.50 లక్షలు చెల్లించాలని అధికారులు మెలిక పెట్టారు. దీంతో ట్రస్టు కోర్టును ఆశ్రయించింది. చాలా కాలంగా కేసు కోర్టులో నడుస్తుంది.

నిర్వహణ విస్మరించారు..

కార్పొరేషన్ అధికారులు ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కాని దాని నిర్వహణ మాత్రం విస్మరించారు. చాలా కాలంగా మరమ్మత్తులు లేకపోవడంతో థియేటర్ పైకప్పులు లేచిపోయాయి. మేకప్, డ్రెస్సింగ్ రూంలు, గోడలు బీటలు వారాయి. వేదిక ధ్వంసమైంది. ప్రాంగణంలోని రాళ్లు పగిలిపోయాయి. ఫ్యాన్లను దొంగలు ఎత్తుకుపోయారు. కరెంటు సరఫరా ఎప్పుడు నిలిచిపోయింది. ఆడిటోరియం ఆలన పాలన చూడకపోగా కనీసం అక్కడ వాచ్‌మెన్ సైతం నియమించలేదు. దీంతో రాత్రిళ్లు థియేటర్ ప్రాంగణంలో అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయింది. ఆడిటోరియం గేటు లేకపోవడంతో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడ స్థలం లేనట్లు కార్పొరేషన్ అధికారులు చెత్తనంతా సేకరించి ఆడిటోరియం ప్రాంగణంలో పోసి చెత్తను వేరు చేస్తున్నారు. ఆడిటోరియం కాస్త ఇప్పుడు డంపింగ్ యార్డుగా మారిపోయింది. ఆడిటోరియం అధ్వాన్నంగా మారడంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కార్పొరేసన్ అధికారులు చెత్త డంపింగ్ యార్డు తరలించి పోతన స్మారక మందిరాన్ని నిర్మించి ప్రజలకు అందించాలని కళాకారులు, ప్రజలు కోరుతున్నారు.

నాటి చరిత్రకు సజీవ రూపం కాకతీయ కళాసంపద



మన తెలంగాణ/సుబేదారి : కాకతీయుల కళా సంపద నాటి చరిత్రకు సజీవరూపాలుగా ఉన్నాయని, యుద్ధ సైనికులను ప్రేరిపించడానికి చేపట్టే పేరిణి నాట్యం కాకతీయ కళకు ప్రధానమైందని కేంద్రీయ విద్యాలయ ఆచార్యురాలు ప్రొఫెసర్ అరుణాంభిక్షు అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని హరిత కాకతీయలో జరుగుతున్న నృత్య రత్నావళి గ్రంధం ఆధారంగా జరుగుతున్న శాస్త్ర ప్రయోగ రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం రెండవరోజు జరిగిన మూడు, నాలుగు సెషన్లలో 8 పరిశోధన పత్రాలు సమర్పించారు. ఉదయం జరిగిన సదస్సులో శ్రీ కళా కృష్ణ, నృత్యరత్నావళి ఆధారంగా పేరిణి నాట్యాన్ని శ్రీ నటరాజ రామ కృష్ణ ఎలా అభివృద్ధి చేశారో, శరీరంలోని వివిధ భాగాలను కదలించి వివిధ రసాలను ఎలా పండించాలో తెలిపి ప్రదర్శించి చూపారు. కాకతీయుల కాలంలో జయపసేనాని రచించిన నృత్య రత్నావళిలో వివిధ నాట్య రీతులు అన్నిరకాలైన నృత్య రీతులను స్ప్రశింపచేశారు. ముఖ్యంగా పేరిణి నాట్యం సైనికులను ఉత్తేజపరచడానికి ఉపయోగపడిందో నాట్యం ద్వారా వివిధ శబ్ధాల ద్వారా చూపారు. కేంద్రీయ విద్యాలయ ఆచార్యురాలు, ప్రొఫెసర్ అరుణాంభిక్షు నృత్యరత్నావళిలో హస్త, అభినయాలం ద్వారా రకరకాల నాట్యాభివాదాలు ఎలా తెలిపారో, నృత్త రత్నావళి మొదటి నాలుగు సాంప్రదాయ నృత్యరీతులను మిగిలిన నాలుగు అధ్యాయాలు దేశీ, ప్రాంతీయ నృత్యరీతులకు క్షుణ్ణంగా వర్ణించాయని తెలిపారు. సాయంత్రం జరిగిన ముగింపు సదస్సులో ముఖ్యఅతిథిగా తెలంగాణ వారసత్వం సంచాలకులు విశాలక్ష్మి ఉపన్యాసం చేస్తూ తెలంగాణ రాష్ట్రం చారిత్రకంగా, సాంస్కృతికంగా ఎంతో ఉన్నతమైన చరిత్రను కలిగి ఉందని దానిని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి వెలికి తీయాల్సిన అవసరం ఉందని తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఇందిరాగాంధీ నేషనల్‌సెంటర్ ఫర్ ఆర్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ సచ్చితానంద జోషి మాట్లాడుతూ దేశంలో ఎంతో ఉన్నత మైన సాంస్కృతిక, వారసత్వ గొప్పదనం ఉందని, దానిని వివిధ ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించడం ద్వారా సాంస్కృతిక సంపదను డాక్యుమెంటేషన్ కొరకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అధ్వయిత వాదిని కేల్, ప్రొఫెసర్ పాండురంగారావు, తదితరులు ప్రసంగించారు.

కార్ల అద్దాలు పగలగొట్టి చోరీలు చేసిన ముఠా అరెస్టు



మన తెలంగాణ / సిటీబ్యూరో : నిర్మానుష్యంగా ప్రదేశంలో నిలిపి ఉన్న కార్లను లక్ష్యంగా చేసుకొని వాటి అద్దాలు పగులగొట్టి కారులోని విలువైన వస్తువులను అపహరిస్తున్న అంతరాష్ట్ర ఘరానా దొంగల ముఠాను అరెస్టు చేసిన కెపిహెచ్‌బి పోలీసులు అరున్న లక్షలు విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు బ్యాగులు నిందుతుల నుండి స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి ఎసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాదాపూర్ జోన్ డిసిపి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన నానామాణిక్ పవార్ తన భార్య గీతా నానా పవార్ సహా మరో ఎడుగురితో కలిసి పార్టీ దొంగల ముఠాను ఏర్పాటు చేసుకొని ముంబైలో చోరీలు చేసి జైలుకు వెళ్ళివచ్చారని ఈగ్యాంగ్ జైలు నుంచి విడుదలయ్యాక హైదరాబాద్ నగరంలో చోరీలకు పాల్పడుతున్నారని వివరించారు. ఒక స్కారిపియో వాహనం వచ్చిన వీరు నగరంలో నిర్మానుష్యమైన ప్రదేశంలో పార్కింగ్ చేసిన కార్లను లక్ష్యంగా చేసుకొని అందులోకి టార్చ్ లైటు సహాయంతో కారులో ఏమి ఉన్నాయో చూసి ఖరీదైన వస్తువులు కనపడితే స్క్రూడైవర్‌తో కారు అద్దాలు పగులగొట్టి అందులోని తీసుకొని పారారయ్యేవారు. ఈవిదంగా ఇప్పటివరకు మాదాపూర్, కెపిహెచ్‌బి, మియాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎనిమిది కారు అద్దాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. గురువారం ఉదయం జెఎన్‌టియు రోడ్డులో అనుమానాస్పదంగా ఉన్న వారిని అదుపులోకి తీసుకొని విచారించటంతో తాము చేసిన నేరాలను అంగీకరించారు. నిందితుల వద్ద నుండి ఆరున్నర లక్షల విలువైన 6 ల్యాప్‌టాప్‌లు బ్యాగులు, విలువైన పత్రాలు స్వాధీనం చేసుకోని రిమాండ్‌కు తరలించారు. మరిన్ని చోరీలకు అఘాయిత్యాలకు పాల్పడక ముందే అప్రమత్తంతో వ్యవహరించి కెపిహెచ్‌బి పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. దొంగలను అరెస్టు చయడంలో ప్రతిభను కనపరిచిన పోలీసులకు డిసిపి వెంకటేశ్వరరావు రివార్డులను అందజేశారు.

మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్

మన తెలంగాణ/ హైదరాబాద్ : మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. అందుకు అవసరమైన ఉద్యోగుల నియామకానికి ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు మెడికల్ బోర్డు కోసం కొత్తగా 26 పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణా రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తమిళనాడు తరహాలో వైద్య ఆరోగ్యశాఖలో నియామకాలన్నీ మెడికల్ బోర్డు ద్వారానే భర్తీ చేసేందుకు గత అక్టోబరులో ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ప్రస్తుతం ఆ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ బోర్డుకు చైర్మన్‌గా ఆ శాఖ ముఖ్య కార్యదర్శి వ్యవహరిస్తారు. సభ్య కార్యదర్శిగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమిస్తారు. సభ్యుడిగా జాయింట్ డైరెక్టరు క్యాడర్ అధికారి ఉంటారు. ఈ మేరకు 26 పోస్టులు మంజూరు చేసారు. వాటిలో ఎనిమిది అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు పద్ధతిన తీసుకోవాలని, మిగిలిన 16 పోస్టులను డిప్యూటేషన్ విధానంలో తీసుకోవాలని ప్రభుత్వం జిఓ లో పేర్కొంది. ఆ 16 మందిలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన ఒకరిని మెంబర్ సెక్రటరీగా తీసుకోవాలని, అలాగే జాయింట్ డైరెక్టర్ హోదా కలిగిన వారిని సభ్యుడిగా తీసుకోవాలని జీవో లో పేర్కొన్నారు. మిగిలిన 14 మంది సిబ్బందిలో డిప్యూటీ డైరెక్టర్ ఒక్కరు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ , అకౌంట్ ఆఫీసర్ ఆఫీసర్, లీగల్ ఆఫీసర్లు ఒక్కొక్కరు చొప్పున, ఇద్దరు ఆఫీసు సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు నలుగురు చొప్పున్న పోస్టులను మంజూరు చేశారు.

నియామకాలన్నీ ఇక బోర్డు ద్వారానే...

రాష్ట్రం ఏర్పడిన తర్వత వైద్య ఆరోగ్యశాఖలో నియామకాల ప్రక్రియ పెద్దగా జరగలేదు. చాలా తక్కువగా వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ ఇతర సిబ్బంది నియామకం మాత్రమే చేపట్టారు. గత ఏడాది ప్రజా రోగ్య సంచాలకుని పరిధిలో 500 మంది వైద్యులు తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో 900 స్పెషలిస్ట్ వైద్యుల భర్తీ తప్ప ఇంకా ఎలాంటి నియామకాలు జరగలేదు. ఇక వైద్య విద్య సంచాలకులు పరిధిలో ఒక పోస్ట్ కూడా భర్తీ చేయలేదు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన ద్వారా నియామక ప్రక్రియ బాధ్యతలు అప్పగించగా కోర్టు కేసుల కారణంగా ముందుకెళ్ళని పరిస్థితి నెలకొంది. దీంతో లాభం లేదనుకున్న సర్కారు తమిళనాడు తరహాలో వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలన్నీ బోర్డు ద్వారానే భర్తీ చేయాలని నిర్ణయించింది.






సంక్రాంతి పండుగకు గ్రామాలకు వెళ్లిన వలసజీవులు సంబురాలు ముగించుకుని తిరిగి పట్నం బాట పడుతున్నారు. దీంతో బస్సులు, రైళ్లు కిటకిటలాడుతున్నాయి. ఇదే అదనుగా ప్రభుత్వ, ప్రైవేటు వాహనదారులు చార్జీలు పెంచి తమ నడ్డి విరుస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. చార్జీలు అధికంగా చెల్లించినా సౌకర్యాలు సరిగాలేక పోవడం దురదృష్టకరమని వాపోతున్నారు.

కళ్ల ముందే కరిగిపోతున్న 'గుట్టలు'

క్రషర్లు, డాంబర్ ప్లాంట్లతో ప్రకృతి సంపద కనుమరుగు





మన తెలంగాణ/ వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి : కళ్ల ముందే ప్రకృతి సంపద కనుమరుగవుతుంది. గ్రామీణ సంపదలైన గుట్టలు చూస్తుండగానే కరిగిపోతున్నాయి. క్రషర్ల నిర్వహణ పేరుతో గ్రామీణ సంపదపై రాబందుల రాజ్యం యదేచ్ఛగా సాగుతుంది. ప్రకృతి సంపదను కాపాడేందుకు చర్యలు చేపట్టాల్సిప అధికారులు క్రషర్లు, డాంబర్‌ప్లాంట్ల నిర్వాహకులు వత్తాసు పలికే విధంగా వ్యవహరించటంతో గుట్టలు క్రమంగా కనుమరుగవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ రూరల్ జిల్లా పరిధిలోని శాయంపేట మండలం పత్తిపాక, మాందారిపేట, ప్రగతి సింగారం, ఆత్మకూర్ మండలాల పరిధిలో గూడెప్పడ్, కొత్తగట్టు, సింగారం, పెద్దాపూర్ క్వారీ, పరకాల మాందారిపేట రహదారి మధ్యలో ఉన్న గుట్టల్లో క్రషర్లు, డాంబర్‌ప్లాంట్లు యదేచ్ఛగా కొనసాగటంతో చూస్తుండగానే కరిగిపోతున్నాయి. కొన్నేండ్లుగా ఈ గుట్టలలో క్రషర్లు డాంబర్‌ప్లాంట్లు నిర్వహించటం శరామామూలుగానే మారింది. దీంతో చుట్టు పక్కల ఉన్న గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అనేక సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేకపోవటం గమనార్హం. క్రషర్ల నిర్వహణతో దుమ్మూ, దూళితో పంటపొలాలకు, ఆయా ప్రాంతాలో భూగర్భజలాలు అడుగంటిపోవటం, పేలుడు శబ్దాలకు ఇండ్లు కంపించిపోవటం నిత్యకృత్యంగా మారింది. మాందారిపేట లాంటి చోట వీటి ప్రభావంతో అనారోగ్యాల పాలైనవారున్నారు. పెద్దాపూర్ క్వారీలో ఆరు నెలల కింద జరిగిన ప్రమాదంలో పదుల సంఖ్యలో గాయపడటం, ఇతర ప్రాంతం నుంచి వచ్చిన కూలీలలో క్రేన్ కిందపడి ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇక పలు క్రషర్లలో ప్రమాదాలు నిత్యకృత్యమనేది గమనించాల్సిన అంశం.

క్రషర్లకు తోడు డాంబర్ ప్లాంట్లు

ఇప్పటికే శాయంపేట, ఆత్మకూర్ మండలాల్లో క్రషర్లతో గుట్టలు కనుమరుగు కావటం, ఆయా ప్రాంతాలలోని భూములలో పంటపొలాలకు నష్టం వాటిల్లే పరిస్థితులున్నాయి. దీనికితోడు అదనంగా డాంబర్ ప్లాంట్లను నిర్వహించటంతో ప్రజల ఆరోగ్యాలకు ముప్పు వాటిళ్ళక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టి డాంబర్ ప్లాంట్ల నిర్వహణను ఆపాల్సిన అవసరముందని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గుట్టను మింగారు.. డాంబర్ ప్లాంట్ పెట్టారు.

శాయంపేట మండలంలోని పత్తిపాక శివారులోని గుట్టను క్రషర్ నిర్వహణతో కనుమరుగైపోయింది. గుట్ట అడుగు భాగంలో సైతం కిలో మీటర్‌కు పైగా తొలిచేశారు. ఇది సరిపోదన్నట్లుగా ఇదే స్థానంలో డాంబర్ ప్లాంట్ నిర్వహణకు సిద్దపడటంతో భవిష్యత్‌లో గ్రామస్తులకు అనారోగ్యాలు తప్పవని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవటం గమనార్హం. ఏదిఏమైనప్పటికి వరంగల్ రూరల్ జిల్లా పరిధిలో ప్రకృతి సంపదలైన గుట్టలు చూస్తుండగానే కనుమరుగవటంతో పాటు ప్రజలను భవిష్యత్‌లో అనారోగ్యాల పాలు చేసే విధంగా డాంబర్ ప్లాంట్లు నిర్వహించబడుతున్నాయనేది గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పంధించి క్రషర్లు, డాంబర్‌ప్లాంట్ల నిర్వహణ తీరు పట్ల సమగ్ర విచారణ జరుపాల్సిన అవసరముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పల్లె వెలుగు బస్సుకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు

ఖమ్మం బస్టాండ్‌లో తిరుగు ప్రయాణీకుల కష్టాలు



మన తెలంగాణ/ఖమ్మం కల్చరల్ : సంక్రాంతి పండుగ అయిపోయింది. సుదూర ప్రాంతాల నుండి కుటుంబాలతో పెద్ద పెద్ద లగేజీలతో పండుగకు వచ్చిన బంధువులు, కుటుంబీకులు తిరుగు ప్రయాణం కట్టారు. బుధవారం కనుమ కావటంతో ప్రయాణాలు చేయడానికి ఇష్టపడరు. అందుకే గురువారం ప్రయాణం కట్టటానికి సిద్ధమయ్యారు. ప్రయాణానికి సిద్ధమై ఖమ్మం బస్టాండ్‌కు వచ్చారు. బస్టాండ్‌లో రద్దీ చూసి అవాక్కయ్యారు. పండుగకు ముందు కంటే పండుగ తరువాతే ఎక్కువ రద్దీ ఉందని బస్టాండ్ పరిసరాలను చూసిన ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో చెప్తారు. అంత రద్దీలోనూ ప్రయాణం తప్పదు కదా అని ఖమ్మం బస్టాండ్‌కు పిల్లాపాపలతో, లగేజీలతో ముందుకు సాగారు. ఏ బస్సు చూసినా కిటకిటలాడుతూ కనిపిస్తుంది. కొన్ని బస్సులకైతే ఫుట్‌పాత్‌ల వద్ద కూడా స్థలం దొరకని పరిస్తితి. రిజర్వేషన్ ఉన్నవారి సంగతి సరే.. లేనివారి మాటేమిటి.. అంటే ఆర్‌టిసివారు ఏం చేసారో మీరే ఈ ఫోటోలో చూడండి. పండుగ రద్దీని తట్టుకోవటానికి పల్లెవెలుగు బస్సులను పట్నం బాట పట్టించారు. అదీ ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టి. ఇంతకన్నా తాము చేయగలిగిందేమీ లేదని వారు ఈ చర్యతో చెప్పకనే చెప్పారు. అంతటితో ఆగలేదు ఖమ్మం నుండి హైద్రాబాద్‌కు ఛార్జీ రూ. 262 అని కూడా తెల్లటి కాగితంపై ఎర్రటి అక్షరాలతో పెద్దగా అందరికీ కనబడేలా బోర్డు ముందర నిలువెత్తు గ్లాసు వద్ద డ్రైవర్ సీటుకు ఎడమ వైపు అతికించారు కూడా. ఇదంతా రాష్ట్ర రాజధాని హైద్రాబాద్ వెళ్లే బస్సుల ప్లాట్‌ఫాం వద్ద పరిస్తితి. ఖమ్మంతో పాటు సమీప గ్రామాలకు పండుగ పూట హైద్రాబాద్ నుండి చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే తమ కుటుంబాలకు సంబందించిన వారే కాకుండా పండుగకు వచ్చే అల్లుళ్ల సంఖ్య హైద్రాబాద్ నుండే ఎక్కువగా ఉన్నందున హైద్రాబాద్ వెళ్లే ఫ్లాట్‌ఫాం గతంలో ఎన్నడూ లేనివిదంగా రద్దీతో రోజంతా కనపడటంతో ఈ రద్దీలో అసలు ప్రయాణం చేయగలమా అని ఎవరికైనా అనుమానం రావచ్చు. వచ్చిన బస్సు వచ్చినట్టే రద్దీగా జనాన్ని నింపుకుని వెళ్లటంతో మరో బస్సు వెంటనే వస్తుందా, వస్తే సీటు దొరుకుతుందా అనే ప్రశ్నలు రాకమానవు. అయితే హైద్రాబాద్ వెళ్లే ప్రయాణీకులకు ఇంద్ర, గరుడ, డీలక్స్, లగ్జరీ, ఎక్స్‌ప్రెస్‌లు ఏర్పాటుచేసినా సరిపోకపోవటంతో చేసేది లేక పల్లెవెలుగులను కూడా రాజధాని బాటకు తిప్పుతున్నారు. అవి కూడా సరిపోకపోవటంతో ప్రయాణీకుల కష్టాలు చెప్పనలవికావు. పండుగ సెలవులు అయిపోతున్నందున తొందరగా తమ గమ్యస్తానాలకు ఎలాగోలా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆరాటపడుతున్నారు. ఈ క్రమంలో అది చివరికి పల్లెవెలుగు అయినా వారు పట్టించుకోవటం లేదు. చివరికి సీటు దొరక్కపోయినా నిలబడి అయినా ప్రయాణించేందుకు సిద్ధమై ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇతర డిపోల నుండి వస్తున్న బస్‌లు కూడా అక్కడే ఫుల్ అయి వస్తుండటంతో సమస్య మరింత జఠిలం అవుతుంది. ఇదిలా ఉండగా ఆర్‌టిసి అధికారులు ప్రయాణీకులను దగ్గరుండి హైద్రాబాద్ వెళ్లే వారిని బస్సుల్లో ఎక్కించి తరువాత అదే మార్గంలో వెళ్లే బస్సులకు, ప్రయాణీకులకు ఫ్లాట్‌ఫాం వద్ద క్లియరెన్స్ ఇస్తున్నారంటే రద్దీ ఏ స్తాయిలో ఉందో, బస్సుల కొరత ఎంత తీవ్రంగా ఉందో అర్ధం చేసుకోవచ్చు. ఆర్‌టిసి అధికారులు రాబోవు వేసవి సెలవులు, ఇతర పెద్ద పండుగలను దృష్టిలో పెట్టుకోని అయినా ప్రయాణీకుల కష్టాలను తీర్చేవిదంగా బస్సుల సంఖ్య పెంచాలని, పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్‌బోర్డులు తగిలించకుండా చూడాలని కోరుతున్నారు.

వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక మార్పులు

ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

మన తెలంగాణ/హైదరాబాద్: వ్యవసాయ రంగం మీద సానుకూలమైన పక్షపాతాన్ని చూపుతూ, వనరుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. వ్యవసాయాన్ని స్థిరమైన, లాభసాటి రంగంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన ఈ రంగంలో నిర్మాణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలని సూచించారు. హైదరాబాద్ లో జరిగిన అగ్రివిజన్ 2019 సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఉత్పాదకత క్షీణించడం, సహజ వనరుల లభ్యత తగ్గిపోవడం, ఆహారం కోసం వేగంగా పెరుగుతున్న గిరాకీ, వ్యవసాయ ఆదాయాలు తగ్గిపోవడం, వ్యవసాయ భూమి తగ్గుతుండడం, వాతావరణ మార్పులు లాంటి ఎన్నో సవాళ్ళను భారతీయ వ్యవసాయరంగం ఎదుర్కొంటుందని ఉపరాష్ట్రపతి తెలిపారు. వ్యవసాయరంగంలో వృద్ధిరేటు పెరుగుదల కీలకమన్న ఉపరాష్ట్రపతి, ఈ రంగం సాధికారత ద్వారా పేదరికాన్ని తగ్గించడమే గాక, ఈ రంగానికి అనుబంధంగా ఉన్న రంగాల్లో లక్షలాది మందికి జీవనోపాధి లభిస్తుందన్నారు. రైతులు వ్యవసాయ అనుబంధ రంగాల మీద కూడా దృష్టి పెట్టాలన్నారు.

బాల కార్మికులు.. బడి బాట పట్టేనా..?

- బడిబాట కోసం ప్రతి సంవత్సరం వేల రూపాయల ఖర్చు చేస్తున్నా ఫలితం శూన్యం
- శ్రద్ధ చూపని విద్యాశాఖ





మన తెలంగాణ/నిర్మల్ ప్రతినిధి: బడీడు పిల్లలు బడి బాట వేసేందుకు విద్యాశాఖ ప్రతీ సంవత్సరం సర్వే చేడుతుంది. బాల కార్మికులు పనిలో కాదు బడిలోఉండాలనే లక్ష్యంతో చేపడుతున్న సర్వే ఆశించిన మేరకు ఫలితం ఇవ్వడం లేదు.విమర్శలు లేకపోలేదు. నివేదిక సమర్పించిన అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. కానీ పిల్లలు మాత్రం బడిలో చేర్చడానికి శ్రద్ధ చూపడం లేదు. ఏటా బడి బాట పిల్లలకు కోసం విద్యాశాఖ సర్వేలు చేపడుతుంది. బడికి దూరంగా ఉన్నవారి లెక్క తేల్చేందుకు బడి పిల్లల సర్వే వారి వివరాలు సేకరించి బడికి వచ్చేటట్లుగా చేయడమే లక్ష్యం. అయితే ఏటా సర్వే చేపడుతున్న బడి బయట పిల్లలు బడిబాట పట్టంచడంలో అధికారులు విఫలం అవుతూనే ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాది మెప్మా శర్మ సిబ్బందితో బడిబయట ఉన్న పిల్లల సర్వే చేపట్టారు. అయితే వారి పూర్తిస్థాయిలో సర్వే చేపటకుండా ముగించేశారు. చదువుకునే వయస్సులో పిల్లలు చెత్తకుప్పల్లో ఫ్లాస్టిక్ ఏరుకుంటూ హోటల్‌లో పని చేస్తూ కనిపిస్తున్నారు.

కొత్త ఏడాదిలోనైనా బడికి వచ్చేనా...?

మరికొద్ది నెలల్లో మళ్లీ నూతన విద్యా సంవత్సరంలోనైన బడి బయట పిల్లలు బడిలోకి వస్తారా లేదా అనే విమర్శలు కూడా ఉన్నాయి. బడి బయట పిల్లల కోసం మళ్లీ సర్వేలకు సిద్దంమైన సర్వేలో గుర్తించిన పిల్లలు పాఠశాలల్లో, కేజిబివిలో, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో టైరనింగ్ సెంటర్లలో చేర్పించి విద్యాభోధన చేయించేందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతుంది. ఈ సారానై సర్వే పకడ్బందీగా నిర్వహిస్తే బడి బయట పిల్లు బడిలో చేరి అక్షరాలు నేర్చుకునే అవకాశం ఉంది.

గాలి లెక్కలు వద్దు

ఐకెపి మెప్మా సిబ్బంది పూర్తిస్థాయిలో సర్వే చేపట్టకుండా ఇళ్లకే పరిమితం లెక్కలు వేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో కేవలం 100 మంది పిల్లలు బడి బయట ఉన్నారని వారి నివేదిక సమర్పించారు. అయితే జిల్లాలో దాదాపు వందల సంఖ్యలో బడి బయట పిల్లలు దర్శనమిస్తున్నారు. గృహాల్లో, హోటళ్లల్లో, రోడ్ల పై చెత్త ఏరుకుంటూ, ఇటుకబట్టీల లాడ్జిల్లో కూడా వ్యాపార సముదాయాల్లో పని చేస్తున్నారు.

వారు నిర్వహించిన సర్వే వివరాల ప్రకారం

జిల్లాలో గత ఏడాది నిర్వహించిన సర్వేలో ఒక వంద మంది బడి బయట పిల్లలు ఉండగా వారిలో 58 మంది బడిబాట పట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. వీరిలో ఆడ పిల్లలు 31 మంది మగపిల్లలు 27 మందిని చేర్పించినట్లు చెబుతున్నారు. అయితే మిగతా అంతా 32 మంది పిల్లలు బడిలో ఉన్నారా ? బయట ఉన్నారా ? అని సర్వే నిర్వహించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సర్వేలను సిఆర్‌పిలు, ఐఎఎస్ కోర్డినేటర్లు , ఎంఈఓ కార్యాలయాల్లో పని చేసే డాటా ఎంట్రి ఆపరేటర్లు భవిత రిసోర్స్ సెంటర్‌లో పని చేసే అర్బన రెసిడెన్షియల్ స్కూల్‌లో పని చేసే పార్టీలతో చేపడతారు. ఈ వివరాలు సేకరించిన అనంతరం బడి బయట పిల్లలు కేజిబివిలో మగ పిల్లలను అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పి ంచి విద్య భోధించే న్నారు. కాగా కొత్తగా నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ టైలరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి బడి బయ ట పిల్లలకు విద్యాభోధన చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఈ సారైన సక్రమంగా జరిగేనా ?

జిల్లావ్యాప్తంగా దాదాపు వెయ్యి మందికి పైగా బడి బయట పిల్లలు ఉండగా సర్వేలు సక్రమంగా నిర్వహించకపోవడంతొ ఆయా మండలాల్లోని పదుల సంఖ్యలో పిల్లలు ఉన్నట్లు నివేదిక సమర్పించారు. బడిలో చేరిన అనంతరం ఆ పిల్ల గురించి పట్టించుకోకపోవడంతో చాలా మంది పిల్లలు మధ్యలోనే చదువులు మానేస్తున్నారు. ఉపాధ్యాయులు పిల్లల పై ప్రత్యేక శ్రద్ద వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పలువురు కోరుతున్నారు.



గృహిణిదే ఆధిపత్యం



సొంతిల్లు ఎంపిక చేసుకోవడంలో మగవాళ్ల కంటే మహిళలదే పైచేయి. సొంతిల్లు కొనుగోలు నిర్ణయం నుంచి ప్రాంతం, బడ్జెట్ ఎంపిక వరకూ అన్నింట్లోనూ గృహిణి నిర్ణయాధికారమే ఆధిపత్యంగా ఉందని ఇటీవల ఓ సర్వేలో వెల్లడైంది. గృహ నిర్మాణానికి సంబంధించి కొనుగోలుదారుల అభిప్రాయం, ఎంపికలపై సర్వే నిర్వహించింది. ఉమ్మడి కుటుంబం బదులు సొంతంగా ఉండేందుకే మహిళలు ఆసక్తి చూపిస్తున్నారని ఈ సర్వే తెలిపింది. సొంతింటి ఎంపిక విషయంలో మగవాళ్లు స్నేహితులు లేదా బంధుమిత్రుల నిర్ణయాలనే ఎక్కువగా పాటిస్తున్నారు. ఏ ప్రాంతంలో ఇల్లు కొనాలి? నిర్మాణ తీరుతెన్నుల గురించి భార్య కంటే ఎక్కువగా ఫ్రెండ్స్ సలహాలే పాటిస్తారని సర్వే తెలిపింది. స్టీల్, సిమెంట్, కాంక్రీట్, బ్రిక్స్, ఎలక్ట్రిక్ వైర్లు, శానిటేషన్ ఉత్పత్తులు వంటి గృహ నిర్మాణ సామగ్రి నాణ్యత, ఎంపికలపై కొనుగోలుదారులకు పూర్తి స్థాయి అవగాహన లేదని.. అందుకే నిర్మాణంలో నాణ్యతాలోపం స్పష్టంగా కనిపిస్తుందని సర్వే వెల్లడించింది.

పాలసీ పత్రాలు కనిపించట్లేదా..?



అనుకోని సంఘటనలు జరిగినప్పుడు కుటుంబాన్ని ఆదుకునేది జీవిత బీమా. కొంతమంది చేసే చిన్న పొరపాటు వల్ల కొన్నిసార్లు ఆపత్కాలంలో అది అక్కరకు రాకుండా పోతుంది. ముఖ్యంగా కుటుంబ సభ్యులకు పాలసీ వివరాలు తెలపకపోవడం, పాలసీ పత్రాలు పోగొట్టడంలాంటివే దీనికి కారణమవుతున్నాయి. ఒకవేళ ఎవరికైనా ఇలాంటి పరిస్థితే ఎదురైతే ఏం చేయాలి? పాలసీ వివరాలను ఎలా తెలుసుకోవాలి?



బీమా సంస్థ, పాలసీదారుడికి మధ్య కుదిరిన ఒప్పందానికి సాక్ష్యం బీమా పత్రం (పాలసీ డాక్యుమెంట్). పాలసీ వివరాలు, చెల్లించాల్సిన ప్రీమియం, ఎంత పరిహారం ఇవ్వాలి? నామినీ ఎవరు? తదితర అంశాలు ఈ పత్రంలో ఉంటాయి. పాలసీ నుంచి రుణం తీసుకోవాలన్నా, పాలసీ వ్యవధి ముగిసిన తర్వాత లేదా పాలసీని మధ్యలోనే నామినీ క్లెయిం చేసుకోవాల్సి వచ్చినా ఈ పాలసీ పత్రాన్ని తప్పనిసరిగా బీమా సంస్థకు సమర్పించాలి. కాబట్టి, దీన్ని మీ ఆస్తి పత్రాల్లాగానే అత్యంత భద్రంగా దాచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రహస్యం పనికి రాదు!

మీరు బీమా పాలసీ తీసుకునేది మీ కుటుంబ క్షేమం కోసమే. అందులో రహస్యమేమీ లేదు. కాబట్టి, మీరు బీమా పాలసీ తీసుకున్న విషయాన్ని కచ్చితంగా మీ కుటుంబ సభ్యులందరికీ చెప్పండి. ఏ పాలసీ తీసుకున్నారు? ఎంత మొత్తానికి? బీమా సంస్థ/సలహాదారు వివరాలు, అవసరం వచ్చినప్పుడు ఎవరిని సంప్రదించాలి? పాలసీ పత్రం ఎక్కడ ఉంది? ఇలాంటివన్నీ మీ జీవిత భాగస్వామికి తెలిసి ఉండాలి. పాలసీ వివరాలు తెలియక క్లెయిం చేసుకోని మొత్తం పెద్ద మొత్తంలో బీమా సంస్థల దగ్గర ఉందని ఐఆర్‌డీఏ 2014లో విడుదల చేసిన ఒక సర్క్యులర్‌లో పేర్కొంది. పాలసీ పత్రం అందుబాటులో ఉన్నప్పుడు క్లెయిం చేసుకోవడానికి ఏ ఇబ్బందీ ఉండదు. ఒకవేళ పాలసీ ఉన్నట్లు తెలియకపోయినా, పాలసీ పత్రం కనిపించకపోయినా కొన్ని పద్ధతులను పాటించడం ద్వారా పాలసీ వివరాలను పొందే అవకాశం ఉంది.

ఇంట్లో వెతకండి!

పాలసీకి మీరు నామినీగా ఉన్నారా? అయితే, పాలసీని క్లెయిం చేసుకోవాల్సి వచ్చినప్పుడు.. పాలసీ పత్రాల గురించి ముందుగా మీ ఇంట్లో వెతకండి. ఆస్తి పత్రాలతోపాటు వీటిని కూడా భద్రంగా దాచి ఉంటారు. కాబట్టి, అన్ని పత్రాలనూ క్షుణ్నంగా పరిశీలించండి. ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆదాయపు పన్ను రిటర్నులు తదితర పత్రాల్లో ఈ పత్రం కూడా ఉండొచ్చు. బ్యాంకు లాకర్లను కూడా చూడండి. ఫలితం ఉండొచ్చు.

బ్యాంకు వివరాలు.. పన్ను రిటర్నులు..

గత కొన్నేళ్ల బ్యాంకు ఖాతా వివరాలు, ఆదాయపు పన్ను రిటర్నులు పరిశీలించడం ద్వారా పాలసీ గురించిన వివరాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంది. బ్యాంకు ఖాతా నుంచి నేరుగా బీమా పాలసీకి ప్రీమియం చెల్లించే ఏర్పాటు చేసినప్పుడు ఖాతా వివరాలు పరిశీలిస్తే ఆ సంగతి తెలుస్తుంది. ఆదాయపు పన్ను రిటర్నులలో పాలసీకి ప్రీమియం చెల్లిస్తున్న సంగతి ఉండొచ్చు. పాలసీదారుడు పనిచేస్తున్న కార్యాలయంలో సంప్రదిస్తే.. దీనికి సంబంధించిన ఆధారాలేమైనా దొరకొచ్చు. కనీసం ప్రీమియం చెల్లించిన రశీదు దొరికినా.. పాలసీ క్లెయిం చేసుకునేందుకు అవకాశం లేకపోలేదు.

ఈ-ఇన్సూరెన్స్?

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో బీమా పాలసీలు తీసుకునే వారి సంఖ్య పెరిగింది. కొంతమంది తమ పాత పాలసీలను ఈఇన్సూరెన్స్ ఖాతాలోకి మార్పించారు. మొదట పాలసీ పత్రాల రూపంలోనే వచ్చినా.. ఈ ఇన్సూరెన్స్ చేయించినప్పుడు ఆ పత్రాలను రిపాజిటర్ తీసుకునే అవకాశం ఉంది. కాబట్టి, పాలసీలను ఆన్‌లైన్‌లో తీసుకున్నారా? లేకపోతే ఈఇన్సూరెన్స్ ఖాతాలోకి మార్పించారా అనేది తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. దీనికి కూడా బ్యాంకు ఖాతా వివరాలు, అతని కార్యాలయంలో సమర్పించిన పత్రాలు సహాయం చేయవచ్చు. ఇన్సూరెన్స్ రిపాజిటరీ ఇటీవలే ప్రారంభం అయినప్పటికీ.. పాలసీదారుడు దీన్ని వినియోగించుకునే అవకాశాలను తోసిపుచ్చలేం. కాబట్టి, అందుబాటులో ఉన్న ఏ అంశాన్నీ మీరు వదలకూడదు.

సన్నిహితులను సంప్రదించండి

పాలసీదారుడి ఉద్యోగ సంస్థతోపాటు, అతని స్నేహితులు, పరిచయం ఉన్నవారిని ఆరా తీయడంతో కూడా బీమా పాలసీ తీసుకున్నారా లేదా అనే వివరాలను తెలుసుకునేందుకు వీలుంది. పాలసీదారుడి ఫోన్‌ని పరిశీలించండి. అందులో ఇన్సూరెన్స్‌కు సంబంధించిన వ్యక్తుల ఫోన్ నెంబర్లు ఉన్నాయా చూడండి. డైరీల్లో ఎక్కడైనా రాసి పెట్టి ఉండొచ్చు. ఇందులో కచ్చితంగా ఏదో ఒక చోట బీమా పాలసీ తీసుకున్న విషయం తెలుస్తుంది. ఒకసారి పాలసీ తీసుకున్న విషయం, దాని వివరాలు తెలిస్తే.. కనీసం క్లెయిం ప్రక్రియ ప్రారంభించేందుకు వీలవుతుంది.


స్నానాల గదులకూ అలంకరణ



కాలానికి అనుగుణంగా ఇంటి అలంకరణకు ప్రాధాన్యతనిస్తున్నారు నేటితరం. ఇందుకోసం గృహాలంకరణలో ఎప్పటికప్పుడు సరికొత్త పుంతలు తీసుకొస్తున్నారు నిపుణులు. ఇంటీరియర్ మొదలు ఇంట్లో ఫర్నిచర్ వరకు సకల హంగులతో తీర్చిదిద్దుకునేందుకు గృహస్తులు పోటీపడుతున్నారు. లివింగ్‌రూం, పడకగదులు, వంటగదిని దాటి స్నానాల గదికి అలంకరణ విస్తరించింది.

బాత్రూమ్ ఫర్నిచర్ అనేది ఇప్పుడు కొత్త ధోరణి. ఇంటి నిర్మాణంలో స్నానాల గది పెద్దపీట వేసింది. ఇరుగ్గా కాకుండా విశాలంగా ఉండేలా నిర్మించుకుంటున్నారు. గోడల చుట్టూ టైల్స్‌తో అలంకరణ, ప్రత్యేకంగా బాత్‌టబ్‌లు, షవర్‌బాత్‌ల వరకు హంగులతో ఏర్పాటు చేసుకోవడం తెలిసిందే. వీటికి ఇప్పుడు బాత్రూమ్ ఫర్నిచర్ కూడా తోడయింది. విలాసవంతమైన ఇళ్ల నుంచి క్రమంగా మధ్యతరగతి కుటుంబాల ఇళ్లకు ఈ పోకడ విస్తరిస్తోంది. ఇంటిలో మిగతా వాటికి ఏమాత్రం తీసిపోని విధంగా స్నానాల గదులకూ ప్రత్యేకంగా ఫర్నిచర్‌ను అలంకరిస్తున్నారు. ముందస్తు ప్రణాళిక ఉంటేనే ఇది సాధ్యమని డిజైనర్లు చెబుతున్నారు.

* వాష్‌బేసిన్ సాదాసీదా కాకుండా చుట్టూ వేర్వేరు ఆకృతుల్లో కేబినెట్లను తయారు చేయిస్తున్నారు.
* బాత్రూమ్ కమోడ్ పక్కనే క్లీనింగ్, ఇతరత్రా సామగ్రి ఉంచేలా ఒక అల్మారాను ఏర్పాటు చేసుకుంటున్నారు. చూడగానే గది శుభ్రంగా అనిపిస్తుంది.
* బాత్‌స్టూల్స్, బెంచ్‌లు, అద్దం చుట్టూ, గోడ వెంట కేబినెట్‌లను తయారు చేయిస్తున్నారు. దీంతో స్నానాల గది మైమరిపిస్తుంది.
* స్నానాల గది కాబట్టి జలకాలాడేటప్పుడు నీరు పడినా పాడవని మెటీరియల్‌తో తయారు చేస్తున్న ఫర్నిచర్ మార్కెట్లో అందుబాటులో ఉంది. వినీర్, సిరామిక్, పీవీసీ, ఓక్, స్టైయిన్‌లెస్ స్టీల్ ఇలా చాలా రకాలు అందుబాటులో ఉన్నాయి. బడ్జెట్, అభిరుచిని బట్టి ఎంపిక చేసుకోవడం మంచిది.
* స్టైయిన్‌లెస్ స్టీల్ దీర్ఘకాలం మన్నుతుంది. తడిచినా పాడవదు. తేమను తట్టుకుంటుంది. తుప్పు పట్టదు. మరకలు పడుతుంటాయి. నల్లబడుతుంది. శుభ్రం చేసేందుకు కాస్త శ్రమ తీసుకోవాలి.
* ఓక్ కేబినెట్ తీసుకుంటే నీరు పడినా పాడవకుండా రంగుల పూత పూస్తారు. ఎక్కువ రోజులు మన్నుతుంది. ఖర్చు కాస్త ఎక్కువే. పీవీసీలో చూస్తే ప్లాస్టిక్ ప్యానెల్ ఉంటుంది. తేమను తట్టుకుంటుంది. నీరు పడినా పాడవదు. కావాల్సిన రంగుల్లో దొరుకుతాయి. వేడిని తట్టుకుంటుంది. సులభంగా శుభ్రం చేసుకోవచ్చు. కానీ రసాయనాలు పడితే పాడయ్యే అవకాశం ఉంది.



విదేశీ అనుకరణపై మోజు..!

సంప్రదాయ శైలి నుంచి క్రమంగా ఆధునిక పోకడలవైపు వెళ్తున్నాయి నేటి తరం ఇంటి నిర్మాణాలు. వీటిల్లో ఎక్కువగా విదేశీ అనుకరణ ఎక్కువగా కనిపిస్తోంది. కొనుగోలుదారుల ఇష్టాలకు అనుగుణంగా నిర్మాణదారులు కొత్తవాటిపై దృష్టిపెడుతున్నారు. ఇలా సకల హంగులతో ఇళ్లన్నీ ఇకముందు స్మార్ట్‌గా ఉండబోతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

మార్కెట్లోనూ స్మార్ట్ పరికరాల అందుబాటు పెరగడం, ధరలు సైతం అందుకునే స్థాయిలో ఉండటంతో వీటిపై అవగాహన ఉన్నవారు వాడుతున్నారు.

* నగరమైనా దొంగతనాల భయం వెంటాడుతుంటుంది. దసరా పండగ సెలవుల్లో, ఎక్కడికైనా కొద్దిరోజుల పాటు విహారానికి వెళితే ఇంటి భద్రతపైనే ఎక్కువమంది ఆందోళన చెందుతుంటారు. స్మార్ట్ హోమ్ సెక్యూరిటీ సిస్టమ్ ఉంటే భరోసాగా ఉండొచ్చు. తప్పనిసరి పరిస్థితుల్లో పిల్లలను ఇంట్లో ఒంటరిగా ఉంచినా ఆందోళన చెందాల్సిన పనిలేదనే భరోసా ఇస్తోంది ఈ పరికరం. వైఫై సెక్యూరిటీ కెమెరా ఇది. రాత్రిపూట కూడా పనిచేస్తుంది. అవసరమైన చోట దీన్ని బిగించుకుని యాప్ సహాయంతో అవసరమైనప్పుడు మొబైల్ నుంచే చూసుకోవచ్చు. ఇంటిని, పిల్లలను ఓ కంట కనిపెట్టవచ్చు.
* వైఫై ఆధారంగా పనిచేసే స్మార్ట్ స్విచ్చులు వచ్చాయి. టీవీలు ఏసీలు మాత్రమే కాదు ఇంట్లో బల్బులు, ఫ్యానులు, స్టీరియోలు రిమోట్‌తో నియంత్రించవచ్చు. ఇంట్లో ఉన్నప్పుడే కాదు.. మొబైల్ యాప్ సహాయంతో ఎక్కడ ఉన్నా వీటిని ఆన్, ఆఫ్ చేయవచ్చు. ఏ సమయంలో నిద్ర లేపాలో చెబితే ఆ వేళకు బిగ్‌బాస్ షో మాదిరి మ్యూజిక్ సిస్టమ్ నుంచి వచ్చే పాటతో నిద్ర లేపుతుంది.
* స్మార్ట్‌గా పనిచేసే ఎల్‌ఈడీ బల్బులు ఈ రోజుల్లో ఇంటికి ప్రధాన ఆకర్షణ. అలసిపోయి ఇంటికి వచ్చి సోఫాలో కూలబడి లైట్ వేయగానే సంగీతం కూడా వినపడితే అలసిన మనసుకు స్వాంతన కలుగుతుంది. ఈ తరహా స్మార్ట్ పరికరాలు మున్ముందు ప్రతి ఇంట్లో సాధారణం కాబోతున్నాయి.
* రోజువారీ, ముఖ్యంగా దీపావళి వంటి పండగల సమయంలో గృహిణులకు ఇంటిని శుభ్రం చేయడం పెద్దపని. తీరిక లేకుండా ఉండేవారికి ఇంటిని శుభ్రం చేసే స్మార్ట్ క్లీనింగ్ రోబోలు వచ్చాయి. వాక్యుమ్ క్లీనర్ అనగానే ఎక్కడో అల్మారాలో దాచిన దాన్ని బయటకు తీసి శుభ్రం చేయమంటే బద్ధకిస్తుంటారు. చిన్న పరిమాణంలో వచ్చిన ఈ క్లీనింగ్ రోబో సులువుగా శుభ్రం చేస్తుంది. మూలలు, ఫర్నిచర్ అడుగుభాగం అన్నిచోట్లకు వెళుతుంది. క్లీనింగ్ రోబోలతో ఏ రోజు, ఏ సమయంలో శుభ్రం చేయాలో ఆదేశాలు ఇస్తే చాలు దానంతట అది పని చేసుకుంటూ పోతుంది.

వైర్ల ఎంపికలో జాగ్రత్త..

ఇంటి ఎంపికలో ధర, ప్రాంతమే కాదండోయ్.. నిర్మాణ సామగ్రి వినియోగం కూడా ప్రధానమైనదే. మరీ ముఖ్యంగా ఇంట్లో వినియోగించే ఎలక్ట్రిక్ వైర్లు, పవర్ బోర్డులు.. నాసిరకం ఉత్పత్తులను వాడినా లేక ఎంపికలో ఏమరపాటుగా ఉన్నా సరే జరిగే ప్రమాదం ఊహించలేనిదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రిక్ వైర్ల ఎంపికలో నిపుణుల సలహాలివే..



ధర విషయంలో రాజీ పడకుండా నాణ్యతకు సంబంధించి సర్టిఫై చేసిన కంపెనీల ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలి.

* విద్యుత్ షాక్‌లకు ఆస్కారం లేకుండా అవసరమైన ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. కన్స్యూమర్ యూనిట్‌పై ఉండే మెయిన్ స్విచ్‌ను టర్న్ ఆఫ్ చేయాలి.
* ప్రతి పవర్ బోర్డ్‌లో విడిగా ఫ్యూజ్ లేదా మినీ సర్క్యూట్ బ్రేకర్ (ఎంసీబీ) వంటి ట్రిప్పింగ్ పరికరాలు ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే ఒకవేళ షార్ట్ సర్క్యూట్ జరిగితే ఇవి వెంటనే యాక్టివేట్ అవుతాయి.
* అవసరమైన దానికంటే ఎక్కువ కనెక్షన్లను ఇవ్వొద్దు. పవర్ సప్లయి కార్డ్‌ను నీళ్లు, వేడి ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలి.

పర్యావరణహిత భవనాలు

హరిత భవనాలపై ప్రజల్లో క్రమంగా ఆసక్తి పెరుగుతోంది. పర్యావరణహితంగా నిర్మాణాలతో దీర్ఘకాలంలో నిర్వహణ వ్యయాలు తగ్గడం, ఆరోగ్యంగా ఉండడం వంటి ప్రయోజనాలతో గ్రీన్ బిల్డింగ్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడిప్పుడే బిల్డర్లు ముందుకొస్తున్నారు.

నిర్మాణ వ్యయం ఎక్కువ అవుతుందని చాలామంది ఇప్పటికీ దూరంగా ఉంటున్నారు. డిజైన్ దశలోనే జాగ్రత్త పడితే సాధారణ నిర్మాణాల వ్యయంలోనే వీటిని నిర్మించవచ్చని అర్కిటెక్ట్‌లు అంటున్నారు. ఈ తరహా నిర్మాణాలకు ఉపయోగించే సామగ్రి ధరలు చాలావరకు ఇప్పటికే తగ్గాయని గుర్తు చేశారు. ప్రభుత్వం కొన్ని రాయితీలు అందిస్తే ప్రతి నిర్మాణం హరిత భవనం అవుతుందని ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) హైదరాబాద్ ఛాప్టర్ అంటోంది.





నాలుగో రోజూ పెరిగిన బంగారం ధర



ముంబై: వరుసగా నాలుగో రోజు బంగారం ధర పెరిగింది. గురువారం పసిడి ధర పది గ్రాములు రూ.110 పెరిగి రూ.33,300కు చేరింది. స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడంతో బంగారం ధర పెరుగుతూ వస్తోందని బులియన్ మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నారు. మరోవైపు నేడు వెండి ధర తగ్గింది. కిలో వెండి ధర రూ.300 తగ్గి రూ.40,200గా ఉంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి వెండికి డిమాండ్ తగ్గినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం ధర పది గ్రాములకు రూ.110 తగ్గి వరుసగా రూ.33,300, రూ.33,150గా ఉన్నాయి. గత మూడు రోజులుగా బంగారం ధర పది గ్రాములపై రూ.315 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 1292.55 డాలర్లుగా, ఔన్సు వెండి ధర 15.57డాలర్లుగా ఉంది.

'ఆయుష్మాన్ భారత్'కు బిల్‌గేట్స్ ప్రశంస



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'ఆయుష్మాన్ భారత్'కు ప్రపంచంలో అత్యంత సంపన్నుడైన బిల్‌గేట్స్ ప్రశంసల జల్లు కురిపించారు. ఈ పథకం ప్రారంభించి 100 రోజులు అయినందుకు గేట్స్ ట్విట్ చేశారు. ఆరోగ్య సంరక్షణ అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకంతో తక్కువ సమయంలో 6.85 లక్షల మందికి ప్రయోజనం లభించినందుకు గాను భారత్‌ను బిల్‌గేట్స్ కొనియాడారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార పార్టీకి ఇది సానుకూల వార్త కానుంది.

జొమాటోతో చేతులు కలిపిన పేటీఎం

Paytm zomato

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ విభాగంలో మార్కెట్‌ను క్యాష్ చేసుకునేందుకు పలు కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా ఇ–కామర్స్ వేదిక పేటీఎం ఫుడ్ డెలివరీ యాప్ జొమాటోతో చేతులు కలిపింది. దీంతో మొబైల్ వాలెట్ యాప్ ద్వారా ఆహారాన్ని ఆర్డర్ చేసేందుకు తన వినియోగదారులకు పేటీఎం అవకాశం కల్పిస్తోంది. ఈ సేవలను తొలుత ఢిల్లీ–ఎన్‌సిఆర్ ప్రాంతంలో ప్రారంభించి, ఆ తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించనుంది. ఫుడ్ డెలివరీ విభాగంలోకి అనేక సంస్థలు ప్రవేశిస్తున్న సందర్భంలో తాజాగా పేటీఎం కూడా తన మార్కెట్ పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే క్యాబ్ సేవల సంస్థ ఓలా కూడా ఫుడ్ యాప్ స్విగ్గీతో చేతులు కలిపిన విషయం తెలిసిందే.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,374.08	52.79	(0.15%)
నిఫ్టీ	10,905.20	14.90	(0.14%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.18
యూరో	81.08
బ్రిటిష్ పౌండ్	91.64
ఆస్ట్రేలియన్ డాలర్	51.02
కెనెడియన్ డాలర్	53.63
సింగపూర్ డాలర్	52.49
స్విస్ ఫ్రాంక్	71.80
చైనీస్ యువాన్	10.52
మలేషియన్ రింగిట్	17.32
న్యూజిలాండ్ డాలర్	48.14
హాంకాంగ్ డాలర్	9.08
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	234.95
సౌతాఫ్రికన్ రాండ్	5.20

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31080	33240.64	0.19%
ముంబై	31660	33860.96	0%
ఢిల్లీ	31750	33957.22	0.47%
కోల్‌కతా	31990	34213.90	0.63%
కేరళ	30250	32352.94	0.33%
బెంగళూరు	30500	32620.32	0.53%
హైదరాబాద్	31080	33240.64	0.19%
గల్ఫ్	137.45	147.00	0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42668.00
ముంబై	₹ 42668.00
ఢిల్లీ	₹ 42668.00
కోల్‌కతా	₹ 42668.00
హైదరాబాద్	₹ 42668.00



10,251 కోట్ల లాభం

రిలయన్స్ ఇండస్ట్రీస్ సరికొత్త రికార్డ్

- రూ.10 వేల కోట్ల లాభం ప్రకటించిన తొలి దేశీయ కంపెనీ

Reliance

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఫలితాల్లో ముఖేష్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) అద్భుతంగా రాణించింది. క్యూ3(అక్టోబర్–నవంబర్)లో కంపెనీ నికర లాభం 8.8 శాతం వృద్ధితో రూ 10,251 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో రూ.9,420 కోట్లుగా ఉంది. దీంతో ఒక త్రైమాసికంలో నికర లాభాన్ని రూ.10వేల కోట్లు క్రాస్ చేసిన తొలి దేశీయ కంపెనీగా రిలయన్స్ రికార్డు సృష్టించింది. ఆదాయం 56 శాతం పెరిగి రూ.1,71,336 కోట్లకు చేరింది. ఈమేరకు కంపెనీ రెగ్యులేటరీ దాఖలులే పేర్కొంది. పన్నులకు ముందు లాభం 9.3 శాతం పెరిగి రూ 14,445 కోట్లుగా నమోదైంది. మూడో త్రైమాసికంలో కంపెనీ అన్ని విభాగాల్లోనూ సంతృప్తికర ఫలితాలను సాధించిందని కంపెనీ వెల్లడించింది. పెట్రో కెమికల్, రిటైల్, టెలికామ్ వ్యాపారాల నుంచి రికార్డు స్థాయి లాభాలను రాబట్టడంతో రిలయన్స్ మంచి లాభాలను నమోదు చేసింది. గతంలో ప్రభుత్వరంగ ఐఒసి(ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్) అత్యంత ఎక్కువ త్రైమాసిక లాభాన్ని ప్రకటించి, దేశీయ కంపెనీల్లో రికార్డు నెలకొల్పింది. అప్పుడు ఐఒసి లాభం రూ.14,512 కోట్లు.. 2013 జనవరి–మార్చి త్రైమాసికంలో ఈ లాభాన్ని నమోదు చేసింది. ఆ సమయంలో ఒకే త్రైమాసికంలో పూర్తి సంవత్సరానికి గాను ఇంధన సబ్సిడీ వసూళ్లు వచ్చిన కారణంగా 2012–13 క్యూ4లో ఐఒసి ఈస్థాయిలో లాభాన్ని నమోదు చేయగల్గింది. అయితే ఇంధన సబ్సిడీ పొందడంలో విఫలం కావడంతో ఐఒసి వార్షిక లాభం రూ.5,005.17 కోట్లు మాత్రమే నమోదు చేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రెవెన్యూలో 56 శాతం వృద్ధిని చూపింది.

దుమ్మురేపిన జియో



రిలయన్స్ జియో మూడో త్రైమాసికంలో దుమ్మురేపింది. జియో లాభం 22.1 శాతం వృద్ధితో రూ.831 కోట్లు నమోదు చేసింది. ప్రస్తుతం జియోకు 28 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. ప్రపంచలోని అతి పెద్ద మొబైల్ డాటా నెట్‌వర్క్‌గా అవతరించే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. జియో ప్రయాణం అద్భుతంగా ఉందని, అంచనాలను మించి రాణించిందని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ అన్నారు. నిర్వహణ రాబడి రూ 10,383 కోట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో జియో రూ 504 కోట్ల నికర లాభం ఆర్జించింది. అందుబాటు ధరల్లో అత్యుత్తమ నాణ్యతతో ప్రతిఒక్కరికీ చేరువ కావాలనే తమ లక్ష్యానికి అనుగుణంగా జియో పయనం సాగుతోందని ముఖేష్ అన్నారు.



Reliance	క్యూ3(2019)	క్యూ2(2019)	మార్పు %
లాభం రూ.కోట్లలో	10,251	9,516	▲ 7.7%
ఆదాయం రూ.కోట్లలో	1.56 Lk	1.43 Lk	▲ 9.1%
ఇబిఐటిడిఎ రూ.కోట్లలో	21,317	21,108	▲ 1%
మార్జిన్ శాతం	13.6%	14.8%	▼ 120 bps

హెచ్‌యుఎల్ లాభం 9 శాతం పెరిగింది



న్యూఢిల్లీ : ఎఫ్‌ఎంసిజి దిగ్గజం హిందుస్తాన్ యునిలీవర్(హెచ్‌యుఎల్) క్యూ3 ఫలితాల్లో రాణించింది. 2018 డిసెంబర్ ముగింపు నాటి క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాల్లో కంపెనీ నికర లాభం రూ.1,444 కోట్లతో 9 శాతం వృద్ధిని సాధించింది. ఈసారి వాల్యూమ్ వృద్ధి పటిష్టంగా ఉండడం వల్ల లాభాలు పెరిగాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో సంస్థ లాభం రూ.1,326 కోట్లుగా ఉంది. అమ్మకాలు ఈసారి 12.42 శాతం పెరిగాయి. గతేడాదిలో రూ.8,323 కోట్లుగా ఉన్న విక్రయాలు ఈసారి రూ.9,357 కోట్లకు పెరిగాయి. ఈమేరకు హెచ్‌యుఎల్ రెగ్యులేటరీ దాఖలులో పేర్కొంది. వాల్యూమ్ వృద్ధి 10 శాతంతో దేశీయ వినిమయ వృద్ధి 13 శాతంగా ఉంది. ఎబిటా మార్జిన్ 170 బేసిస్ పాయింట్లు పెరగ్గా, పిఎటి(ప్రాఫిట్ ఆఫ్టర్ టాక్స్) 17 శాతం వృద్ధిని సాధించిందని హెచ్‌యుఎల్ వెల్లడించింది. ఫలితాలపై హెచ్‌యుఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ మెహతా మాట్లాడుతూ, మరోసారి సంస్థ పటిష్టమైన లాభాలను నమోదు చేసిందని అన్నారు. రెండంకెల వాల్యూమ్ వృద్ధి, మార్జిన్లలో మెరుగుదల ఉందన్నారు. ఈ ఫలితాల నేపథ్యంలో స్టాక్‌మార్కెట్లో కంపెనీ షేరు విలువ 1.27 శాతం నష్టపోయి రూ.1750 వద్ద ముగిసింది.

రూ.700 కోట్ల పెట్టుబడికి సిద్ధం



- షరతులకు అంగీకరిస్తేనే
- జెట్ ఎయిర్‌వేస్‌పై నరేష్ గోయల్

న్యూఢిల్లీ: పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన ప్రైవేటు విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్‌లో రూ.700 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, అది కూడా షరతులకు అంగీకరిస్తేనని సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ నరేష్ గోయల్ తెలిపారు. విమాన సంస్థలో తన వాటా 25 శాతానికి తగ్గకూడదని షరతు విధించారు. ఈమేరకు నరేష్ గోయల్ ఎస్‌బిఐ ఛైర్మన్ రజనీష్ కుమార్‌కు లేఖ రాశారు. అలాగే ఆదుకుంటామని చెప్పిన జెట్ ఎయిర్‌వేస్‌లోని భాగస్వామి ఎతిహాద్ కూడా ఇలాంటి షరులనే విధించింది. కాగా తన మొత్తం షేర్లను తనఖా పెట్టి రూ.700 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమేనని, అయితే ఈ మొత్తంతో కంపెనీలో తన వాటా 25 శాతానికి తగ్గకూడదని గోయల్ షరతు విధించారు. తన షరతుల అమలు ఒకవేళ సాధ్యం కాకపోతే తాను కంపెనీలో పెట్టుబడులు, షేర్లను తాకట్టు సాధ్యం కాదని అన్నారు. లేకపోతే టేకపోతే నిబంధనలు అమలు చేయకుండా కంపెనీలో తన వాటాలను 25 శాతానికి పెంచుకొనేలా సెబీ మినహాయింపును ఇవ్వాల్సి ఉంటుందని ఎస్‌బిఐ ఛైర్మన్‌కు రాసిన లేఖలో గోయల్ వివరించారు. జెట్ ఎయిర్‌వేస్‌కు ఎస్‌బిఐ నేతృత్వంలోని బ్యాంకర్ల కన్సార్టియం రుణాలను ఇచ్చింది. జెట్ ఎయిర్‌వేస్ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుండటంతో వాటాదారులు దీని పరిష్కారానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా జెట్ ఎయిర్‌వేస్‌లో 49 శాతం వాటాల కొనుగోలు చేసేందుకు.. నరేష్ గోయల్, ఆయన కుటుంబ సభ్యులు కంపెనీలో యాజమాన్యం నుంచి పూర్తిగా వైదొలగాలని ఎతిహాద్ కోరిన విషయం తెలిసిందే. ప్రస్తుత మార్కెట్ విలువ కంటే 40 శాతం తక్కువగా జెట్ ఎయిర్‌వేస్ షేరుకూ రూ.140–150ను ఎతిహాద్ ఆఫర్ చేస్తూ.. పలు షరతులను విధించింది



ఎల్‌ఐసి సౌత్ సెంట్రల్ జోన్ ప్రీమియం వసూళ్లు రూ.35,000 కోట్లు

ఎల్‌ఐసి జోనల్ మేనేజర్ టిసి సుశీల్ కుమార్

మన తెలంగాణ/ హైదరాబాద్: డిసెంబర్ ముగింపు నాటి త్రైమాసికంలో ఎల్‌ఐసి సౌత్ సెంట్రల్ జోన్ దాదాపు రూ.35 వేల కోట్లను ప్రీమియంను వసూలు చేసింది. ఈమేరకు ఎల్‌ఐసి(లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) జోనల్ మేనేజర్ టిసి సుశీల్ కుమార్ ప్రకటించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలు ఎల్‌ఐసి సౌత్ సెంట్రల్ జోన్ పరిధిలోకి వస్తాయి. జోన్ పనితీరుపై సుశీల్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ.55 వేల కోట్లను వసూలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్‌ఐసి కొత్తగా ప్రారంభించిన 'జీవన్ శాంతి' స్కీమ్‌కు మంచి స్పందన ఉందని, ఈ ఒక్క ప్రొడక్ట్ ద్వారానే జోన్‌కు కొత్త బిజినెస్ ప్రీమియం రూ.750 కోట్లు వచ్చిందని అన్నారు. ఇది ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ.2 వేల కోట్లను తాకనుందని, దీనికి గాను ఎల్‌ఐసి సౌత్ సెంట్రల్ జోన్ మార్కెటింగ్ సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. డెత్, మెచ్యూరిటీ క్లెయిమ్‌లు, వార్షిక, ఇతర చెల్లింపుల మొత్తం డిసెంబర్ నాటికి రూ.25 వేల కోట్లు దాటింది. ఎల్‌ఐసి డెత్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరిస్తోందని కుమార్ అన్నారు. జోన్ వృద్ధిలో మధ్యవర్తుల పాత్రను కుమార్ గుర్తుచేశారు. సౌత్ సెంట్రల్ జోన్‌లో 1,385 ఏజెంట్లు అమెరికాలో మిలియన్ డాలర్ రౌండ్ టేండ్ అర్హత సాధించారని సంస్థ తెలిపింది.

క్యూ3 ఫలితాల జోష్

52 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. గరిష్ట స్థాయిలలో అమ్మకాలు ఎదురుకావడం, ప్రధాన ఇండెక్స్ కౌంటర్లలో అమ్మకాల కారణంగా సూచీలు ఒడిదుడుకులు ఎదుర్కొన్నాయి. ఆఖరికి సెన్సెక్స్ 52.79 పాయింట్లు లాభపడి 36374 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 14 పాయింట్లు పెరిగి 10905.20 వద్ద స్థిరపడింది. 45.10 పాయింట్ల లాభాలను గడించిన బ్యాంక్ నిఫ్టీ 27528.80 వద్ద ముగిసింది. ఐరోపా మార్కెట్లు నష్టాలతో ప్రారంభం కావడం దేశీయంగా ప్రభావం చూపాయి. దీంతో మిడ్ సెషన్ తర్వాత నష్టాల్లోకి చేరుకున్న సూచీలకు దిగువ స్థాయిలో కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో చివరకు స్వల్ప లాభాలను నమోదు చేస్తూ ట్రేడింగ్‌ను ముగించాయి. ఎఫ్‌ఎంసిజి, హెల్త్‌కేర్, మెటల్స్ సెక్టార్లు నష్టపోయాయి. ఆయిల్ అండ్ గ్యాస్, టెక్నాలజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రంగాల్లోని షేర్లు లాభాలను గడించాయి. ప్రధానంగా బిపిసిఎల్, గెయిల్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, భారతీ ఇన్‌ఫ్రాటెల్ టాప్ గెయినర్‌లుగా నిలిచాయి.



టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
బిపిసిఎల్	357.00	346.05	355.20	347.25	7.95	2.29
గేయిల్	333.40	326.30	332.40	325.50	6.90	2.12
యాక్సిస్ బ్యాంక్	680.00	665.60	676.65	664.00	12.65	1.91
హెచ్‌సిఎల్ టెక్	957.00	933.10	954.70	938.25	16.45	1.75
భారతీ ఇన్‌ఫ్రాటెల్	282.35	276.40	280.45	275.85	4.60	1.67
హెచ్‌డిఎఫ్‌సి	2,007.00	1,979.05	2,004.55	1,975.00	29.55	1.50
హెచ్‌పిసిఎల్	246.40	240.75	244.20	240.60	3.60	1.50
కోటాక్ మహేంద్ర	1,225.05	1,200.00	1,219.95	1,202.75	17.20	1.43
ఐఒసి	138.30	135.30	137.65	135.80	1.85	1.36
ఆదాని పోర్ట్స్	395.45	386.50	394.50	389.30	5.20	1.34

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
సన్ ఫార్మా	455.40	422.50	426.55	453.80	27.25	6.00
యస్ బ్యాంక్	209.55	200.25	201.50	208.35	6.85	3.29
జీ ఎంటర్‌టేయిన్	457.05	434.20	440.90	452.10	11.20	2.48
ఎస్‌బిఐ	304.35	295.60	297.40	303.15	5.75	1.90
ఐచర్ మోటర్స్	20,847.75	20,160.45	20,369.95	20,735.70	365.75	1.76
బజాజ్ ఫిన్‌సర్వ్	6,485.00	6,336.05	6,359.00	6,464.85	105.85	1.64
ఇండియాబుల్స్	853.45	811.05	816.75	829.60	12.85	1.55
బజాజ్ ఫైనాన్స్	2,586.55	2,527.05	2,535.90	2,569.85	33.95	1.32
హెచ్‌యుఎల్	1,779.25	1,742.50	1,751.50	1,772.55	21.05	1.19
హిందల్కో	208.70	205.30	206.00	208.40	2.40	1.15

> నేను తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు నా సీనియర్‌తో మొదటిసారి ప్రేమలో పడ్డాను. నా స్నేహితులతో పోలిస్తే నా ప్రేమ వ్యవహారం కాస్త ఆలస్యమైందనే చెప్పాలి. కానీ నా బాయ్‌ఫ్రెండ్ చదువుకు ఆటంకం కలుగుతుందని చెప్పి నన్ను వదిలేశాడు.
>
> –హీరోయిన్ తాప్సీ

ఆ సన్నివేశాలే చిత్రానికి ఆయువుపట్టు

లావైపోకుండా ఉండాలంటే కొంతైనా వెనక్కి ఇచ్చేయాలని 'శ్రీమంతుడు'లో మహేష్ బాబు చెప్పిన మాటను అంత తేలికగా మర చిపోలేము. శ్రీమంతుడి ఫార్ములా గ్రాండ్ సక్సెస్ అయింది. ఇప్పుడు అదే ఫార్ములాతో 'మహర్షి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారా? అంటే అవుననే అంటున్నారు. 'శ్రీమంతు డు'లో మహేష్ మిలియనీర్ కొడుకుగా కని పించారు. లగ్జరీ లైఫ్, భారీ సంపద, చుట్టూ పనివాళ్లు... ఇలా అన్నీ ఉన్నా ఏదో తెలియని వెలితి. ఈ నేపథ్యంలో మహేష్ తన తండ్రి పుట్టి పెరిగిన ఊరిని దత్తత తీసుకొని ఎలా అభివృద్ధి చేశారనేదే ఈ చిత్రం. అయితే ఇప్పుడు మహేష్ కథానాయకుడిగా నటి స్తున్న 'మహర్షి' చిత్రానికి దర్శకుడు వంశీ పైడిపల్లి ఎంచుకున్న కథాంశంపై ఆసక్తికర చర్చ సాగుతోంది. దిల్‌రాజు, అశ్వనీదత్, పివిపి ప్రసాద్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. ఇందులో మహేష్ స్నేహితునిగా అల్లరి నరేష్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. స్నేహితుని కోసం మహేష్ తనకున్న ఆస్తు లన్నీ వదులుకొని గ్రామానికి వస్తారని.... అక్కడున్న పేదరికాన్ని, మనుషులను చూసి చలించిపోయి గ్రామాన్ని అభివృద్ధి చేయడం మొదలుపెడతారట. ఈ క్రమంలో విలన్ గ్యాంగ్ అతనికి అడ్డు తగలడం, వారికి మహేష్ బుద్ధి చెప్పడం అటుపై కథేంటో తెరపై చూడాల్సిందేనట. ఇక ఈ చిత్రం చివరి షెడ్యూల్ పొల్లాచ్చీలో ప్రారంభమైంది. ఇక్కడే అల్లరి నరేష్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని తెలిసింది. ఈ సన్నివేశాలే చిత్రానికి ఆయువుపట్టని సినిమా యూనిట్ చెబుతోంది.



మహేష్‌బాబు



అఖిల్

ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా..

అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై వెంకీ అట్లూరి దర్శకత్వంలో బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. తమన్ సంగీత సారథ్యంలో రూపొందిన ఆడియో ఇటీవల విడుదలై సూపర్ హిట్ అయ్యింది. కాగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్ష న్‌ను శనివారంనాడు హైదరాబాద్‌లోని జెఆ ర్‌సి కన్వెన్షన్ సెంటర్‌లో గ్రాండ్‌గా నిర్వ హించబోతున్నారు. ఈ వేడుకకు స్టార్ హీరో ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ చిత్రాన్ని రిపబ్లిక్ డే కానుకగా జనవరి 25న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అఖిల్ సరసన నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటి స్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సిని మాటోగ్రఫీః జార్జ్ సి.విలియమ్స్, ఎడిటింగ్ః నవీన్ నూలి, పాటలుః శ్రీమణి, కొరియో గ్రఫీః శేఖర్, ఆర్ట్ః అవినాష్ కొల్లా.

అదే ఫార్ములాను అనుసరిస్తుందట

అటు కోలీవుడ్ ఇటు టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న భామ తమన్నా. సక్సెస్, ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ సినిమాలు చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. అయితే ఈమధ్య తమన్నా కొన్ని ఫెయిల్యూర్స్‌ను చవిచూసింది. కల్యాణ్‌రామ్‌తో చేసిన 'నా నువ్వే'. సందీప్ కిషన్, నవదీప్ వంటి యంగ్‌స్టార్స్‌తో రెచ్చిపోయి ఆన్‌స్క్రీన్ రొమాన్స్ చేసిన 'నెక్స్ట్ ఏంటి' సినిమాలు ఆమెను బాగా నిరాశపరిచాయి. అయితే తాజాగా వచ్చిన మల్టీస్టారర్ 'ఎఫ్2' తమన్నాకు ఊరటనిచ్చింది. ఈ చిత్రంలో వెంకటేష్‌కు జోడీగా నటించింది ఈ మిల్కీ బ్యూటీ. దీంతో ఇదే ఫార్ములాను ఆమె అనుసరించాలనుకుంటోందట. స్టార్ హీరోల సినిమాలపై ఫోకస్ పెట్టాలనుకుంటోందని తెలిసింది. యంగ్ హీరోల సినిమాల్లో ఐటమ్‌సాంగ్స్‌కు మాత్రమే ఓకే చెప్పాలని నిర్ణయించుకుందట. అగ్ర హీరోల సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నించాలని తమన్నా భావిస్తోంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి చిత్రం 'సైరా'లో ఓ ముఖ్య పాత్రలో నటిస్తోంది తమన్నా. అయితే ఈ భామ లీడ్ రోల్ పోషించిన 'దటీజ్ మహాలక్ష్మి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. 'ఎఫ్2' సక్సెస్‌తో ఈ ఏడాదిని ఘనంగా ప్రారంభించిన తమన్నా వరుసగా మంచి విజయాలను అందుకోవాలని కోరుకుంటోంది.



తమన్నా



ఎల్.వి.ప్రసాద్ 111వ జయంతి ఉత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాల-కృష్ణ. చిత్రంలో రమేష్ ప్రసాద్, గీతాంజలి.

ఎల్.వి.ప్రసాద్ ఎంతో మందికి స్ఫూర్తి

అక్కినేని లక్ష్మీ వరప్రసాద్ (ఎల్.వి.ప్రసాద్) 111వ జయంతి ఉత్సవం హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్ర మంలో నందమూరి బాలకృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సంద ర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ''భారత చిత్ర పరిశ్రమలో ఎల్.వి.ప్రసాద్ గురించి చెప్పడమంటే సూరీడికి వెలుగు చూపించడమే. ఆయన ఒక వ్యవస్థ. నటుడు కావాలను కున్న ఆయన పలు చిత్రాల్లో నటించారు. దర్శకుడిగా మారారు. ఆయన సినిమా రంగంలో తనకు ఇష్టమైన అన్ని శాఖల్లో రాణించారు. ఇక ప్రసాద్‌ల్యాబ్స్ అనే గొప్ప సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. ఐ ఇనిస్టి ట్యూట్‌ను ఏర్పాటు చేశారు. ఎల్.వి.ప్రసాద్ ఎంతో మందికి స్ఫూర్తి''అని అన్నారు.

ఎల్.వి.ప్రసాద్ తనయుడు రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ ''మా నాన్నకు సినిమా తప్ప మరేమీ తెలియదు. ఇంట్లో వాళ్లను కూడా ఎక్కువగా కలిసేవారు కాదు. ఒక స్టూడి యో నుంచి మరో స్టూడియోకు వెళ్లే దారిలోనే ఆయన రెస్ట్ తీసుకునేవా రు. మా నాన్నకు పృథ్వీరాజ్‌కపూర్ కుటుంబం అంటే చాలా ఇష్టం. వాళ్లలాగా మా కుటుంబం కూడా సినిమాల్లోనే ఉం డాలని కోరుకునేవారు''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైవిఎస్ చౌదరి, గీతాంజలి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో షూటింగ్ షురూ



కార్తికేయ

'ఆర్ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ హీరోగా జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్స్, స్ప్రింట్ టెలీ ఫిలిమ్స్ సంయుక్తంగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అర్జున్ జంధ్యాల దర్శకత్వం లో అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి నిర్మి స్తున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఒంగోలులో ప్రారంభమైంది. ఈ సందర్భంగా హీరో కార్తి కేయ మాట్లాడుతూ ''ఆర్ఎక్స్ 100 తర్వాత చాలా కథలు విన్నాను. వాటిలో నాకు అర్జున్ జంధ్యాల చెప్పిన కథ బాగా నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశాను. సినిమా రెగ్యు లర్ షూటింగ్ ఒంగోలులో మొదలైంది''అని అన్నారు. దర్శ కుడు అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ ''ఫిబ్రవరి 8 వరకు ఒంగోలు పరిసరాల్లో షూటింగ్ జరుగుతుంది. ఈ షెడ్యూ ల్‌లో కీలక సన్నివేశాలను, రెండు పాటలను తెరకెక్కిస్తాం. సినిమా టైటిల్‌ను త్వరలోనే వెల్లడిస్తాం''అని చెప్పారు. ఈ చిత్రానికి కెమెరామెన్ః రామ్, సంగీతంః చైతన్య భరద్వాజ్, ఆర్ట్ః శేఖర్.

23న యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రారంభం



పూరీ జగన్నాథ్, రామ్

యంగ్ హీరో రామ్, దర్శకుడు పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందే ఈ చిత్రం ఈనెల 23న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. 24 నుంచి హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడతారు. హీరో రామ్‌ను ఈ చిత్రంలో స్టైలిష్‌గా చూపించబోతున్నారు పూరీ జగన్నాథ్. ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్‌లోని మారిపోయారు రామ్. పూరీ జగన్నాథ్ సొంత నిర్మాణ సంస్థ పూరీ టూరింగ్ టాకీస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. వేసవి సెల వుల సందర్భంగా మే నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేశారు



andrea jeremiah

బ్లాక్ అండ్ బ్లాక్ అందాలు

'తడాఖా' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన తమిళ ముద్దుగుమ్మ ఆండ్రియా. ఇటీవల 'విశ్వరూపం 2' సినిమాలో కమల్‌హాసన్‌తో ఆన్‌స్క్రీన్ రొమాన్స్ చేసి అలరించింది ఈ భామ. తమిళ్, మలయాళంలో వరుసగా సినిమాలు చేస్తున్న ఈ ముద్దుగుమ్మ తన అందచందాలు, గ్లామర్‌తో ప్రేక్షకులను మురిపిస్తోంది. కథ డిమాండ్ చేస్తే హద్దులు మీరి అందాలొలికించడానికి ఏమాత్రం వెనుకాడదు ఈ భామ. 'తడాఖా'లో సంప్రదాయబద్ధంగా, హుందాగా కనిపించిన ఈ భామ సిద్ధార్థ్‌తో నటించిన 'గృహం' సినిమాలో హాట్ హాట్‌గా దర్శనమిచ్చింది. ఇకపోతే తాజాగా ఆండ్రియా సోషల్ మీడియాలో తన ఫొటోను పోస్ట్ చేసింది. బ్లాక్ అండ్ బ్లాక్ డ్రెస్సులో తన అందాలతో ఈ బ్యూటీ మైమరపించింది. ఆండ్రియా ఒంపుసొంపులు కుర్రకారును ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

సైనికుడు 'సరిహద్దు'కే కాదు దేశానికే రక్షకుడు

మనిషికి, మనిషికీ... దేశాలకు, ప్రాంతాలకు మధ్య కొన్ని హద్దులు ఉంటాయి. ఎవరి పరిధిలో వాళ్లున్నంత వరకు అవి సరిగానే ఉంటాయి. కానీ ఒక్కసారి ఆ సరిహద్దులు అతిక్రమిస్తే సంఘర్షణ మొదలవుతుంది. దేశాలు, ప్రాంతాల మధ్య ఈ సరిహద్దు సంఘర్షణలు తీవ్ర పరిణామాలకు దారి తీయవచ్చు. అలా మారకుండా చూసే శక్తి సైన్యం. సైనికుడు సరిహద్దుకే కాదు దేశానికే రక్షకుడు అనే కాన్సెప్ట్‌తో తనీష్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. ఈ యంగ్ హీరో గత చిత్రం 'రంగు'తో విమర్శకుల ప్రశంసలను అందుకున్న కార్తికేయ ఈ చిత్రానికి దర్శకుడు. 'సరిహద్దు' టైటిల్‌తో ఈ చిత్రం తెరకెక్కనుంది. తెలుగుతో పాటు హిందీలోనూ విడుదల కానున్న ఈ చిత్రం షూటింగ్ మార్చి 16 నుండి ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో తెలుగుతో పాటు హిందీ భాషా నటులు కూడా నటిస్తారు.




తనీష్

ఘాటుగా స్పందించిన రకుల్



రకుల్‌ప్రీత్ సింగ్

రొటీన్‌గా కనిపిస్తే ఎవరు చూస్తారని కొంచెం డిఫరెంట్‌గా కనిపించేందుకు హీరోయిన్లు తాపత్రయపడుతున్నారు. ఈ విషయంలో బాలీవుడ్ ముద్దుగుమ్మలే కాదు టాలీవుడ్ ముద్దుగుమ్మలు కూడా ఏమాత్రం తగ్గడం లేదు. అప్పట్లో బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ షార్ట్‌లెంత్ నిక్కరులో కనిపిస్తే అది హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు సీనియర్ నాయిక రకుల్‌ప్రీత్ సింగ్ అదే తరహాలో స్పీడు చూపించింది. తాజాగా రకుల్ డెనిమ్ లుక్‌లో దర్శనమిచ్చింది. చిట్టి పొట్టి బ్లూ డెనిమ్ నిక్కరులో రకుల్ కారు దిగుతున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ లుక్‌పై నెటిజన్లు కొందరు ఘాటుగా స్పందించారు. ఓ నెటిజన్ అయితే బూతు కామెంట్ చేశాడు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన రకుల్ తనదైన శైలిలో ఘాటుగా సమాధానమిచ్చింది. ''మీ అమ్మ నీకు ఇలాంటివే నేర్పిస్తున్నారా? కొన్ని మంచి విషయాలను కూడా నేర్పించమని అడుగు. నీలాంటి వాళ్లు ఉన్నంత వరకు ఆడవాళ్లకు రక్షణే ఉండదు''అని రకుల్ పేర్కొంది. అయితే తల్లిని అనడం సబబు కాదని... రకుల్ ఈవిధంగా మాట్లాడి మరింత దిగజారిపోయారని కొందరు నెటిజన్లు చురకలంటిస్తున్నారు.





ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

జమిందారీ చట్టంలో ఉన్న విధానాలేమిటీ?

మహ్మద్ ఇక్బాల్

- విద్యాభివృద్ధి ద్వారా ముస్లింలలో సంస్కరణలు తీసుకుని రావచ్చు అని భావించేవారు.
- 'సారే జహాసె అచ్చా' అనే గీతాన్ని రచించాడు. దీనిని స్వర కల్పన చేసినది విష్ణుదిగంబర పలుష్కార్ (శాస్త్రి).
- పంజాబ్, కాశ్మీర్, సింధు, బెలుచిస్తాన్‌లను కలిపి ఒక ముస్లిం దేశం ఏర్పాటు చేయాలిని దానికి పాకిస్తాన్ అని పేరు పెట్టాలని మొదటిసారిగా పేర్కొన్నాడు.
- పాకిస్తాన్ పదాన్ని అధికారికంగా రహమత్ అలీ లండన్ ప్రకటించాడు.
- ఇంక్విలాబ్ జిందాబాద్ (విప్లవం వర్ధిల్లాలి) అనే పదమును మహ్మద్ ఇక్బాల్ మొట్టమొదటిసారిగా ఉపయోగించాడు.
- ఈ పదాన్ని వ్యాప్తి చేసిన వారు హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్ఆర్ఏ), ఉదా : భగత్‌సింగ్, బి.కె. దత్.

పార్శి సంస్కరణలు

- పార్శిలలో బహుభార్యాత్వం, పరదా విధానం ఉండేది.
- మహిళలకు ఆస్తి హక్కు ఉండేది కాదు.
- వాళ్ల సంస్కరణల కొరకు నౌరోజీ ఫెర్దుంజీ, రెహ్నామాయి మజదాయసన సభను ఏర్పాటు చేసాడు.
- దాదాభాయ్ నౌరోజీ రుస్తుంజీ, కామ, ఈ సభలో చేరి పార్శి సంస్కరణల కొరకు పోరాటం చేశారు.
- పాడియా, టాటా మొదలగువారు 'ద పార్శి' అనే పత్రిక ద్వారా సంస్కరణల కొరకు ప్రయత్నించారు.

గిరిజన తిరుగుబాట్లు : కారణాలు

- డికూలు (మైదాన ప్రాంతం నుంచి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి గిరిజన భూములను ఆక్రమించేవారు).
- ముట్టదారి, కుంతకట్టి విధానాలు రద్దు అవుట (ఉమ్మడి కుటుంబ విధానం రద్దు అవడం).
- పుల్లరి, ముల్లని పన్నులు గిరిజనులపై విధించుట.
- క్రిస్టియన్ మిషనరీ కార్యకలాపాలు.

రైతు ఉద్యమాలు : కారణాలు

- **తిన్‌కథియా :** దీని ప్రకారము రైతు తన వద్ద ఉన్న భూమిలో 3/20 వంతు నీలి మందును పండించాలి.
- ఈ నీలి మందును బ్రిటీష్ వారు నిర్ణయించిన ధరకు ముఫాజల్ (మార్కెట్)లో మాత్రమే అమ్మాలి.
- **1793 శాశ్వత శిస్తు వసూలు చట్టం :** శాశ్వత శిస్తు పరిష్కార చట్టం లేదా జమిందారీ చట్టం. దీని ప్రకారం రైతు భూమి యొక్క యాజమాన్యపు హక్కులను కోల్పోయాడు. కేవలం కౌలుదారుడుగా మిగిలాడు. శిస్తు వసూలు చేసే వారికి యాజమాన్య హక్కులు ఇవ్వబడ్డాయి. అతనిని జమిందారు అంటారు.

విధానాలు :

1. నజరానా – పునరుద్ధరణ రుసుము
2. బెదాఖ్లి – శిస్తు చెల్లించకపోతే బలవంతంగా భూమి నుంచి తొలగించడం.
3. వెట్టి – ఉచితంగా పనులు చేయడం.

తూర్పు భారతదేశంలో రైతు ఉద్యమాలు

- గోవిందాపూర్ (1859 – 60) – విష్ణుబిశ్వాస్, దిగంబర్ బిశ్వాస్.
- పాబ్నా (1874) – కుడిమల్ల ఇషాన్‌చంద్రరాయ్.
- హరీష్ చంద్రముఖర్జీ హిందూపేట్రియాట్ అనే పత్రిక ద్వారా రైతుల సమస్యలను తెలియజేసేవాడు.
- దీనబంధు మిత్ర – నీల్‌దర్పణ్ అనే నాటకంను రచించి బ్రిటీష్ వారి యొక్క అణిచివేత విధానాలను రైతుల సమస్యలను తెలియజేసాడు.

ఉత్తర భారతదేశం

- **ఉత్తరప్రదేశ్ కిసాన్ సభ :** 1918 – గౌరీశంకర్ మిశ్రా, ఇంద్ర నారాయణ్ త్రివేది. మదన్‌మోహన్ మాలవ్య ఇందులో సభ్యుడిగా చేరి దీనియొక్క 500 శాఖలను ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశాడు.
- **ఆల్ ఇండియా కిసాన్ సభ :** స్వామి సహజానంద, ఎన్.జి. రంగా దీని యొక్క మొట్టమొదటి సమావేశం లక్నోలో జరిగింది.
- ఎన్.జి. రంగా ఆంధ్రప్రదేశ్‌లో రైతుల శిక్షణ కోసం నిడుబ్రోలు (గుంటూరు) వద్ద ఒక శిక్షణ కేంద్రాన్ని ఏర్పటు చేశాడు.
- బాబా రామచంద్ర 20 శతాబ్ది ఆరంభంలో ఉత్తరప్రదేశ్‌లో రైతు ఉద్యమాలను చేపట్టాడు. ఇతను అవధ్ కిసాన్‌సభను ఏర్పాటు చేశాడు.
- మదర్‌పార్శీ ఉత్తరప్రదేశ్‌లో ఎకా అనే ఉద్యమాన్ని చేపట్టాడు.
- పంజాబ్ నవజవాన్ భారత్‌సభ. దీనిని 1926లో భగత్‌సింగ్, యశ్‌పాల్, చబిల్‌దాస్ స్థాపించారు.
- పంజాబ్ రైతు ఉద్యమ కాలంలో బంకదయాల్ రచించిన పగడి సంబాల్ ఓ జట్టా అనే పాట అత్యంత ఆదరణ పొందినది.

పశ్చిమ భారతదేశం

- **గుజరాత్ : ఖేదా :** 1917 – 18 మోహన్‌లాల్ పాండ్య తర్వాత గాంధీజి.
- **బోర్సాద్ :** 1924 వల్లభాయ్‌పటేల్ నేతృత్యం.
- **బార్డోలి :** 1928 ముందుగా పట్టీదార్ యువక్‌మండలి సభ్యులు కున్వర్ జీమెహత, కల్యాణ్‌జీమెహత తర్వాత వల్లభాయ్‌పటేల్.
- **మహారాష్ట్ర :** పూనా సార్వజనిక్ సభ – 1876 మహదేవ్ గోవింద్‌రణడే.
- రామోసిన్ – 1879 వాసుదేవ బల్వంత పాడ్కే.
- వాసుదేవ బల్వంత్ పాడ్కే శిష్యులు – తిలక్, చాపేకర్ సోదరులు.

దక్షిణ భారతదేశం

- **మోప్లా :** 1921 – 22 మలబార్ ప్రాంతం (కేరళ) కున్‌అహ్మద్‌హాజ్ కానీ మతపరమైన కారణాలు పేర్కొంటూ బ్రిటీష్ వారు దీనిని అణచివేశారు.

న్యాయ, ఆత్మ గౌరవ ఉద్యమాలు

- ఆర్యుల సంస్కృతిని తూర్పు భారతదేశానికి వ్యాప్తి చేసినవాడు – వైదేహుడు.
- ఆర్యుల సంస్కృతిని దక్షిణ భారతదేశానికి వ్యాప్తి చేసినవాడు – అగస్త్యుడు.
- మద్రాస్ రాష్ట్ర లేదా ద్రావిడ ప్రాంతంలో బ్రాహ్మణుల ఆదిపత్యం అధికంగా ఉండేది.
- 20 శతాబ్దం ప్రారంభంలో మద్రాస్‌లో జరిగిన ఓ సర్వే ప్రకారం మద్రాస్‌లో బ్రాహ్మణులు కేవలం 3% ఉండేవారు. కానీ ప్రభుత్వ ఉద్యోగాలలో 90% బ్రహ్మణులు ఉండేవారు.
- దీనిలో బ్రాహ్మణేతరుల అభివృద్ధి కొరకు దక్షిణ భారత ప్రజల సంఘం అనే సంస్థ ఏర్పాటు చేయబడింది.
- దీని స్థాపనలో కీలక పాత్ర పోషించినవారు – త్యాగరాయశెట్టి, ముదలియార్, టి.యం. నాయర్.
- 1917 ఫిబ్రవరిలో ఈ సంస్థ జస్టిస్ అనే పేరుతో పత్రికను ప్రచురించింది.
- 1917 జూలైలో బ్రాహ్మణేతరుల అభివృద్ధి కొరకు జస్టిస్ పార్టీ ఏర్పాటు చేయబడింది.
- జస్టిస్ పార్టీలు భారతదేశంలో బ్రాహ్మణులకు వ్యతిరేకంగా స్థాపించబడిన మొదటి రాజకీయ పార్టీ.
- జస్టిస్ పార్టీ మొదటి సమావేశం జరిగింది – కోయంబత్తూర్.
- ఆంధ్రలో జస్టిస్ పార్టీ మొదటి సమావేశం – బిక్కవోలు (తూర్పుగోదావరి జిల్లా).
- జస్టిస్ పార్టీ బ్రాహ్మణేతరుల సమస్యలను బ్రిటీష్ ప్రభుత్వానికి తెలియజేయుటకై కె.వి. రెడ్డినాయుడు పానగల్లు రాజు మొదలగువారి నేతృత్యంలో ఒక సెలెక్ట్ కమిటీని ఏర్పాటు చేసి లండన్‌కు పంపింది.
- 1919 చట్టం ప్రకారం 1920లో ఎన్నికలు జరిగాయి.
- ఈ ఎన్నికల్లో జస్టిస్ పార్టీ 63 సీట్లు గెలుచుకుని మద్రాస్ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది.
- సుబ్బరాయలు రెడ్డియార్ జస్టిస్ పార్టీ తరపున మద్రాస్ ముఖ్యమంత్రి అయ్యాడు.
- ఇతను బ్రాహ్మణేతరుల అభివృద్ధి కోరకు అనేక చర్యలు తీసుకున్నాడు.
- ఉదా : బ్రాహ్మణేతరులకు విద్యా, ఉపాధిలో రిజర్వేషన్లు కల్పించుట.
- బ్రాహ్మణేతరుల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఋణాలు ఇచ్చుట మొదలగునవి.
- 1921లో సుబ్బరాయలు రెడ్డియార్ ఆరోగ్యం క్షీణించడంతో రాజీనామా చేశాడు.
- దీనితో పీ. రామరాయనింగార్ / రాజా రమణీయం మద్రాస్ ముఖ్యమంత్రి అయ్యాడు.
- ఇతను కూడా బ్రాహ్మణేతరుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నాడు. కానీ ఇవి విఫలం అయ్యాయి.
- ఫలితంగా 1923 ఎన్నికల్లో జస్టిస్ పార్టీకి 44 సీట్లు మాత్రమే వచ్చాయి.
- రామరాయనింగాల్ మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యాడు.
- సిఆర్ దాస్ మరియు మోతీలాల్ నెహ్రూలు స్థాపించిన స్వరాజ్ పార్టీ కార్యకలాపాలు 1923లో మద్రాస్ రాష్ట్రంలో ప్రారంభమయ్యాయి.
- 1926లో జరిగిన ఎన్నికల్లో జస్టిస్ పార్టీ కేవలం 21 సీట్లు మత్రమే గెలుచుకుంది.
- స్వతంత్ర అభ్యర్థి అయిన సి. సుబ్బరాయన్ జస్టిస్ పార్టీ మద్ధతుతో ముఖ్యమంత్రి అయ్యాడు.
- ఈ సమయంలో ఇవి. రామస్వామి నాయర్ (ఇవిఆర్) మద్రాస్ రాష్ట్రంలో ప్రముఖ బ్రాహ్మణేతర నాయకుడు.
- ఇ.వి. రామస్వామి నాయర్ పత్రికలు – కుడి అరసు, విధుతులై.
- ఇ.వి.ఆర్ 1929లో ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభించి హిందూ దేవుళ్లు అయిన రాముడు, కృష్ణుడు తమ దేవుళ్లు కాదని, భిన్నమైన సంస్కృతి, చరిత్ర, భాష కలిగిన ద్రావిడ ప్రాంతంలో ఆర్యుల ఆధిపత్యం చెల్లదని బ్రాహ్మణులను హెచ్చరించాడు.
- 1937లో జరిగిన ఎన్నికల్లో ఐ.యస్.సి విజయం సాధించింది. రాజాజీ మద్రాస్ ముఖ్యమంత్రి అయ్యాడు.
- 1938లో సేలం సభలో భారతదేశం నుండి విడిపోయి ద్రావిడ దేశం ఏర్పడాలని ఇ.వి.ఆర్ డిమాండ్ చేశాడు.
- 1940 కాంచీపురం సభలో ద్రావిడ దేశంనకు ద్రావిడనాడు అను పేరు పెట్టి ఒక ద్రావిడ పటంను కూడా విడుదల చేశాడు.
- మొత్తం దక్షిణ భారతదేశం (హైదరాబాద్ సంస్థానం మినహాయించి), బెంగాల్‌లోని కొన్ని తీరప్రాంతాలు ద్రావిడనాడు కిందికి వస్తాయని పేర్కోన్నాడు.
- రెండవ ప్రపంచ యుద్ధం, అనేక ఇతర కారణాల వల్ల ఇ.వి.ఆర్ 1941లో ద్రావిడనాడు ఉద్యమాన్ని నిలిపివేశాడు.
- జస్టిస్ పార్టీని పునరుద్ధరించడం అసాధ్యం అని భావించిన ఇ.వి.ఆర్ 1944లో జస్టిస్ పార్టీని రద్దు చేసి, దాని స్థానంలో 'ద్రావిడ కజగం' అనే పార్టీని స్థాపించాడు.
- ద్రావిడ కజగం తమిళ జాతీయవాదాన్ని వ్యాప్తి చేసింది.
- 1947 ఆగస్టు 15న భారతదేశం స్వతంత్ర దేశం అయిన తరువాత కూడా తమిళ ప్రజలు ద్రావిడ నాడు దేశ డిమాండ్ చేశారు.

శాకాహారం ఆరోగ్యకరం




చక్కెర, మాంసం సగానికి సగం తగ్గిస్తేనే మేలు

ఆదర్శమైన ఆహారం అంటే తక్కువ తీపి ఉండే పదార్థాలు ఆరగిస్తేనే జీవితకాలం పెరుగుతుందని అందువల్ల చక్కెర వినియోగం సగానికి సగం తగ్గించాలని, అలాగే మాంసం తినడం కూడా బాగా తగ్గించాలని లాన్సెట్ జర్నల్ కొన్ని సూచనలతో నివేదిక విడుదల చేసింది. పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు, గింజలు వంటివి బాగా తీసుకోవాలని సూచించింది. ఈ ఆహారం ఆరోగ్యకరమే కాకుండా పర్యావరణానికి హితమైనదని నివేదిక పేర్కొంది. ఈట్–లాన్సెట్ కమిషన్ ఎలాంటి లాభాపేక్ష లేని స్వతంత్ర సంస్థ. 16 దేశాలకు చెందిన 19 మంది శాస్త్రవేత్తలు, 18 మంది సహరచయితలు, ఇందులో ఉన్నారు. ప్రపంచ స్థాయిలో ఆరోగ్యపరమైన లక్ష్యాలను సాధించాలన్న సంకల్పంతో ఈ సంస్థ పనిచేస్తోంది. సగటున వయోజనునికి రోజూ 2500 కాలరీల ఆహారం అవసరమని, బియ్యం, గోధుమ, కాయధాన్యాల నుంచి 800 కాలరీలు సమకూర్చుకోవాలని, పండ్లు కూరగాయల నుంచి 204 కాలరీలు, ఎద్దుమాంసం, గొర్రె, పంది మాంసాల నుంచి 30 కాలరీలు కన్నా ఎక్కువ తీసుకోరాదని లాన్సెట్ నివేదిక సూచించింది. తీసుకునే ఆహారంలో చక్కెర కానీ కొవ్వు కానీ లేకుండా చూసుకోవాలి. అనారోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ప్రపంచం మొత్తం మీద అనారోగ్యానికి దారి తీస్తుందని అంతే కాకుండా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఏటా 11మిలియన్ అకాల మరణాలను నివారించడానికి దోహద పడుతుందని నివేదిక వివరించింది. ఏయే ఆహారం, ఆహారోత్పత్తుల విధానాలు ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన లక్ష్యాలను నెరవేరుస్తుందో పేర్కొంది. మాంసం నుంచి లభించే ప్రొటీన్లకు బదులుగా చిక్కుళ్లు, బఠాణీ వంటి వాటి నుంచి ప్రొటీన్లు లభిస్తాయని, అలాగే ఎన్నో ప్రత్యామ్నాయాలు ఉన్నాయని నివేదిక వెల్లడించింది. సిఫార్సు చేసిన పరిమితి కన్నా 6.5 రెట్లు ఎక్కువగా మాంసాన్ని ఉత్తర అమెరికా దేశాలు ఆరగిస్తుంటాయి. దక్షిణ ఆసియా వారు మాత్రం సిఫార్సు చేసిన దానికి సగం మాత్రమే ఆరగిస్తారు. అన్ని దేశాల వారు పిండి పదార్థం ఎక్కువగా ఉంటే బంగాళ దుంపలు వంటివి తీసుకొంటుంటారు. సిఫార్సు చేసిన దానికన్నా 1.5 రెట్లు ఎక్కువగా దక్షిణ ఆసియాలోను, సబ్‌సహరాన్ ఆఫ్రికాలో 7.5 రెట్లు ఎక్కువగా తీసుకుంటారు.

ఆహార విధానాల్లో మార్పు అవసరం

ప్రపంచం మొత్తం మీద ఆహార విధానాల్లో మార్పు తప్పనిసరి. 800 మిలియన్ కన్నా ఎక్కువ మంది చాలీచాలని ఆహారంతో సతమతమవుతుండగా చాలామంది అనారోగ్యకరమైన ఆహారాన్ని చాలా ఎక్కువగా తీసుకొంటున్నారు. దానివల్ల వ్యాధులకు గురై అకాల మరణాలు సంభవిస్తున్నాయి. ఆరోగ్యం బాగుండాలంటే కాలరీలు పుష్కలంగా లభించే ఆహారాన్ని తీసుకోవాలి. వివిధ రకాలైన శాకాహారాన్ని తీసుకోవాలి. జంతు సంబంధ మాంసాహారాన్ని చాలావరకు తగ్గించాలి. కొవ్వు పుష్కలంగా ఉండే పదార్థాల కన్నా కొవ్వు లేని పదార్థాలను వాడాలి. చక్కెర కలిగినవి, ఎక్కువగా ప్రాసెస్ చేసినవి వాడరాదు. ఈ సూచనల ప్రకారం ఆహార విధానాలు మార్చుకుంటే 10.9 నుంచి 11.6 మిలియన్ అకాల మరణాలను ఏటా నివారించ వచ్చని లాన్సెట్ నివేదిక వెల్లడించింది.


– సైన్స్ విభాగం



చంద్రునిపై పత్తి మొక్క బతకలేదు

చంద్రుని అవతలవైపు చీకటి ప్రదేశంలో నేలపై కాలిడిన చాంగ్ ఇ–4 వ్యోమనౌక తాను తీసుకొచ్చిన విత్తనాల్లో పత్తి విత్తనం మొలకెత్తినట్టు సంచలనాత్మక ప్రకటన చేసిన 24 గంటల్లోనే ఆ పత్తి మొలక చనిపోయిందని ప్రకటించడం విశేషం. రెండు వారాల్లోనే ఈ ప్రయోగం పరిసమాప్తమైనట్టు చైనా ప్రభుత్వ జిన్హుయా న్యూస్ సంస్థ వెల్లడించింది. రెండు వారాల సుదీర్ఘ రాత్రి వల్ల బయోస్ఫియర్ వాతావరణం లోని మొక్కను బతకకుండా చేసిందని పేర్కొంది. చంద్రుని రాత్రి వాతావరణం మొక్కలను బతకనివ్వని విధంగా ఉంటోందని, మైనస్ 170 డిగ్రీల ఉష్ణోగ్రత కొనసాగడం కూడా ముఖ్య కారణంగా వివరించింది. చంద్రుని వాతావరణంలో శూన్యత ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు ఉష్ణోగ్రతల్లో తేడా కనిపిస్తోంది. అణుధార్మిక ప్రభావం బలంగా ఉంటోంది. కఠినమైన పరిస్థితులు వెంటాడుతున్నాయి. వ్యోమనౌక తీసుకెళ్లిన మొక్కల్లో మిగతా మొక్కల కన్నా పత్తి మొక్క బాగానే మొలకెత్తింది. డ్రోసోఫిల్లా అనే కీటకాలను ఈ ప్రయోగకాలంలో బాగా ఉపయోగించుకున్నారు. భిన్న వాతావరణంలో కీటకాలు లేదా జంతువులు ఎలా మనగలుగుతాయని పరీక్షించారు. కానీ కీటకాలు బాగానే మనగలిగాయి. ఉత్పత్తి తక్కువ సమయమైనప్పటికీ జన్యుపరమైన ప్రభావాన్ని తెలుసుకోడానికి శాస్త్రవేత్తలకు బాగా ఉపయోగపడింది. వచ్చే వంద రోజుల్లో ఎక్కువ మొక్కల విత్తనాల నుంచి మొలకలు మొలకెత్తించడానికి శాస్త్రవేత్తలు అనుకున్నా వారి ఆలోచనల ప్రకారం ప్రయోగం ముందుకు సాగలేదు. అంతరిక్షంలో మొక్కలను పెంచే సామర్థ్యం వృద్ధి చేసుకోవడం రాబోయే అంతరిక్ష యాత్రలకు ముఖ్యంగా అంగారక గ్రహ యాత్రకు ఎంతో అవసరం. చంద్రునిపై ప్రయోగాలు సాఫల్యం కావాలంటే ఉష్ణోగ్రతల తేడాలను నియంత్రించ వలసి ఉంటుంది. వాతావరణం లోపించడం అంటే అతినీలలోహిత కిరణాలు (అల్ట్రావయొలెట్ రేస్) సూర్యుని నుంచి నేరుగా ఎలాంటి వడపోత కానీ ఎలాంటి నియంత్రణ కానీ లేకుండా చంద్రుని ఉపరితలంపై తాకుతాయి. చంద్రునిపై గరిష్ఠ ఉష్ణోగ్రత 127 డిగ్రీల సెంటిగ్రేడ్ (261డిగ్రీల ఫారన్ హీట్) ఉండగా కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 173 డిగ్రీల సెంటిగ్రేడ్ (మైనస్ 279డిగ్రీల ఫారన్‌హీట్). అందుకనే మొక్కల విత్తనాలు మొలకెత్తడానికి అనువైన పరిస్థితులతో రూపొందించిన లూనార్ మిని బయోస్ఫియర్‌ను శాస్త్రవేత్తలు రూపొందించారు. అంతరిక్షంలో చంద్రుని స్థావరాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నంలో ఈ మినీ బయోస్ఫియర్ ఒక భాగం. ఈ చంద్రుని స్థావరం ఆధారంగా 2036 నాటికి చంద్రుని పైకి తప్పనిసరిగా యాత్రికులను పంపాలన్న కృత నిశ్చయంతో చైనా ఉంది. చైనా లోని చాంగ్ కింగ్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో 28 యూనివర్శిటీల పరిశోధకులు ఈ ప్రాజెక్టులో పాలు పంచుకుంటున్నారు.







– సైన్స్ విభాగం

300 మిలియన్ ఏళ్లనాటి భారీ బల్లికి రోబో రూపం

300 మిలియన్ ఏళ్ల నాటి భారీ బల్లి శిలాజానికి శాస్త్రవేత్తలు రోబో రూపం కల్పించారు. ఈ బల్లి అయిదు అడుగుల పొడవు ఉండేది. డైనోసార్లు, క్షీరదాలు, సరీసృపాలు, పక్షులు కన్నా ముందు తరం నాటివని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ శిలాజం ఎలాంటి లోపం లేకుండా స్వచ్ఛంగా ఉండడంతో దీనికి రోబో ఆధార డిజిటల్ స్కాన్లు ఉపయోగించి తిరిగి సజీవ ఆకారాన్ని తెప్పించ గలిగారు. జంతువులు సముద్రం నుంచి భూమిని జయించడానికి ఏ విధంగా ముందుకు కదిలాయో తెలుసుకోడానికి ఈ ప్రయోగం ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ భారీ బల్లి ఒరోబేటెస్ పాబ్స్టి అనే తెగకు చెందినది. 290 మిలియన్ సంవత్సరాల క్రితం ఈ తెగ బల్లులు నివసించేవి. శాస్త్రవేత్తలు వీటి శిలాజాలను భద్ర పర్చిన అడుగుల జాడలతో సరిపోల్చి కంప్యూటర్ల సాంకేతిక పరిజ్ఞానంతో కదలిక కలిగించి రోబో రూపం కల్పించారు. నేలపై దీని కదలిక అలాగే నీటి నుంచి బయటకు రావడం ఇదంతా తమకు అనేక విషయాలు అర్థం చేసుకోడానికి ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



ఆధునిక సరీసృపాలకు దగ్గరి బంధువులైన ఆనాటి తొలి అవశేషాలను రెండు దశాబ్దాల క్రితం జర్మనీలోని తురింగియన్ అటవీ ప్రాంతంలో ఒక క్వారీలో తవ్వి తీశారు. ప్రస్తుతం సజీవంగా ఉన్న నాలుగు రకాల ఉభయచరాలు, సరీసృపాల తెగలను అధ్యయనం చేసి ఈ శిలాజం నడక తీరును తిరిగి సృష్టించ గలిగారు. ఐదడుగుల పొడవున్న ఈ బల్లి నాలుగు కిలో గ్రాముల బరువు ఉంటుంది. దీనికి తోకతో కలిగిన భారీ శరీరం ఉంటుంది. కాళ్లు పొట్టిగా ఉంటాయి. తల చిన్నది. ఇది ఒక విధంగా మొసలి వలె కనిపిస్తుంది.



– సైన్స్ విభాగం



తమిళనాడులో ఉత్సాహంగా జల్లికట్టు

మదురై : తమిళనాడులో గురువారం జల్లికట్టు క్రీడలో ఒకవైపు ఎంతో ఉత్సాహం, ఆనందం వెల్లివిరిసినా, మరోవైపు ఎద్దులతో జరిగిన పోరాటంలో అనేకమంది గాయపడ్డారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఈ ఆట ప్రారంభమైంది. జల్లికట్టు ఆటకు పేరొందిన అలంగానల్లూరులో 900 ఎద్దులను అదుపు చేసేందుకు 800 మంది రంగంలోకి దిగి తమ శక్తి యుక్తులన్నీ ధారపోశారు. వందలాదిమంది ప్రేక్షకులు ఈ పోటీని ఎంతో ఆసక్తితో తిలకించారు. పొగరుబోతు ఎద్దుల్ని అదుపు చేయడంలో విజయం సాధించిన బుల్‌ఫైటర్లకు, పోటీలో లొంగని ఎద్దుల యజమానులకు లక్షలాది రూపాయల విలువ చేసే బహుమతుల్ని అందజేశారు. తిరుచిరాపల్లిలోని అవరంగాడు, పుదుకోట్టై, కరూర్, దిండిగల్ ప్రాంతాల్లో కూడా జల్లికట్టును నిర్వహించారు. ఎద్దుల్ని అదుపు చేయలేక చాలామంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. అనేక గ్రామాల్లో ఎడ్లబండ్ల పోటీలు కూడా నిర్వహించారు. కోయంబత్తూరులో సంప్రదాయక గ్రామీణ నాట్యం ఒయిలాట్టం ప్రదర్శించారు.

అస్థానా సహా ముగ్గురి పదవీకాలం కుదింపు

న్యూఢిల్లీ : సిబిఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ అస్థానా పదవీ కాలాన్ని తక్షణం రద్దు చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వెలువరించింది. సిబిఐలో ప్రస్తుత వివాదం నేపథ్యంలో ఇంతకు ముందు అస్థానాను కేంద్రం బలవంతంగా సెలవుపై ఇంటికి పంపించింది. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో అస్థానా పదవిపై వేటు ఉత్తర్వులు వెలువరించారు. అస్థానాతో పాటు మరో ముగ్గురు సిబిఐ అధికారులు జాయింట్ డైరెక్టర్ అరుణ్ కుమార్ శర్మ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ మనీష్ కుమార్ సిన్హా , ఎస్‌పి హోదాలో ఉన్న జయంత్ జె నయకర్నాలెల్లపై కూడా వేటు పడింది. ఇటీవలే సిబిఐ డైరెక్టర్‌గా ఉన్న అలోక్ వర్మను సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి కేంద్రం తొలగించింది. అగ్నిమాపక దళ డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. అయితే దీనికి మనస్తాపం చెందిన వర్మ పదవికి రాజీనామా చేశారు. నిజానికి ఆయన ఈ నెల చివరి వరకూ పదవిలో కొనసాగాల్సి ఉంది. తాజాగా అస్థానాతో పాటు మరో ముగ్గురు అధికారుల పదవీ కాలాన్ని రద్దు చేసిన కేంద్రం వారిని తక్షణం బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు అధికారిక ప్రకటనలో తెలిపింది.



'సుప్రీం' జడ్జీలుగా మహేశ్వరి, ఖన్నా నేడు ప్రమాణం

న్యూఢిల్లీ: కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా శుక్రవారం సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణస్వీకారం చేస్తారు. బుధవారంనాడు ప్రభుత్వం జస్టిస్ మహేశ్వరి, ఖన్నా నియామకాన్ని నోటిఫై చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ఈ ఇద్దరు న్యాయమూర్తుల చేత శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయిస్తారని ఒక అధికారిక ప్రకటన పేర్కొంది. '2019 జనవరి 18న ఉదయం పదిన్నరకు సుప్రీం జస్టిస్‌లుగా మహేశ్వరి, ఖన్నా ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది' అని ఆ ప్రకటన వెల్లడించింది. ప్రధాన న్యాయమూర్తి గొగోయ్, న్యాయమూర్తులు ఎకె సిక్రీ, ఎస్‌ఎ బోబ్డే, ఎన్‌వి రమణ, అరుణ్ మిశ్రాలతో కూడిన అయిదుగురు సభ్యుల ఎస్‌సి కొలీజియం మహేశ్వరి, ఖన్నాలకు పదోన్నతి కల్పిస్తూ అత్యున్నత న్యాయస్థానంలో నియామకానికి సిఫార్సు చేసింది.

ఓట్ల కోసమే 10 శాతం కోటా: ఏచూరి

న్యూఢిల్లీ: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కేంద్రం 10 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ చట్టం తీసుకు రావడంపై సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మండిపడ్డారు. దీంతో కొన్ని ఓట్లు అయినా గెలుచుకోవచ్చని ఎద్దేవా చేశారు. దురుద్దేశంతో, సరైన ప్రణాళిక లేకుండా చట్టం చేయడం కొన్ని ఓట్లైన కొల్లగొట్టేందుకు విఫలయత్నం చేశారని గురువారం ఏచూరి ట్వీట్ చేశారు. కేంద్ర సంస్థల విస్తరణకు నిధులు ఎందుకు లేవని ఆయన ప్రశ్నించారు. ఈ సంస్థలను ప్రభుత్వం ఎందుకు నాశనం చేయాలనుకుంటోందని తన ట్వీట్‌లో ఏచూరి ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగానే రైతులను నష్టాలకు గురి చేస్తోందని, ఎన్ని నినాదాలు, తమాషాలు ఈ నష్టాన్ని భర్తీ చేయలేవని పేర్కొన్నారు.

దురంతో ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

ఢిల్లీ: జమ్మూ–ఢిల్లీల మధ్య నడిచే దురంతో ఎక్స్‌ప్రెస్ రైలులో దోపిడి జరిగింది. గురువారం తెల్లవారు జామున దేశ రాజధాని ఢిల్లీ నగర సమీపంలో ఆగిన రైల్లోకి ప్రవేశించిన దుండగులు ప్రయాణికుల నుంచి నగలు, నగదు,ఎటిఎం కార్డులు, మొబైల్ ఫోన్లు, బ్యాగులు, బంగారు గొలుసులు,సన్‌గ్లాసెస్‌ను సైతం ఎత్తుకెళ్లారు. అశ్విన్ కుమార్ అనే ప్రయాణికుడు రైల్వే పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దాదాపు 7 నుంచి 10 మంది దుండగులు బి3, బి7 కోచ్‌ల్లోకి ప్రవేశించినట్లు కుమార్ పేర్కొన్నారు. ప్రయాణికుల మెడపై కత్తి పెట్టి విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారన్నారు. 15 నిముషాల వ్యవధిల్లోనే దోపిడీ చేసి పారిపోయినట్లు తన ఫిర్యాదులో కుమార్ పేర్కొన్నారు. సరాయి రోహిల్ స్టేషన్‌కు ముందే సిగ్నల్‌లో సమస్యలు తలెత్తడంతో రైలు ఆగిపోయినట్లు ఆర్‌పిఎఫ్ అధికారులు తెలిపారు. దుండగులు సిగ్నల్‌ను ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారన్నారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నిలకడగా అమిత్ షా ఆరోగ్యం

న్యూఢిల్లీ : స్వైన్‌ఫ్లూతో బాధపడుతూ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న బిజెపి అధ్యక్షులు అమిత్ షా ఆరోగ్యం నిలకడగా ఉందని, ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని పార్టీ ప్రచార కర్త, రాజ్యసభ సభ్యులు అనిల్ బలుని తెలిపారు. అమిత్ షా త్వరగా కోలుకోవాలని కోరుకున్న మీ అందరికీ ధన్యవాదాలు అని పేర్కొన్నారు. బుధవారం షా స్వైన్‌ఫ్లూ కారణంగా అస్వస్థతకు గురైనట్లు ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. వైద్యుల బృందం అమిత్ షా ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని ఎయిమ్స్ డైరెక్టర్ రణ్‌దీప్ గులేరియా తెలిపారు.

మాంజ నిషేధంపై అటవీశాఖ చర్యలు

ఇతర శాఖల సమన్వయంతో సత్ఫలితాలు • 350 కేజీల మాంజ స్వాధీనం

పక్షులకు రక్షణ • 190 దుకాణాల్లో తనిఖీలు • 72 దుకాణాల్లో సీజ్

మన తెలంగాణ / హైదరాబాద్ : సింథటిక్ మాంజ నిషేధానికి సంబంధించి రాష్ట్ర అటవీశాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయని ఆ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. మాంజ వినియోగంపై ఇతర శాఖల సమన్వయంతో చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలను అందించాయన్నారు. ఇందులో భాగంగా మాంజ వినియోగానికి ఈ ఏడాది భారీ స్థాయిలో అడ్డుకట్ట వేశామనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తంచేశారు. ఈ నెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు చేపటిన ప్రత్యేక చర్యల కారణంగా అనేక కిలోల మాంజను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆపదలో చిక్కుకున్న పలు రకాల పక్షులను కూడా రక్షించినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను ప్రకటన ద్వారా అటవీశాఖ అధికారులు గురువారం విడుదల చేశారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం పోలీస్, సాంస్కృతిక, కాలుష్య నియంత్రణ బోర్డుల సహకారంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సింథటిక్ మాంజ నిషేధంపై విశేషంగా కృషి చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు చైనా మాంజ నిషేధంపై ప్రభుత్వం పగడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే అటవీశాఖ ప్రత్యేకంగా నిఘా బృందాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను అవగాహన చేసేందుకు పోస్టర్లను అంటించినట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు పూర్తిస్థాయిలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో 870 పోస్టర్ల ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించినట్లు చెప్పారు. తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు హిందీ భాషల్లో ఈ పోస్టర్లను ముద్రించి ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సింథటిక్ మాంజ వల్ల కలిగే నష్టాలతో పాటు పక్షులు, పర్యావరణానికి జరిగే హానికి సంబంధించిన అంశాలను ఈ సందర్భం గా పలు





స్వచ్ఛంద సంస్థలు వివరించారు. దీంతో పాటు నగరంలోని 190 దుకాణాల్లో తనిఖీలు చేసి 72 దుకాణాల నుంచి 350 కేజీల మాంజను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ప్రధానంగా దూల్‌పేట, చార్మినార్, సికింద్రాబాద్, నాంపల్లి, ముషిరాబాద్, జగద్గిరిగుట్ట, టపాచపుత్ర, హుస్సేని ఆలం, రాంకోఠి, తిరుమలగిరి, అంబర్‌పేట, గోల్‌నాక, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు తెలిపారు. మాంజ నిషేధం అమలుకు సంబంధించి ఉత్పత్తి, విక్రయం, నిల్వ, రవాణా వంటి అంశాలపై సమాచారం ఇవ్వాలని ప్రజలకు చేసిన విజ్ఞప్తికి సైతం మంచి స్పందన లభించిందన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1800 4255 364, 040 23231440 ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు పలు రకాల పక్షులను ప్రాణా ప్రాయస్థితి నుంచి కాపాడినట్లు తెలిపారు. భవనాలు, విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్లతో పాటు చెట్లు వంటి వాటి వల్ల పక్షులు ప్రమాదంలో చిక్కుకున్నాయి. ప్రజల నుంచి సమాచారం మేరకు యాంటీ పోచింగ్ స్క్వాడ్ వీటిని రక్షించింది. ఇందులో పలు పక్షులు మృతి చెందగా మరిన్ని పక్షులను చికిత్స నిమిత్తం నెహ్రు జూలాజికల్ పార్క్ డాక్టర్లకు అప్పగించినట్లు వారు తెలిపారు.

సీట్ల సంఖ్య 10శాతం పెంచుతాం

వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యాలయాల్లో అమలు: మోడీ

అహ్మదాబాద్ : ప్రభుత్వానికున్న రాజకీయ సంకల్పం వల్లనే 10 శాతం కోటా విషయంలో రాజ్యాంగ సవరణ సాధ్యమైందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ గురువారం పేర్కొన్నారు. అగ్రకులాల్లో ఆర్థికంగా వెనకబడిన వారికి జనరల్ కేటగిరీలో ప్రభుత్వం విద్య ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించిన సంగతి తెలిసిందే. విద్యాలయాల్లో ఈ రిజర్వేషన్ విధానం ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు అవుతుందని ఆయన తెలిపారు. 1500 పడకలునన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సంస్థను మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని... ప్రస్తుతమున్న సామాజిక రిజర్వేషన్లకు భంగం



కలగకుండా ఆర్థిక రిజర్వేషన్లు కల్పించామన్నారు. 'దేశంలోని 900 విశ్వవిద్యాలయాల్లో 40,000 కాలేజీల్లో కొత్త రిజర్వేషన్ విధానం ఈ విద్యా సంవత్సరం నుంచి అమలవుతుంది. సీట్ల సంఖ్యను పది శాతం పెంచుతాము' అని ప్రధాని చెప్పారు. సమాజంలో అన్ని వర్గాల వారికీ సమానావకాశాల్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఈ ఇన్‌స్టిట్యూట్ ఆయుష్మాన్ భారత్‌కు అనుసంధానం చేస్తారు. అందువల్ల పేదలు ఉచితంగా వైద్య సదుపాయాలు పొందే వీలుంటుంది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం కింద వంద రోజుల్లో ఏడు లక్షల మంది పేదలు ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. హెలీప్యాడ్ సదుపాయం ఉన్న మొదటి ప్రభుత్వ ఆస్పత్రి ఇది అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఈ కొత్త ఆరోగ్య సంస్థ రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి ఊతం ఇచ్చేందుకు తోడ్పడుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. 'పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణకు అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ ప్రాధాన్యమిస్తుంది. సర్దార్ పటేల్ మేయర్ ఉన్నప్పటి నుంచీ ఇది కొనసాగుతోంది. 2012లో ప్రారంభమైన ఆ ఆస్పత్రి ప్రాజెక్ట్ ఇలా రూపుదిద్దుకున్నందుకు నేను విస్మయం చెందాను' అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ చెప్పారు.

వాట్సాప్ కాల్‌లో విడాకులు

అమెరికాలో అమ్మాయి..నాగపూర్‌లో అబ్బాయి

నాగపూర్: అమెరికాలో నివసిస్తున్న మహిళ నుంచి వాట్స్‌అప్ వీడియో కాల్ ద్వారా సమ్మతిని పొందిన అనంతరం ఒక ఫ్యామిలీ కోర్టు ఆమెకు ఆమె భర్త నుంచి విడాకులు మంజూరు చేసింది. అత్యంత అరుదైన ఈ సంఘటనకు నాగపూర్ ఫ్యామిలీ కోర్టు వేదికైంది. అమెరికాలోని మిచిగన్‌లో నివసిస్తున్న ఒక 35 ఏళ్ల మహిళకు నాగపూర్‌లో నివసిస్తున్న 37 ఏళ్ల ఆమె భర్తకు పరస్పర అంగీకారంతో విడాకులను ఫ్యామిలీ కోర్టు మంజూరు చేసింది. స్టూడెంట్ వీసాపైన అమెరికాలో చదువుకుంటున్న తనకు సెలవులు దొరకడం కష్టమని, అందుకే వాట్స్‌అప్ వీడియో కాల్ ద్వారా తన వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వాలని ఆ మహిళ చేసుకున్న అభ్యర్థనను కోర్టు కూడా మన్నించింది. మిచిగన్‌లోనే పనిచేస్తున్నప్పటికీ ఆమె భర్త ప్రస్తుతం నాగపూర్‌లో ఉన్నందున రూ10లక్షల భరణం ఇవ్వాలన్న షరతుపై నాగపూర్ ఫ్యామిలీ కోర్టు జడ్జి స్వాతి చౌహాన్ వారు విడిపోవడానికి అనుమతి మంజూరు చేశారు. ఈ ఏడాది జనవరి 14న వారికి విడాకులు మంజూరయ్యాయి. ఈ జంటకు తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాద్‌లో 2013 ఆగస్టు 11న పెద్దలు కుదిర్చిన పెళ్లి జరిగింది. ఇంజనీర్లయిన భార్యాభర్తలిద్దరూ ఆ తర్వాత అమెరికాకు చెందిన ఒక ఆటోమొబైల్ కంపెనీలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. అయితే, వీసా గడువు ముగియడంతో కొంతకాలం నాగపూర్‌లోని అత్తగారింట ఆమె ఉన్నప్పుడు భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు మొదలయ్యాయి. అవి చిలికిచిలికి గాలివానగా మారి విడాకులకు దారితీశాయి.

విరాళాల్లో బిజెపి టాప్

తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్, ఎన్‌సిపి

న్యూఢిల్లీ: 2017–18 ఆర్థిక సంవత్సరానికి బిజెపినే అధిక మొత్తంలో విరాళాలు అందుకుంది. 2017–18లో జాతీయ పార్టీలన్నీ కలిపి మొత్తం రూ.469.89 కోట్లు విరాళాలుగా అందుకున్నాయి. అందులో ఒక్క బిజెపికే 93 శాతం అనగా రూ.437.04 కోట్లు వచ్చినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ (ఎడిఆర్) వెల్లడించింది. ప్రతి ఏడాది జాతీయ పార్టీలన్ని తమకు వచ్చిన విరాళాల గురించి ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తాయి. ఈ సమాచారం ప్రకారం ఎడిఆర్ ఈ నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం కాంగ్రెస్ పార్టీకి రూ.26.658 కోట్లు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రూ.2.087 కోట్లు, సిపిఐ(ఎం) రూ.2.756 కోట్లు, సిపిఐ రూ.1.146 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రూ.20 లక్షలు విరాళాలుగా అందుకున్నాయి. బహుజన్ సమాజ్ పార్టీ(బిఎస్‌పి)కి కనీసం రూ.20 వేలు కూడా రాలేదని తెలిసింది. కాంగ్రెస్, ఎన్‌సిపి, సిపిఐ, సిపిఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అందుకున్న విరాళాల కంటే బిజెపికి వచ్చిన విరాళాలు 12 రెట్లు ఎక్కువ. మొత్తం 4,201 మంది జాతీయ పార్టీలకు విరాళాలు ఇవ్వగా.. అందులో 2,977 మంది బిజెపికి, 777 మంది కాంగ్రెస్‌కు, 42 మంది ఎన్‌సిపికి, 196 మంది సిపిఎంకు, 176 మంది సిపిఐకి, 33 మంది తృణమూల్‌కు విరాళాలు ఇచ్చినట్లు సదరు నివేదిక తెలిపింది. 2016–17తో పోల్చుకుంటే ఈ ఏడాది జాతీయ పార్టీలకు వచ్చిన విరాళాలు 20 శాతం తగ్గినట్లు ఎడిఆర్ పేర్కొంది. ఆ ఏడాది అన్ని పార్టీలకు కలిపి రూ.589.38 కోట్లు విరాళాలు రాగా 2017–18 ఏడాదికి గాను రూ.469.89 కోట్ల విరాళాలు వచ్చాయని తెలిపింది.

హెచ్ 1 బి వీసాదార్లు దయనీయం

- **దానితో ఉద్యోగులకు చేటే**
- **సమూల, సమగ్ర మార్పులు కీలకం**
- **అమెరికా మేధో వేదిక నివేదిక**

వాషింగ్టన్ : అమెరికాలో హెచ్ 1 బి వీసాదార్ల పరిస్థితి దయనీయంగా ఉందని , వారు కుడిఎడమల దగాకు గురవుతున్నారని వెల్లడైంది. ఈ విషయాన్ని తమ సమగ్ర అధ్యయనంలో గమనించినట్లు అమెరికాకు చెందిన మేధో వేదిక తెలిపింది. హెచ్ 1 బి వీసాపై ఉన్న వారిని దుర్వినియోగపర్చుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతే కాకుండా తరచూ వారు అత్యంత పేలవమైన, హేయమైన పని పరిస్థితులలోకి నెడుతున్నారు. ఈ విధంగా ఉద్యోగాలు వచ్చాయనే ఒకే ఒక ఆశతో వారు ఊబిలో చిక్కాల్సి వస్తోందని సౌత్ ఆసియా సెంటర్ ఆఫ్ ది అట్లాంటిక్ కౌన్సిల్ సంస్థ వారు తెలిపారు. భారతదేశానికి చెందిన ఐటి నిపుణులే అత్యధిక సంఖ్యలో ఇప్పుడు అమెరికాలో హెచ్ 1 బి వీసాలపై ఉన్నారు. వీరి పరిస్థితి గురించి ఈ మేధో వేదిక తమ అధ్యయన నివేదికను వెలువరించింది. హెచ్ 1 బి వీసా సంవిధానాన్ని సమగ్ర రీతిలో మార్పులకు ఈ వేదిక పలు సూచనలు చేసింది. ఈ వీసా విధాన సమూల మార్పు వీరికి సరైన పని పరిస్థితులను కల్పించాల్సి ఉందని , అంతేకాకుండా వారికి అత్యధిక స్థాయిలో ఉద్యోగ హక్కులు కల్పించాల్సి ఉందని ఈ నివేదికలో సూచించారు. ఈ వీసా పద్ధతిలో ఉద్యోగాలలో కుదిరిన వారికి కనీస భద్రత తక్షణావసరం అని తెలిపారు. త్వరలోనే తాము తీసుకువచ్చే సంవిధానం విదేశీ ప్రతిభావంతులు అమెరికాలో కొనసాగేందుకు గ్యారంటీని ఇస్తూ, సరళీకృత రీతిలో ఉంటుందని ట్రంప్ చెప్పడం అక్కడి హెచ్ 1 బి వీసాదార్లలో వారి ఆధారిత కుటుంబ సభ్యులలో సరికొత్త ఉత్సాహానికి దారితీసింది. ఇండియన్ ఐటి నిపుణులలో హెచ్ 1 బి వీసాల ప్రక్రియ ఆద్యంతం వాడుకలో ఉంది. ఇది నాన్ ఇమ్మిగ్రేంట్ వీసాగా ఉంది. దీని ప్రాతిపదికన అమెరికాకంపెనీలు విదేశీయులను కీలక ఉద్యోగాలలోకి తీసుకుంటున్నాయి. సిద్ధాంత, విద్యాపరమైన, సాంకేతిక అనుభవానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే ఇప్పుడున్న హెచ్ 1 బి వీసా విధానం పూర్తిగా తప్పుల తడకగా ఉంది. ఇది అమెరికన్లకు నష్టం కల్గిస్తోంది. ఇదే సమయంలో ఈ వీసాదార్లు అన్ని విధాలుగా దెబ్బతినేందుకు వీలు కల్పిస్తోందని ఇప్పుడు సౌత్ ఆసియా సెంటర్ వారు వెలువరించిన నివేదికలో తెలిపారు. ఈ నివేదికను హోవార్డ్ వర్సిటీకి చెందిన రాన్ హీరా, సౌత్ ఆసియా సెంటర్ అధినేత భారత్ గోపాలస్వామిలు సంయుక్తంగా తయారు చేశారు.



మార్పులతో అమెరికాకూ మేలు


హెచ్ 1 బి వీసాదార్లు ఉద్యోగాలు పొందుతున్నారు. అయితే పనికి వారి ప్రతిభకు అనుభవానికి తగు విధమైన వేతనాలు దక్కడం లేదు. దూషణలకు గురవుతున్నారు. ఇక పని చేసే చోట ఇబ్బందులకు గురవుతున్నారని నివేదికలో తెలిపారు. ఇప్పటికైనా వారికి తగు విధంగా వారికి భద్రతను కల్పించాల్సి ఉంది. వారికి సముచిత వేతనాలు కల్పించాల్సి ఉంది. దీనితో వారి జీవితాలు మెరుగుపడుతాయి. ఇదే సమయంలో అమెరికా ఉద్యోగులకు మరింత భద్రతను కల్పించాల్సి ఉందని సూచించారు. అరుదైన ప్రతిభా పాటవాలను హెచ్ 1 బి వీసా ప్రక్రియలలో ఉద్యోగాలలో తీసుకోవడం జరిగితే సంబంధిత రంగాలలో అమెరికాకు ఉన్న మానవ వనరుల కొరత తీరుతుంది. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని సూచించారు. అయితే ఈ క్రమంలో హెచ్ 1 బి వీసాదార్ల ప్రయోజనాలు, వారికి సముచిత ఉద్యోగ వృత్తి భద్రత కీలకం అని తేల్చిచెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపకరించే ఉద్యోగ శ్రామికశక్తికి సముచిత ప్రాధాన్యత ఇవ్వడం బాధ్యతాయుత చర్య అన్పించుకుంటుందని స్పష్టం చేశారు. లేబర్ మార్కెట్‌లో ఉండే సముచిత లోటును గుర్తించి వాటిని భర్తీ చేయడం వల్ల దేశానికి మంచిదే అన్నారు.



అలహాబాద్ : రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో పాటు ఆయన సతీమణి సవితా కోవింద్ గురువారం అలహాబాద్, సంగంలో కుంభ మేళాలో భాగంగా నిర్వహించిన గంగాపూజలో పాల్గొన్నారు. రాష్ట్రపతి, ఆయన సతీమణి ఉదయం 9.30గంటలకు ప్రత్యేక విమానంలో బమ్రౌళి విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరికి ఆ రాష్ట్ర గవర్నర్ రామ్ నాయక్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్, రాష్ట్ర మంత్రులు ఘన స్వాగతం పలికారు. సంగంలో నిర్వహించిన గంగాపూజలో రాష్ట్రపతితో పాటు అతని భార్య, గవర్నర్, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్య, ఆరోగ్యశాఖ మంత్రి సిద్ధార్థ్ నాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. గంగా, యమునా, సరస్వతీ నదులు కలిసే సంగమం గురించి రాష్ట్రపతికి ఈ సందర్భంగా వివరించారు. ముఖ్య సదస్సులో పాల్గొన్న అనంతరం ప్రత్యేక విమానంలో గురువారం సాయంత్రం 4.30గంటలకు ఢిల్లీకి బయలుదేరారు.



కుంభమేళాలో రాష్ట్రపతి



హైటెక్ సాధువు

జకోవిచ్, సెరెనా ముందంజ

ఆస్ట్రేలియా ఓపెన్

చెమటోడ్చిన జ్వెరెవ్, హలెప్

మూడో రౌండ్‌లో నిషికోరి, ఒసాకా







మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా), సిమోనా హలెప్ (రుమేనియా) మూడో రౌండ్‌కు దూసుకెళ్లారు. ఇతర పోటీల్లో విలియమ్స్ సిస్టర్స్ సెరెనా, వీనస్, జపాన్ స్టార్లు నిషికోరి, నవోమి ఒసాకాలు విజయం సాధించారు. నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) రెండో రౌండ్‌లో చెమటోడ్చి నెగ్గాడు. మరోవైపు మాడిసన్ కీస్ (అమెరికా), హీసు వీ (తైవాన్), జాంగ్ షువాయి(చైనా) తదితరులు మూడో రౌండ్‌కు చేరుకున్నారు. పురుషుల విభాగంలో 12వ సీడ్ ఫాబియో ఫొగ్నిని(ఇటలీ), 21వ సీడ్ డేవిడ్ గోఫిన్ (బెల్జియం) రెండో రౌండ్‌లో విజయం సాధించారు. కాగా, ఏడో సీడ్ డొమినిక్ థిమ్ (ఆస్ట్రియా) రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు.


గట్టెక్కిన హలెప్

మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సిమోనా హలెప్ రెండో రౌండ్‌లో చెమటోడ్చి విజయం సాధించింది. అమెరికా క్రీడాకారిణి సోఫియా కెనిన్‌తో జరిగిన పోరులో హలెప్ 6–3, 6–7, 6–4 తేడాతో విజయం సాధించింది. తొలి సెట్‌లో సునాయాస విజయం సాధించిన హలెప్‌కు రెండో సెట్‌లో తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. టైబ్రేకర్ వరకు వెళ్లిన పోరులో చివరికి హలెప్ ఓటమి చవిచూసింది. కానీ, కీలకమైన మూడో సెట్‌లో హలెప్ మళ్లీ చెలరేగింది. చక్కని షాట్లతో చెలరేగిన హలెప్ సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుని మూడో రౌండ్‌కు చేరుకుంది. మరో పోటీలో 16వ సీడ్, మాజీ చాంపియన్ సెరెనా విలియమ్స్ అలవోక విజయం సాధించింది. కెనడా క్రీడాకారిణి బౌచార్డ్‌తో జరిగిన రెండో రౌండ్‌లో సెరెనా 6–2, 6–2తో జయభేరి మోగించింది. మరో పోటీలో వీనస్ విలియమ్స్ జయకేతనం ఎగుర వేసింది. ఫ్రాన్స్ క్రీడాకారిణి అలెజె కొర్నెట్‌పై వీనస్ విజయం సాధించింది. మూడు సెట్ల పోరులో వీనస్ 6–3, 4–6, 6–0తో గెలుపొందింది. కాగా, నాలుగో సీడ్ ఒసాకా కూడా రెండో రౌండ్‌లో జయభేరి మోగించింది. ఏకపక్షంగా సాగిన పోరులో ఒసాకా 6–2, 6–4తో తమరా జిడాన్‌సెక్‌ను చిత్తు చేసింది. రెండో సెట్‌లో ఒసాకాకు కాస్త ప్రతిఘటన ఎదురైనా చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకుంటూ ముందంజ వేసింది. మరోవైపు ఆరో సీడ్ ఎలినా స్విటలొనా (ఉక్రెయిన్), ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్), 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) కూడా రెండో రౌండ్‌లో జయకేతనం ఎగుర వేశారు. స్విటలొనా 6–4, 6–1తో విక్టోరియా కుజ్మోవా (స్లొవేనియా)ను ఓడించింది. ప్లిస్కోవా 4–6, 6–1, 6–0తో మాడిసన్ బ్రేగిను ఓడించింది. 21వ సీడ్ వాంగ్ జియాంగ్ (చైనా) 6–2, 6–3తో సెర్బియా క్రీడాకారిణి అలెగ్జాండపై విజయం సాధించింది. అమెరికా స్టార్ మాడిసన్ కీస్ 6–3, 6–4తో రష్యా క్రీడాకారిణిపై పొటాపొవాను ఓడించింది.

ఎదురులేని జకోవిచ్

మరోవైపు పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ అలవోక విజయం సాధించాడు. ఫ్రాన్స్ వెటరన్ ఆటగాడు జో వెల్ఫ్రెడ్ సొంగాతో జరిగిన పోరులో జకోవిచ్ 6–3, 7–5, 6–4తో జయకేతనం ఎగుర వేశాడు. ప్రారంభం నుంచే జకోవిచ్ పైచేయి సాధించాడు. అయితే సొంగా కూడా పోరాట పటిమను కనబరిచాడు. కానీ, చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న జకోవిచ్ మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. మరో పోటీలో నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) చెమటోడ్చి విజయం సాధించాడు. ఐదు సెట్ల సమరంలో జ్వెరెవ్ 7–6, 6–4, 5–7, 6–7, 6–1 తేడాతో ఫ్రాన్స్ ఆటగాడు జెర్మి చార్డీను ఓడించాడు. ఇద్దరు విజయం కోసం సర్వం ఒడ్డి పోరాడారు. అయితే చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడు కోవడంలో సఫలమైన జ్వెరెవ్ మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. 8వ సీడ్ నిషికోరి కూడా రెండో రౌండ్‌లో కష్టపడి విజయం సాధించాడు. క్రొయేషియా ఆటగాడు కార్లొవిక్‌తో జరిగిన పోరులో నిషికోరి 6–3, 7–6, 5–7, 6–7, 7–6తో జయభేరి మోగించాడు. నువ్వానేనా అన్నట్టు సాగిన ఐదు సెట్ల సమరంలో నిషికోరి అతి కష్టం మీద విజయం సాధించాడు. మరోవైపు 16వ సీడ్ మిలోస్ రౌనిక్ (మాంటెనెగ్రొ) కూడా చెమటోడ్చక తప్పలేదు.

స్విట్జర్లాండ్ క్రీడాకారుడు స్టాన్ వావ్రింకాతో జరిగిన రెండో రౌండ్‌లో రౌనిక్ 6–7, 7–6, 7–6, 7–6తో గెలుపొందాడు. అన్ని సెట్లు కూడా టైబ్రేకర్ వరకు వెళ్లక తప్పలేదు. కానీ, చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకోవడంలో సఫలమైన రౌనిక్ మ్యాచ్‌ను సొంతం చేసుకుని మూడ రౌండ్‌కు చేరుకున్నాడు. ఇతర పోటీల్లో 11వ సీడ్ బొర్నా కొరిక్ (క్రొయేషియా), 12వ సీడ్ ఫొగ్నిని, 23వ సీడ్ కరెనొ బుస్టా (స్పెయిన్), 15వ సీడ్ మడెనొవ్ తదితరులు విజయం సాధించారు. కాగా, ఏడో సీడ్ గోఫిన్ గాయం వల్ల అర్ధాంతరంగా పోటీ నుంచి తప్పుకున్నాడు.



ప్రేమలో పడ్డ రిషబ్ పంత్



న్యూఢిల్లీ: భారత యువ క్రికెటర్, వికెట్ కీపర్ రిషబ్ పంత్ ప్రేమలో పడ్డాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన టెస్టు సిరీస్‌లో రిషబ్ పంత్ అద్భుత ఆటతో ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. అయితే వన్డే సిరీస్‌కు రిషబ్ పంత్‌కు విశ్రాంతి ఇచ్చారు. కాగా, ప్రస్తుతం స్వదేశంలో ఉన్న రిషబ్ ఖాళీ సమయాన్ని ఆస్వాదిస్తున్నాడు. ఈ క్రమంలో తన ప్రేమ విషయాన్ని అభిమానులతో పెంచుకున్నాడు. తాను ఓ అమ్మాయి ప్రేమలో పడినట్టు తెలిపాడు. అంతేగాక తాను ప్రేమిస్తున్న అమ్మాయి ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. నా సంతోషానికి కారణం నువ్వే..నిన్ను సంతోషంగా ఉంచాలనుకుంటున్నా అని కామెంట్ కూడా పెట్టాడు. పంత్ షేర్ చేసిన అమ్మాయి పేరు ఇషా నేగి అని తెలిసిందే. ఇషా ఇంటీరియర్ డిజైనర్‌గా కొనసాగుతోంది. ఇషా కూడా తాను పంత్‌తో కలిసి ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. దీంతో పంత్–ఇషాల మధ్య ప్రేమ కొనసాగుతుందనే విషయం స్పష్టమైంది. మై మ్యాన్, మై సోల్‌మెట్, బెస్ట్ ఫ్రెండ్, లవ్ ఆఫ్ మ లైఫ్ అంటు ఇషా క్యాప్షన్ పెట్టడం విశేషం. ఇదిలావుండగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో రిషబ్ కీపర్‌గా రాణించడమే కాకుండా బ్యాట్‌తోనూ సత్తా చాటాడు. ఈ సిరీస్‌లో ఏకంగా 350 పరుగులు చేసి ప్రకంపనలు సృష్టించాడు.

క్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్



కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌లు మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. గురువారం జరిగిన మహిళల ప్రిక్వార్టర్ ఫైనల్లో సైనా 21–14, 21–16 తేడాతో హాంకాంగ్ క్రీడాకారిణి ప్యూ ఇన్ ఇప్‌ను ఓడించింది. ప్రారంభం నుంచే చెలరేగి ఆడిన సైనా ఏ దశలోనూ ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇవ్వలేదు. చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో సైనా జపాన్ స్టార్ నజోమి ఒకుహరాతో తలపడుతుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత అగ్రశ్రేణి ఆటగాడు శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ హాంకాంగ్ ఆటగాడు విన్సెంట్‌ను ఓడించాడు. హోరాహోరీగా సాగిన సమరంలో శ్రీకాంత్ 23–21, 8–21, 21–18 తేడాతో విన్సెంట్‌పై విజయం సాధించాడు. కాగా, మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప–సిక్కిరెడ్డి జోడీ ఓటమి పాలైంది.



సెమీస్‌లో కేరళ

తిరువనంతపురం: రంజీ ట్రోఫీలో కేరళ జట్టు సెమీఫైనల్‌కు చేరుకుని చరిత్ర సృష్టించింది. కేరళ రంజీల్లో సెమీస్‌కు చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం. గుజరాత్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో కేరళ 113 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. విజయం కోసం 195 పరుగులు చేయాల్సిన గుజరాత్ 82 పరుగులకే కుప్పకూలింది. బసిల్ థంపి అద్భుత బౌలింగ్‌తో గుజరాత్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చాడు. థంపి 27 పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. వారియర్ నాలుగు వికెట్లు తీసి తనవంతు సహకారం అందించాడు.

సుప్రీం కోర్టుకు హార్దిక్, రాహుల్ వివాదం

న్యూఢిల్లీ: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన క్రికెటర్లు హార్దిక్ పాండ్య, లోకేశ్ రాహుల్‌ల వ్యవహారం సుప్రీం కోర్టుకు వెళ్లింది. బిసిసిఐ వెంటనే అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ క్రికెట్ పాలకుల కమిటీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. యువ ఆటగాళ్లు హార్దిక్, రాహుల్‌ల భవితవ్యం తేల్చేందుకు అంబుడ్స్‌మన్ నియామకం అవసరమని పాలకుల కమిటీ పేర్కొంది. కాగా, వారం తర్వాత బిసిసిఐ కేసులో అన్ని అంశాలు విచారిస్తామని సుప్రీం తెలిపింది.



సిరీస్ ఎవరిదో..

ఆత్మవిశ్వాసంతో భారత్
గెలుపు కోసం ఆస్ట్రేలియా. నేడు చివరి వన్డే



మెల్‌బోర్న్: సిరీసే లక్ష్యంగా శుక్రవారం జరిగే చివరి వన్డే భారత్, ఆస్ట్రేలియా జట్లు సిద్ధమయ్యాయి. రెండో వన్డేలో అద్భుత విజయం సాధించిన టీమిండియా ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. మరోవైపు టెస్టు సిరీస్‌లో ఎదురైన ఓటమికి వన్డేల్లో బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో ఆస్ట్రేలియా పోరుకు సిద్ధమైంది. ఇరు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో పోరు నువ్వానేనా అన్నట్టు సాగడం ఖాయం. చారిత్రక మెల్‌బోర్న్ మైదానం ఈ మ్యాచ్‌కు వేదికగా నిలిచింది. భారత కాలమానం ప్రకారం ఉదయం 7.50 గంటల నుంచి మ్యాచ్ జరుగుతుంది. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన క్రికెటర్లకు కొదవలేదు. దీంతో సిరీస్ ఎవరికి దక్కుతుందనే దానిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఆస్ట్రేలియాతో పోల్చితే భారత్ కాస్త బలంగా కనిపిస్తోంది. కానీ, తొలి వన్డేలో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియాను కూడా తక్కువ అంచనా వేయలేం. ఈ మ్యాచ్ కోసం ఇరు దేశాల అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కాగా, చివరి మ్యాచ్‌లోనూ గెలిచి ఆస్ట్రేలియా సిరీస్‌ను మరుపులేని జ్ఞాపకంగా మిగుల్చుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది. ఇందులో ఎంతవరకు సఫలమవుతుందో మరో కొన్ని గంటల్లో తేలిపోతుంది.

ఓపెనర్లే కీలకం

రెండో వన్డేలో మెరుగైన ఆరంభాన్ని ఇచ్చిన ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు ఈసారి కూడా అదే సంప్రదయాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన ధావన్, రోహిత్‌లు చెలరేగితే ఈ మ్యాచ్‌లో గెలుపు భారత్‌కు నల్లేరుపై నడకే. అయితే నిలకడలేమి ధావన్‌కు సమస్యగా మారింది. భారీ స్కోర్లు సాధించడంలో తడబడుతున్నాడు. ఈ మ్యాచ్‌లోనైనా భారీ స్కోరు సాధించాల్సిన అవసరం ఉంది. ఇక, రోహిత్ భీకర ఫామ్‌లో తొలి వన్డేలో శతకం సాధించిన రోహిత్ అడిలైడ్‌లోనూ సత్తా చాటాడు. ఈసారి కూడా జట్టు రోహిత్‌పై భారీ ఆశలు పెట్టుకుంది.

జోరుమీదున్నారు

మరోవైపు కెప్టెన్ విరాట్ కోహ్లి, మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనిలు జోరుమీదున్నారు. అడిలైడ్ మ్యాచ్‌లో ఇద్దరు కీలక భాగస్వామ్యంతో జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించారు. ఈసారి కూడా జట్టు వీరి నుంచి ఇలాంటి ఇన్నింగ్స్‌నే ఆశిస్తోంది. కోహ్లి ఫామ్‌లోకి రావడం జట్టుకు శుభసూచకం. అడిలైడ్ వన్డేలో కోహ్లి అద్భుత సెంచరీతో అలరించాడు. కీలకమైన మెల్‌బోర్న్ మ్యాచ్‌లోనూ అదే జోరును కొనసాగించాలనే పట్టుదలతో కనిపిస్తున్నాడు. ధోని కూడా రెండు మ్యాచుల్లో నిలకడైన ఆటతో ఆకట్టుకున్నాడు. కిందటి మ్యాచ్‌లో చివరి వరకు అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. ఈసారి కూడా ధోని నుంచి ఇలాంటి ఇన్నింగ్స్ రావాలని జట్టు యాజమాన్యం కోరుకుంటుంది. ఇక, అంబటి రాయుడు కూడా రెండో వన్డేలో కాస్త బాగానే ఆడాడు. అయితే అతని బ్యాటింగ్ మరింత మెరుగు పడాల్సిన అవసరం ఉంది. దినేశ్ కార్తీక్ కూడా మరోసారి బ్యాట్‌ను ఝుళిపించాల్సి ఉంది. జడేజా, భువనేశ్వర్‌లతో భారత బ్యాటింగ్ బలంగా ఉంది. ఇక, బౌలింగ్‌లోనూ టీమిండియాకు ఎదురు లేదనే చెప్పాలి. సీనియర్లు షమీ, భువనేశ్వర్‌లు అడిలైడ్‌లో అద్భుతంగా రాణించారు. కాగా, సిరాజ్, ఖలీల్, కుల్దీప్‌ల వైఫల్యం జట్టును కలవర పెడుతోంది. ఈ మ్యాచ్‌లోనైనా వీరు తమ బౌలింగ్‌ను మెరుగు పరుచుకోక తప్పదు.



ప్రతీకారం కోసం

ఇక, ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు రెండో వన్డేలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో ఆఖరి వన్డేకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని తహతహలాడుతోంది. అయితే ఓపెనర్లు అరోన్ ఫించ్, కారేల వైఫల్యం జట్టును వెంటాడుతోంది. ఇద్దరు రెండు మ్యాచుల్లోనూ విఫలమయ్యారు. ఈసారైనా మెరుగైన ఆరంభాన్ని ఇవ్వాల్సిన బాధ్యత వీరిపై ఉంది. కాగా, కెప్టెన్ ఫించ్ పేలవమైన ఫామ్‌తో సతమతమవుతున్నాడు. ఈ మ్యాచ్‌లోనూ విఫలమైతే జట్టులో స్థానం ప్రశ్నార్థకంగా మారడం ఖాయం. ఇదిలావుంటే సీనియర్లు షాన్ మార్ష్, ఖ్వాజా, మాక్స్‌వెల్‌లు ఫామ్‌లో ఉండడం జట్టుకు కలిసి వచ్చే అంశమే. అంతేగాక స్టోయినిస్, హాండ్స్‌కొంబ్‌లు కూడా బాగానే ఆడుతున్నారు. రిచర్డ్‌సన్, బెహ్రాన్‌డ్రాఫ్, లియాన్, స్టోయినిస్‌లు బౌలింగ్‌లో సత్తా చాటుతున్నారు. ఈసారి కూడా బౌలర్లపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. ఇందులో ఎంతవరకు సఫలమవుతుందో వేచి చూడక తప్పదు.



మన తెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 18, జనవరి 2019
www.manatelangana.news

అండమాన్ నికోబార్ దీవులలో గురువారం ఉదయం 8.43 గంటలకు భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6గా నమోదైందని జాతీయ కేంద్ర భూగర్భ సంస్థ తెలిపింది. అయితే, ఇది సునామీకి దారితీయదని, సముద్రపు అలలు కూడా పెరగవని ఐఎన్‌సిఒఐఎస్ డైరెక్టర్ ఎస్‌పిఎస్ షెనాయ్ పేర్కొన్నారు. ప్రాణ, ఆస్తి నష్టంపై తమకు సమాచారం అందలేదని అధికారులు పేర్కొన్నారు.

విశాల



సుప్రీంను ఆశ్రయించిన ఆ ఇద్దరు మహిళలు

న్యూఢిల్లీ: శబరిమల ఆలయంలోకి జనవరి 2వ తేదీన ప్రవేశించి చరిత్ర సృష్టించిన ఇద్దరు మహిళలు తమకు రక్షణ కల్పించాలంటూ సుప్రీంకోర్టును శరణుకోరారు. తాము అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన దరిమిలా కేరళ వ్యాప్తంగా నిరసనలు, హింసాత్మక సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని, ఈ పరిస్థితులలో తమ ప్రాణాలకు ముప్పు ఏర్పడిందని బిందు అమ్మిని, కనకదుర్గ అనే ఇద్దరు మహిళలు సుప్రీంకోర్టుకు విన్నవించారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టేందుకు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ అంగీకరించారు. శబరిమలలో దర్శనం చేసుకున్న 44 సంవత్సరాల కనకదుర్గ మంగళవారం పోలీసు భద్రత మధ్య ఇంటికి తిరిగి రాగా ఆమె అత్తగారు కర్రతో ఆమెను చితకబాదారు. తీవ్రంగా గాయపడిన కనకదుర్గ పెరింతల్‌మన్న ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

బిజెపికి మిగిలింది భ్రాంతి మాత్రమే



బెంగళూరు: రాష్ట్రంలో కాంగ్రెస్‌జెడిఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బిజెపి చేసిన "తిరుగుబాటు" ఎత్తుగడలు "భ్రాంతి"గా మిగిలిపోయాయని కర్నాటక ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి ఎద్దేవా చేశారు. గురువారం బెంగళూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలదోసేందుకు పదే పదే ప్రయత్నిస్తున్నందుకు ప్రజలు బిజెపికి తగిన గుణపాఠం నేర్పుతారని చెప్పారు. "జనవరి 15న సం'క్రాంతి' ఉంటుందని బిజెపి చెప్పుకుంది. కాని అది సం'భ్రాంతి'గా మారిపోయింది. బిజెపి ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టడానికి నేను, కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నట్లు ఎడ్యూరప్ప ఆరోపించారు. కాని..మా ఎమ్మెల్యేలతో బేరసారాలు జరుపుతోంది బిజెపియేనన్నది వాస్తవం" అని కుమారస్వామి చెప్పారు. బిజెపి ఎమ్మెల్యేలను గురుగ్రామ్‌లోని ఒక హోటల్‌లో గత కొద్ది రోజులుగా దాచిపెట్టారని ఆయన ఆరోపిస్తూ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలో పనిచేయకుండా అడ్డుపడడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

ఐదుగురు పాకిస్థానీ సైనికుల కాల్చివేత

జమ్మూ: కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలకు పాల్పడుతున్న పాకిస్తాన్‌కు గట్టిగా జవాబు ఇస్తూ భారత సైనిక జవాన్లు గురువారం జమ్మూ కాశ్మీరులో ఐదుగురు పాకిస్తానీ సైనికులను హతమార్చి ఏడు బంకర్లను ధ్వంసం చేశారు. పాకిస్తానీ దళాలు పూంచ్ జిల్లాలోని వాస్తవాధీన రేఖ వెంబడి మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని అతిక్రమించాయి. దీనికి భారత సైనిక దళాలు ధీటైన జవాబిస్తూ ఏడుగురు పాకిస్తానీ ఉగ్రవాదులను హతమార్చాయి.

నచ్చకపోతే పార్టీ వదిలి వెళ్లొచ్చు

శత్రుఘ్నసిన్హాపై సుశీల్ మోడీ ఫైర్



పాట్నా : తరచూ సొంత పార్టీ బిజెపిపై విమర్శలు గుప్పిస్తూ వార్తల్లో నిలిచే ఎంపి శత్రుఘ్న సిన్హా పై బిజెపి స్పందించింది. బిజెపి సీనియర్ నేత, బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీ ఓ టీవీ ఛానల్‌లో మాట్లాడుతూ శత్రుఘ్న సిన్హా తీరును గర్హించారు. 'శత్రుఘ్న సిన్హా ఆదర్శమైన వ్యక్తి. కానీ బిజెపి పట్ల ఆయన వ్యవహారశైలి బాగోలేదు. ముఖ్యంగా ఆయన లాలూ ప్రసాద్ యాదవ్‌ను కలవడం, లాలూ కుమారుడు బీహార్ ముఖ్యమంత్రి అవుతాడని అంచనా వేయడం సరికాదు. ఆయనకు అంతగా నచ్చకపోతే పార్టీని వదిలి వెళ్లిపోవచ్చు' అని అన్నారు. బిజెపి నేతల వల్లే గత ఎన్నికల్లో శత్రుఘ్న సిన్హా గెలిచారని, ధైర్యముంటే ఈసారి ఎన్నికల్లో ఆయన తన పాపులారిటీతో విజయం సాధించాలని సుశీల్ సవాల్ విసిరారు.

ఫోక్స్‌వాగన్‌కు భారీ వడ్డన!

న్యూఢిల్లీ: కాలుష్యానికి సంబంధించిన కేసులో శుక్రవారం సాయంత్రం 5 గంటల కల్లా రూ 100 కోట్లు డిపాజిట్ చేయాలని జర్మనీకి చెందిన బడా ఆటోమొబైల్ సంస్థ ఫోక్స్‌వాగన్‌కు జాతీయ హరిత ట్రిబ్యూనల్(ఎన్‌జిటి) గురువారం ఆదేశాలు జారీచేసింది. అలా చేయని పక్షంలో సంస్థకు చెందిన భారతదేశ మేనేజింగ్ డైరెక్టర్ అరెస్టు, దేశంలోని ఆస్తులన్నిటి స్వాధీనంతో సహా కఠినమైన చర్యలు ఎదుర్కోవలసి ఉంటుందని ఎన్‌జిటి హెచ్చరించింది. ఫోక్స్‌వాగన్ కార్ల నుంచి వెలువడుతున్న విపరీతమైన వాయు కాలుష్యం కారణంగా ఢిల్లీలో 'ఆరోగ్య సమస్యలు' ఉత్పన్నమవుతున్నందుకు ఫోక్స్‌వాగన్ ఇండియా రూ171.34కోట్ల నష్టపరిహారాన్ని చెల్లించాలంటూ ఎన్‌జిటి ఏర్పాటు చేసిన నలుగురు సభ్యుల కమిటీ ఈనెల 15న సిఫార్సు చేసింది. ఫోక్స్‌వాగన్ కార్ల నుంచి వెలువడుతున్న నైట్రోజన్ ఆక్సయిడ్ వల్ల గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు ఏర్పడే ప్రమాదం ఉందని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదికపై ఎన్‌జిటి చైర్‌పర్సన్ జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్ సారథ్యంలోని ధర్మాసనం విచారణ జరిపి ఫోక్స్‌వాగన్ ఇండియాకు నష్టపరిహారంపై ఆదేశాలు జారీచేసింది.

మా ఉసురు తగిలితే అంతే!

అమిత్ షాపై కాంగ్రెస్ ఎంపి వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: రాజకీయ ఆరోపణలు తీవ్ర పతనావస్థకి చేరుకున్నాయనడానికి ఇదే ఉదాహరణ. అనారోగ్యంతో బాధపడుతున్న బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షాపై కర్నాటకకు చెందిన కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు బికె హరిప్రసాద్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. స్వైన్ ఫ్లూ వ్యాధితో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరిన అమిత్ షా అనారోగ్యంపై వ్యాఖ్యానిస్తూ "కర్నాటక ప్రజలు బిజెపి అధ్యక్షుడిని శపించారు..అందుకే ఆయన 'పంది వల్ల సోకే వ్యాధి'తో బాధపడుతున్నారు" అంటూ ఎద్దేవా చేశారు. కర్నాటకలోని కాంగ్రెస్‌జెడిఎస్ కూటమి ప్రభుత్వాన్ని కూలదోసేందుకు "అపరేషన్ కమల" పేరుతో బిజెపి కుట్రలు చేస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్‌కు చెందిన ఒక సీనియర్ పార్లమెంటేరియన్ నుంచి ఈ విధమైన వ్యాఖ్యలు వచ్చాయి. ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ, కర్నాటక ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఆయన(అమిత్ షా) ఇలాగే తన ప్రయత్నాలు కొనసాగిస్తే మరింత భయంకరమైన వ్యాధులను ఆయన ఎదుర్కోవలసి వస్తుందని కూడా కాంగ్రెస్ ఎంపి శాపనార్థాలు పెట్టారు.

ఎయిమ్స్ నుంచి కేంద్ర మంత్రి రవిశంకర్ డిశ్చార్జి

న్యూఢిల్లీ : సైనస్‌కు గురై ఎయిమ్స్‌లో చికిత్స పొందిన కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ గురువారం డిశ్చార్జి అయ్యారు. బుధవారం ఆయనను ఐసియు నుంచి ప్రైవేట్ వార్డుకు తరలించినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న రవిశంకర్ ప్రసాద్ సోమవారం ఎయిమ్స్‌లో చేరిన విషయం తెలిసిందే.

గట్టెక్కిన థెరెసా

- వీగిపోయిన అవిశ్వాసం
- త్వరలో కొత్త బ్రెగ్జిట్ బిల్లుతో రెడీ

లండన్ : బ్రెగ్జిట్ పరాజయ భారపు బ్రిటన్ ప్రధాని థెరెసా మే అవిశ్వాస గండం నుంచి అత్యల్ప స్థాయిలో గట్టెక్కారు. పార్లమెంట్‌లో బ్రెగ్జిట్ డీల్‌పై ప్రధాని తీసుకువచ్చిన బిల్లు భారీస్థాయిలో తిరస్కరణకు గురయింది.వెనువెంటనే ప్రతిపక్ష లేబర్ పార్టీ వారు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. మరుసటి రోజు గురువారం జరిగిన బలపరీక్షలో అత్యల్ప, నామమాత్రపు ఆధిక్యతతో బ్రిటన్ ప్రధాని పదవి పదిలం అయింది. తీర్మానానికి అనుకూలంగా 325 ఓట్లు, వ్యతిరేకంగా 306 ఓట్లు వచ్చాయి. బ్రిటన్ పార్లమెంట్ చరిత్రలో 26 ఏండ్లలో ఇది తొలి బలపరీక్షగా నిలిచింది. సభలో కేవలం 19 ఓట్ల ఆధిక్యతను దక్కించుకున్న థెరెసా ఆ తరువాత పార్లమెంట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు తమ స్వార్థ ప్రయోజనాలను వీడాలని, సరికొత్త బ్రెగ్జిట్ డీల్‌కు కలిసిరావాలని , ఈ దిశలో అంతా కృషి చేయాల్సి ఉందని పిలుపు నిచ్చారు. విజయోత్సాహంలో ఆమె మాట్లాడారు. తమ ప్రభుత్వం బలపరీక్షలో నెగ్గిందని , ఇప్పుడు తనకు కొంత ఊపిరి లభించడమే కాదు, మరింత కొత్తగా దేశ రెఫరెండానికి అనుకూలంగా బ్రెగ్జిట్ డీల్ ఖరారుకు ఊతం లభించిందని తెలిపారు. ఇది అందరికీ సదవకాశంగా అన్పిస్తోందన్నారు. బ్రిటన్ 1973లో 28 సభ్యుల యురోపియన్ యూనియన్ (ఇయూ)లో చేరింది. దీని నుంచి వైదొలగాలనే వివాదాస్పద రెఫరెండం అమలు ఇప్పుడు థెరెసా ప్రభుత్వానికి పలు రకాలుగా చిక్కులు తెచ్చిపెట్టింది. మార్చి 29లోగా బ్రిటన్ ఇయూ నుంచి విడాకులు పొందాల్సి ఉంటుంది. తాము సోమవారం సరికొత్త బ్రెగ్జిట్ ఒప్పందపు నమూనాతో పార్లమెంట్‌కు వెళ్లుతామని , ప్రతిపక్షాలతో సంప్రదింపుల తరువాత కుదిరే డీల్ సవ్యంగా సాగుతుందని ఆశిస్తున్నామని థెరెసా తెలిపారు. ప్రతిపక్ష ఎంపిలు ఇక కేవలం వారి సొంత పార్టీకోసమే ఆలోచించడం మానుకోవాల్సి ఉందని, దేశ సంక్షేమం కోసం పాటుపడితే మంచిదని కోరుతున్నట్లు చెప్పారు.సవ్యమైన బ్రెగ్జిట్ డీల్ కుదరాల్సి ఉంది. అయితే ఏమంతా సులభమైన విషయం కాదని, అయితే జాతీయ ప్రయోజనాల కోణంలో , సరైన ఏకాభిప్రాయానికి వస్తే అందరికీ మంచిదనే విషయాన్ని ఎంపిలు గుర్తు పెట్టుకోవాలని కోరారు. ఇప్పుడు ఎంపీలు తమకు ఏది వద్దో చెప్పారని, అయితే అంతాకలిసి పార్లమెంట్ ఏమి కోరుకుంటుందనేది నిర్మాణాత్మకంగా ఖరారు చేసుకోవడం మంచిదని స్పష్టం చేశారు. బ్రిటన్ ప్రజలు ఇయూను వదలిపెట్టాలని ఆదేశించారు. ప్రధానిగా అందుకు అనుగుణంగా తాను స్పందించాల్సి ఉందని ప్రధాని తెలిపారు.



డీల్ లేదంటేనే చర్చలు : లేబర్ నేత కార్బిన్

చచ్చి బతికినట్లుగా మారిన థెరెసా అధికార యంత్రాంగం అధికారంలో కొనసాగే హక్కులేనేలేదని లేబర్ పార్టీ నేత జెరెమీ కార్బిన్ ఘాటుగా విరుచుకుపడ్డారు. సభలో బలపరీక్ష దశలో ఆరుగంటల వాడివేడి చర్చలో ఆయన మాట్లాడారు. థెరెసా ప్రభుత్వంపై కార్బిన్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రభుత్వంపై ఇటువంటి అవిశ్వాస తీర్మానాలు మరిన్ని తీసుకురావడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని తమతో ఏదైనా నిర్మాణాత్మకంగా మాట్లాడాలనుకుంటే ముందుగా ఆమె బ్రెగ్జిట్ డీల్ ఉండదనే విషయం స్పష్టం చేయాల్సి ఉంటుందన్నారు. అయితే తాము ప్రతి దశలోనూ ప్రతిపక్షాలతో సవ్యమైన చర్చలకు దిగుతున్నామని, నిర్మాణాత్మక రీతిలోనే సాగుతున్నామని ప్రధాని థెరెసా సమాధానం ఇచ్చారు. ఎప్పుడూ వారు తమ సొంత లాభాల కోసమే ఆలోచిస్తారా? అని నిలదీశారు.

లోక్‌పాల్ గడువు ఫిబ్రవరి



న్యూఢిల్లీ : లోక్‌పాల్ నియామకాలకు అభ్యర్థుల పేర్లను ఫిబ్రవరి చివరిలోగా పంపించాలని సెర్చ్ కమిటీకి సుప్రీం కోర్టు ఆదేశాలు వెలువరించింది. ఫిబ్రవరి నెలాఖరును తుది గడువుగా ఖరారు చేసింది. లోక్‌పాల్ సెర్చ్‌కమిటీ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజన ప్రకాశ్ దేశాయ్ ఆధ్వర్యంలో ఏర్పడింది. దేశంలో అవినీతి నిరోధకచర్యల కేంద్రీకృత వ్యక్తిగా లోక్‌పాల్ నియామక నిర్ణయం జరిగింది. అయితే ఇప్పటికీ లోక్‌పాల్ ఎంపిక ముందుకు సాగకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్‌తో కూడిన ధర్మాసనం సెర్చ్ కమిటీకి ప్రభుత్వం అన్ని విధాలుగా అవసరమైన మౌలిక ఏర్పాట్లు సమకూర్చాలని, తాము విధించిన గడువులోగా వారు తమ బాధ్యతలు నిర్వర్తించేందుకు అనువైన వాతావరణం కల్పించాల్సి ఉందని ఆదేశించింది. న్యాయమూర్తులు ఎల్ఎన్ రావు, ఎస్‌కె కౌల్‌తో కూడిన ఈ ధర్మాసనం లోక్‌పాల్ నియామక ప్రక్రియపై మార్చి 7వ తేదీన తిరిగి విచారణ జరుపుతుంది. లోక్‌పాల్ సెర్చ్ కమిటీకి సంబంధించి కొన్ని ఏర్పాట్లు, సిబ్బంది లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని , దీనితో లోక్‌పాల్ ఎంపికకు సెర్చ్ కమిటీ సంప్రదింపులు సరిగ్గా నిర్వహించలేకపోయిందని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ సాధకబాధకాలు తెలియచేసుకున్నారు. అయితే వీటిని నివారించి అన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉందని, లోక్‌పాల్ నియామక ప్రక్రియను వేగిరపర్చాల్సి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

కీలక పదవులకు...

ముగ్గురు ఇండో అమెరికన్‌లు

నామినేట్ చేసిన అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా పాలనా యంత్రాంగంలో శక్తివంతమైన పదవులకు పరపతి ఉన్న ముగ్గురు భారతీయ అమెరికన్లను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నామినేట్ చేశారు. వారిలో అణు రంగ నిపుణురాలు కూడా ఉన్నారు. అసిస్టెంట్ సెక్రెటరీ ఆఫ్ ఎనర్జీ (న్యూక్లియర్ ఎనర్జీ) పదవికి రీటా బరన్‌వాల్, ప్రైవసీ అండ్ సివిల్ లిబర్టీస్ ఓవర్‌సైట్ బోర్డుకు ఆదిత్య బాంజాయ్, ట్రెజరీ అసిస్టెంట్ సెక్రెటరీగా బిమల్ పటేల్‌ను అధ్యక్షుడు ట్రంప్ నామినేట్ చేశారు. ఈ ముగ్గురి నామినేషన్లను బుధవారం సెనేట్‌కు పంపించారు. ఇంతవరకు ట్రంప్ 36 మందికి పైగా భారతీయ అమెరికన్లను కీలక పదవుల్లో నియమించడమో, నామినేట్ చేయడమో చేశారు. కేబినెట్ స్థాయి లో నియమితులైన మొదటి ఇండియన్ అమెరికన్ నిక్కీ హాలే, డిప్యూటీ ప్రెస్ సెక్రెటరీ పదవికి నియమితులైన మొదటి ఇండియన్ అమెరికన్ రాజ్ షా ట్రంప్ పాలనా యంత్రాంగానికి గుడ్ బై చెప్పారు. రీటా



బరన్‌వాల్ ...గేట్‌వే ఫర్ యాసెలరేటెడ్ ఇన్నొవేషన్ ఇన్ న్యూక్లియర్ (గెయిన్)లో డైరెక్టర్‌గా ఉన్నారు. ఒకవేళ సెనేట్ ఆమె నామినేషన్‌ను ఆమోదిస్తే రీటా అత్యంత శక్తివంతమైన న్యూక్లియర్ ఎనర్జీ శాఖకు సారథ్యం వహిస్తారు.న్యూక్లియర్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అణు సాంకేతిక పరిశోధనాశాఖల్ని కూడా చూస్తారు. ఇక ఆదిత్య బాంజాయ్ సివిల్ ప్రొసీజర్, అడ్మినిస్ట్రేటివ్ లా, ఫెడరల్ కోర్టులు, నేషనల్ సెక్యూరిటీ లా, కంప్యూటర్ క్రైమ్‌కు సంబంధించి అంశాలను బోధించడం, వాటి గురించి రాయడం చేస్తుంటారు. ఇంతకు ముందు ఆయన యుఎస్ సుప్రీంకోర్టులో జస్టిస్ ఆంటోనిన్ స్కాలియాకు లా క్లర్క్‌గాచ అటార్నీ సలహాదారుగా పనిచేశారు. బిమల్ పటేల్ ప్రస్తుతం ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఓవర్‌సైట్ కౌన్సిల్ ట్రెజరీలో డిప్యూటీ అసిస్టెంట్ సెక్రెటరీగా ఉన్నారు. ఇంతకు ముందు ఆయన వాషింగ్టన్‌లో ఫైనాన్షియల్ అడ్వయిజరీ అండ్ రెగ్యులేషన్ ప్రాక్టీస్ సంస్థకు అధిపతిగా, భాగస్వామిగా ఉన్నారు.

మందెయ్... చిందెయ్

- మహారాష్ట్రలో డాన్స్‌బార్లకు సుప్రీం ఓకె
- పలు షరతులు విధింపు

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో డాన్స్‌బార్ల పునః ప్రారంభానికి సుప్రీంకోర్టు గురువారం అనుమతించింది. అయితే ఈ బార్ల లైసెన్సులు, నిర్వహణలపై కొన్ని షరతులు విధించింది. 2016 చట్ట పరిధిలోని కొన్ని నిబంధనలను కొట్టివేస్తున్నట్లు , ఈ డాన్స్‌బార్ల ప్రారంభానికి అనుమతిని కల్పిస్తున్నట్లు న్యాయమూర్తి ఎకె సిక్రీతో కూడిన ధర్మాసనం తెలిపింది. డాన్స్ గర్ల్ ఆటపాటలతో నడిచే ఈ బార్లు రెండేళ్ల క్రితం నిర్దిష్ట నిబంధనలతో మూతపడ్డాయి. ఈ బార్లు విద్యా సంస్థలు, గుడులు, ఇతరత్రా మత ప్రదేశాలకు కనీసం కిలోమీటర్ల దూరంలో ఉండాలని ఆంక్షలు విధించారు. డాన్స్ గర్ల్స్‌కు టిప్స్ ఇవ్వవచ్చు కానీ , కరెన్సీ నోట్లను వారిపై కురిపించడం , వేదిక వద్ద వెదజల్లడం వంటి పనులకు వీలు లేదని స్పష్టం చేశారు. 2016లో మహారాష్ట్ర ప్రభుత్వం ఒక చట్టం తీసుకువచ్చింది. హోటల్స్, రెస్టారెంట్లు, బార్ రూంల్లో అసభ్యకర నృత్యాల ప్రదర్శన మరియు మహిళల మర్యాదల పరిరక్షణ చట్టం రావడంతో ముంబై, పుణే ఇతర ప్రాంతాలలోని అనేకానేక డాన్స్‌బార్లు మూతపడ్డాయి. వీటిలో డాన్స్‌ను జీవనాధారంగా చేసుకుని బతికే ఎందరో యువతులు నానా బాధలకు గురయ్యారు. మహారాష్ట్ర సర్కారు తీసుకువచ్చిన చట్టాన్ని ఎత్తివేస్తున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. డాన్స్‌బార్లలో సిసిటివీ కెమెరాల ఏర్పాటును కూడా గోప్యతా అంశం కారణంగా తొలగించింది. అయితే డాన్స్‌బార్లు తెరిచి ఉండే వేళలపై ఇంతకు ముందు నిర్ణయించినట్లుగా సాయంత్రం ఆరున్నర నుంచి రాత్రి పదకొండు గంటల వరకే ఉండాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. 2015 నుంచి ఇప్పటివరకూ డాన్స్‌బార్ల నిర్వహణకు ఒక్కరికి కూడా లైసెన్సు ఇవ్వకపోవడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. నియంత్రణ ఉండాల్సిందే కానీ దేనిపైనా పూర్తి స్థాయి నిషేధం కుదరదని తమ తీర్పులో తెలిపింది. డాన్స్‌బార్లు మత ప్రదేశాలకు కిలోమీటర్ల దూరం ఉండటం తప్పనిసరి అనే చట్టంలోని నిబంధనలు రాజ్యాంగ వ్యతిరేకం అని పేర్కొన్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ డాన్స్‌బార్లు ఈ మేరకు ఉండేలా చూసుకుంటే మంచిదే అని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టంలోని కొన్ని నిబంధనలను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు మరికొన్నింటిని సమర్థించింది.



అడ్డంకుల తొలిగింపు ఆదేశాలు

బార్‌రూంలు, డాన్స్ గర్ల్స్ వేదికకు మధ్య అడ్డుగా ఏర్పాట్లు ఉండాలనే నిబంధనను కొట్టివేసింది. మహారాష్ట్ర ప్రభుత్వ చట్టాన్ని అక్కడి హోటల్స్, రెస్టారెంట్ల యాజమానులు కొందరు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసి ఇప్పుడు వెలువరించింది. డాన్స్ బార్ల నిర్వహణకు సుప్రీంకోర్టు గతంలో కూడా అనుమతించిందని, అయితే సుప్రీం తీర్పు పరిధిలోకి రాకుండా రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం తాజా చట్టం తీసుకువచ్చి, తమకు అడ్డంకులు కల్పించిందని పిటిషనర్లు తెలియచేశారు. 2017 అక్టోబర్‌లోనే సుప్రీంకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వానికి తాజా డాన్స్‌బార్లకు లైసెన్సులపై ఉత్తర్వులు వెలువరించింది. పాత చట్టాల పరిధిలోనే కొత్త వాటికి అనుమతులు కల్పించాలని ఇందులో పేర్కొంది. ఆ తరువాత అడపాదడపా ఈ మేరకు న్యాయస్థానం నుంచి ఆదేశాలు వెలువడుతూనే వచ్చాయి.

నేనూ ర్యాంప్ వాక్ చేస్తా...



అందాల భామలు ర్యాంప్‌వాక్ చేస్తున్నారు. హఠాత్తుగా అనుకోని అతిథి వేదికపై ప్రత్యక్షమైంది. అదే ఓ వీధికుక్క. ముంబయిలో ఈ ఘటన జరిగింది. బుధవారంనాడు ఇక్కడి బ్యాండ్‌స్టాండ్ ప్రాంతంలో డిజైనర్ రోహిత్ భల్ రూపొందించిన దుస్తులను ధరించి ర్యాంప్ వాక్ చేస్తుండగా కుక్క వచ్చి కాసేపు హల్‌చల్ చేసింది. తొలుత బయపడ్డ మోడళ్లు.. ఆ తర్వాత కాసేపు సరదాగా నవ్వుకున్నారు.

మోడీ విమర్శకులు మూర్ఖపు పిడివాదులు

న్యూయార్క్ నుంచి ఫేస్‌బుక్‌లో జైట్లీ ఎదురుదాడి

న్యూఢిల్లీ : కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై విమర్శలకు దిగేవారు మూస పద్ధతి పిడివారులని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విమర్శించారు. ప్రజల అభిప్రాయం ఒకటి ఉంటే దానికి విరుద్ధంగా ఆలోచించడం వీరి నైజం అని స్పందించారు. వారు కట్టుకథల ఉత్పత్తిదార్లు, అంతేకాకుండా సర్వసత్తాక రీతిలో ఎన్నికైన ప్రభుత్వాన్ని బలహీనపరుస్తున్నారు. ఈ విధంగా ప్రజాస్వామ్యానికి ద్రోహం తలపెడుతున్నారని జైట్లీ స్పందించారు. వైద్య పరీక్షల కోసం అమెరికాలోని న్యూయార్క్‌కు ఆకస్మికంగా వెళ్లిన ఆర్థిక మంత్రి ఫేస్‌బుక్‌లో తమ అభిప్రాయాలు వ్యక్తపరిచారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో అందరికీ భావ స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వాతంత్ర్యం ఉంటుందని, ఈ క్రమంలో అసమ్మతిని వ్యక్తపర్చవచ్చునని, ఇది ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు అని, అయితే అబద్ధాల మిల్లులుగా మారడం వ్యవస్థాగత ద్రోహానికి పాల్పడటమే అవుతుందని , ఈ నైజాలు ప్రజాస్వామ్యానికి పాడికాదని అన్నారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మంచి పనులు ఏమీ చేయలేదనే నమ్మికతో ఉన్నవారు తమను తాము ఆత్మపరిశీలన చేసుకుంటే మంచిదని జైట్లీ సూచించారు. సహేతుక దృక్పథంతో ఉండే వారితోనే దేశాల పటిష్ఠ నిర్మాణం జరుగుతుందని, ఈ విధమైన జాతీయ సమున్నత లక్షణం అత్యవసరం అని, అంతేకానీ ఇటువంటి సొంతవాదనాపరులతో మంచి ఏదీ జరగదని స్పష్టం చేశారు. ఇటువంటి వారికి టన్నుల కొద్దీ అసత్యాలు ప్రచారం చేసుకుంటూ పోతున్నా, ఏమీ అన్పించదని వారంతా దేశానికి నష్టం కల్గించే తరహా మాటలకు దిగుతుంటారని విమర్శించారు. వారు అనినీతిలో ఘనులు, అయితే అవినీతి జరుగుతోందని గోలపెడుతారు. ఈ విధంగా వారు ద్వంద్వ ప్రమాణాలకు దిగుతుంటారని , ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకం అని విమర్శించారు. ప్రభుత్వం చేపట్టే అన్ని పనులను విమర్శించడమే వీరి పనిగా మారిందని, పదిశాతం కోటా, రాఫెల్ డీల్ ఈ విధంగా చెపుతూ పోతే, అన్నింటిపైనా వారు దుమ్మెత్తి పోస్తుంటారని, మోడీ ప్రభుత్వం ఏది చేస్తే దానిని నిందించడం పనిగా పెట్టుకున్నారని తెలిపారు.



Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666